

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

డిసెంబర్, 2025

సంపుటి - 11 | సంచిక-12 | పేజీలు- 52 | వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక




కేంద్ర విత్తన బిల్లు - 2025 ముసాయిదాపై రాష్ట్రస్థాయి సంప్రదింపుల సమావేశంలో ప్రసంగిస్తున్న వ్యవసాయ శాఖ మాత్యులు గౌ॥ శ్రీ తుమ్మల నాగేశ్వర రావు




కేంద్ర విత్తన బిల్లు - 2025 ముసాయిదాపై రాష్ట్రస్థాయి సంప్రదింపుల సమావేశంలో ప్రసంగిస్తున్న వర్సిటీ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య



బిఎస్సీ (అగ్రికల్చర్) కోర్సుని సంయుక్తంగా అందించేందుకు విశ్వవిద్యాలయం మరియు వెస్టర్న్ సిడ్నీ యూనివర్సిటీల మధ్య కీలక ఒప్పందం



ఇగ్నైటింగ్ లీడర్‌షిప్ ఇన్ బయోడైవర్సిటీ టు అటైన్ హార్మోనీ విత్ నేచర్ అండ్ సస్టేనబుల్ డెవలప్‌మెంట్ అనే అంశంపై ప్రసంగిస్తున్న శ్రీ సి. అచలేందర్ రెడ్డి, రిటైర్డ్ ఐఎఫ్ఎస్ ఆఫీసర్ & ఎక్స్ చైర్మన్, నేషనల్ బయోడైవర్సిటీ ఆథారిటీ ఆఫ్ ఇండియా



జీవ వ్యర్థాల నుండి ఆరు గంటల్లో జీవ ఎరువులు తయారుచేసే పరిజ్ఞానాన్ని అందించే బయోవే వియాత్నం సంస్థతో విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం




వ్యవసాయ కళాశాల, సిరిసిల్లలో గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా మొక్కలు నాటుతున్న విద్యార్థులు

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

డిసెంబర్, 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర మార్గశిర శుద్ధ ఏకాదశి నుండి పుష్య శుద్ధ ద్వాదశి వరకు



## సంపాదక వర్గం



### ప్రధాన సంపాదకులు

**డా॥ సి. పద్మవేణి**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

### సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు

**డా॥ పి. లీలా రాణి**

ప్రధాన శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) & హెడ్

**డా॥ బి. పద్మజ**

ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) & హెడ్

### పర్యవేక్షణ

**డా॥ ఆర్. సునీత దేవి**

ప్రధాన శాస్త్రవేత్త, (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు. డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



**చిరునామా :**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం

ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.

తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380

e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


**పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.**

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం.................................5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు...............6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ....................12
4. సాంకేతిక వ్యాసాలు
   - యాసంగి వరినారుకి తీసుకోవలసిన జాగ్రత్తలు.............13
   - రబీ సీజన్‌లో జింక్ వినియోగం - వరి పంట అభివృద్ధికి కీలకం.....................15
   - యాసంగిలో వరిని ఆశించే అగ్గితెగులు - యాజమాన్యం.. 17
   - రైతుస్థాయిలో లాభసాటిగా మొక్కజొన్న విత్తనోత్పత్తి - పాటించవలసిన సాంకేతిక మెళకువలు......................18
   - కంది పంట పూత మరియు కాత దశలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు.....................20
   - వానాకాలం వరి సాగులోని పోషక అవశేషాలతో యాసంగి పెసర మరియు మినుము సాగులో ఎరువుల ఆదా.........22
   - వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్..........................25
   - వ్యవసాయ విద్యా దినోత్సవం ప్రాముఖ్యత..................26
   - వ్యవసాయ పదవినోదం..................................28
   - చెఱకు నాణ్యతను ప్రభావితం చేసే అంశాలు...............29
   - యాసంగి పశుగ్రాస పంటల యాజమాన్యం...............31
   - మామిడిలో పూతకు ముందు మరియు పూత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు..............................33
   - పంట చేలను తగులబెట్టవద్దు.............................35
   - కానుగ (పొంగామియా పిన్నెట) సాగులో మెళకువలు.......36
   - విత్తన బిల్లు ముసాయిదా 2025 - ముఖ్య అంశాలు....... 37
   - 'అందాల ఆస్టర్స్'...........................................39
   - డిసెంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు.............................................40
   - జీనోమ్ సేవియర్ అవార్డు: భారత వ్యవసాయ జీవవైవిధ్యం సంరక్షణకు గౌరవం.......................................42
   - "జాతీయ పశుసంపద మిషన్ - గ్రామీణ అభివృద్ధికి కొత్త దిశ"...............................................44
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు............................................ 46
6. రైతన్నకో ప్రశ్న................................................47
7. విశ్వవిద్యాలయ వార్తలు........................................48
8. రైతు విజయగాథ
   - యాసంగిలో జీరో టిల్లేజ్ పద్ధతిలో వరి తర్వాత ప్రొద్దుతిరుగుడు సాగుతో అధిక లాభం ఆర్జిస్తున్న రైతు విజయగాథ..............................................49

# డిసెంబర్ మాసం క్యాలెండర్ - 2025

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర మార్గశిర శుద్ధ ఏకాదశి నుండి పుష్య శుద్ధ ద్వాదశి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| | 1 మార్గశిర శుద్ధ<br>ఏకాదశి ప. 2-18<br>రేవతి రా. 7-49<br>ఉ.వ. 8-24 ల<br>9-55 | 2 ద్వాదశి ప. 12-15<br>అశ్విని సా. 6-25<br>ప.వ. 2-38 ల<br>4-09<br>తె.వ. 3-23 ల<br>4-52 | 3 త్రయోదశి<br>ఉ. 10-02<br>భరణి సా. 4-51<br>తె.వ. 4-01 ల<br>5-31 | ○ 4 చతుర్దశి ఉ. 7-42<br>పూర్ణిమ తె. 5-21<br>కృత్తిక ప. 3-12<br>తె.వ. 6-06 ల | 5 మార్గశిర బ॥ పాడ్యమి<br>తె. 3-04<br>రోహిణి ప. 1-34<br>ఉ.శే.వ. 7-35 వ<br>రా.వ. 6-47 ల<br>8-17 | 6 విదియ రా. 12-54<br>మృగశిర ప. 11-59<br>రా.వ. 7-52 ల<br>9-23 |
| 7 తదియ రా. 10-58<br>ఆర్ద్ర ఉ. 10-34<br>రా.వ. 10-00 ల<br>11-31 | 8 చవితి రా. 9-20<br>పునర్వసు ఉ. 9-25<br>సా.వ. 5-08 ల<br>6-40 | 9 పంచమి రా. 8-01<br>పుష్యమి ఉ. 8-34<br>రా.వ. 9-06 ల<br>10-40 | 10 షష్ఠి రా. 7-08<br>ఆశ్రేష ఉ. 8-06<br>రా.వ. 8-05 ల<br>9-41 | 11 సప్తమి సా. 6-44<br>మఘ ఉ. 8-05<br>సా.వ. 4-14 ల<br>5-51 | 12 అష్టమి సా. 6-50<br>పుబ్బ ఉ. 8-33<br>సా.వ. 4-02 ల<br>5-42 | 13 నవమి రా. 7-27<br>ఉత్తర ఉ. 9-32<br>సా.వ. 6-26 ల<br>8-08 |
| 14 దశమి రా. 8-34<br>హస్త ఉ. 10-59<br>రా.వ. 7-37 ల<br>9-21 | 15 ఏకాదశి<br>రా. 10-08<br>చిత్ర ప. 12-54<br>రా.వ. 7-02 ల<br>8-47 | 16 ద్వాదశి<br>రా.12-01<br>స్వాతి ప.3-11<br>రా.వ.9-22 ల<br>11-08 | 17 త్రయోదశి<br>రా. 2-09<br>విశాఖ సా. 5-42<br>రా.వ. 10-08 ల<br>11-54 | 18 చతుర్దశి తె. 4-26<br>అనూరాధ<br>రా. 8-19<br>రా.వ. 2-30 ల<br>4-16 | ● 19 అమావాస్య<br>తె. 6-23<br>జ్యేష్ఠ రా. 10-51<br>వర్జ్యము లేదు | 20 పుష్య శుద్ధ పాడ్యమి పూర్తి<br>మూల రా. 1-09<br>ఉ.వ. 7-37 ల<br>9-22<br>రా.వ. 11-24 ల<br>1-09 |
| 21 పాడ్యమి ఉ. 8-12<br>పూర్వాషాఢ<br>తె. 3-06<br>ప.వ. 11-32 ల<br>1-16 | 22 విదియ<br>ఉ. 9-33<br>ఉత్తరాషాఢ<br>తె. 4-39<br>ఉ.వ. 11-38 ల<br>1-20 | 23 తదియ<br>ఉ. 10-27<br>శ్రవణం తె. 5-41<br>ఉ.వ. 8-49 ల<br>10-30 | 24 చవితి ఉ. 10-50<br>ధనిష్ఠ తె. 6-14<br>ఉ.వ. 9-47 ల<br>11-26 | 25 పంచమి<br>ఉ. 10-42<br>శతభిషం<br>తె. 6-18<br>ప.వ. 1-27 ల<br>3-03 | 26 షష్ఠి ఉ. 10-05<br>పూర్వాభాద్ర<br>తె. 5.55<br>ప.వ. 12-36 ల<br>2-11 | 27 సప్తమి ఉ. 9-01<br>ఉత్తరాభాద్ర<br>తె. 5-08<br>ప.వ. 3-12 ల<br>4-45 |
| 28 అష్టమి ఉ. 7-35<br>నవమి తె. 5-43<br>రేవతి తె. 4-03<br>సా.వ. 4-36 ల<br>6-08 | 29 దశమి తె. 3-40<br>అశ్విని రా. 2-42<br>రా.వ. 10-55 ల<br>12-26 | 30 ఏకాదశి<br>రా. 1-27<br>భరణి రా. 1-10<br>ప.వ. 11-42 ల<br>1-11 | 31 ద్వాదశి<br>రా. 11-08<br>కృత్తిక రా. 11-32<br>ప.వ. 12-21 ల<br>1-50 | | | |

**25 క్రిష్టమస్** **26 బాక్సింగ్ డే** **24 క్రిష్టమస్ ఈవ్**

### జ్యేష్ఠ కార్తె (3.12.25 నుండి 15.12.25)

వరి : దీర్ఘకాలిక రకాల కోతలు, రబీ నారుమళ్ళకు ఎరువులు వేయుట, సస్యరక్షణ, ధాన్యాన్ని ఆరబెట్టుట

మొక్కజొన్న : అంతరకృషి, సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట.

గోధుమ : అంతరకృషి, సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట.

కాయధాన్యాలు : దీర్ఘకాలిక కంది రకాలు కోతకు వచ్చుట.

చెఱకు : నరుకుట, బెల్లం తయారీ.

ఆముదం : దీర్ఘకాలిక రకాల కాయ తీయుట ప్రారంభించుట.

### మూల కార్తె (16.12.25 నుండి 28.12.25)

వరి : నారుమడికి ఎరువులు వేయుట, రబీ వరినాట్లకు పొలం తయారు చేయుట.

మొక్కజొన్న : అంతరకృషి, సస్యరక్షణ, ఎరువులు వేయుట.

గోధుమ : సస్యరక్షణ, రసాయనిక ఎరువులు వేయుట.

రాగులు : రాగి విత్తుట.

కాయధాన్యాలు : పెసర, మినుములను వరి పండించిన భూముల్లో విత్తుట, కంది కోతలు, కంది మొదెం పంటగా సాగుచేయుట.

చెఱకు : తెలంగాణా జిల్లాల్లో నాట్లు.

వేరుశనగ : వరి పండించిన చేలలో విత్తుట.

# వ్యవసాయ పురోగతికి విస్తరణ సేవలు కీలకం...



అల్దాస్ జానయ్య
**ఉపకులపతి**

భారతదేశ సుస్థిరత మరియు తెలంగాణ అభివృద్ధికి వ్యవసాయం మూలాధారం. స్థూల జాతీయ ఉత్పత్తిలో 16 శాతం వాటా కలిగియున్న వ్యవసాయం పై 58 శాతం ప్రజలు ఆధారపడి జీవిస్తున్నారు. పెరుగుతున్న జనాభ దృష్ట్యా గత కొన్ని సంవత్సరాలుగా దాదాపు 70.60 లక్షల కమతాలతో (2021) సరాసరి వ్యవసాయ కమతాలు తగ్గిపోతూ 1.00 హెక్టారు (2015-16) నుండి 0.89 హెక్టారుగా (2021-22) గా చూడవచ్చు మరియొక వైపు జనాభా పెరుగుదల, వాతావరణ మార్పు వంటి విషయాలు భవిష్యత్ వ్యవసాయ రంగాన్ని తీవ్ర ప్రభావితం చేస్తాయనటంలో ఎలాంటి సందేహం లేదు. వివిధ గణాంకాల ప్రకారం వ్యవసాయ పరిశోధనలో గణనీయ అభివృద్ధి సాధించినప్పటికినీ అనుకున్న విధంగా రైతుల పొలాల్లో ఫలితాలు చూడలేకపోతున్నాము. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో వివిధ పథకాల ద్వారా శాస్త్ర సాంకేతిక పరిశోధన ఫలితాలు రైతులకు చేరవేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ చాలా రకాల సమస్యలతో రైతులు సతమతమవుతున్నారు.

ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నూతన రకాలను రైతులకు అందించటం, సమగ్ర వ్యవసాయ విధానాలు రైతులకు చేరవేయటం, యాంత్రీకరణ దిశగా రైతులను ప్రోత్సహించడం, రైతు సాధికారతలో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంస్థలను బలోపేతం చేయటం, కాలానుగుణంగా పంటలను సాగుచేసే విధంగా రైతులకు అవగాహన కల్పించటం, యువతను, మహిళా స్వయం సహాయక గ్రూపులను వ్యవసాయం వైపుకు ప్రోత్సహించటం, వివిధ పంటలకు విలువ జోడింపు, మార్కెట్ మౌలిక సదుపాయాల కల్పన, ప్రెసిషన్ ఫార్మింగ్ ద్వారా వనరుల సామర్థ్యం పెంచటం, రైతు ఆవిష్కరణలను ప్రోత్సహించటం వంటి అంశాలు రైతు స్వావలంభనకు ప్రధాన భూమిక పోషిస్తాయి.

పై విషయాలలో రైతులకు లబ్ధి చేకూరాలంటే పటిష్ట వ్యవసాయ విస్తరణ అనేది ఆవశ్యం. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పరిశోధన మరియు బోధనతో పాటు విస్తరణపై కూడా సమగ్ర ప్రణాళికతో ముందుకెళ్తుంది. వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని 8 కృషి విజ్ఞాన కేంద్రాలు, 23 తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రాలు ఈ దిశగా రైతుల ముంగిట్లోకి ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని చేరవేయడానికి అహర్నిశలు ప్రయత్నం చేస్తున్నాయి. మారుతున్న కాలానుగుణంగా, విశ్వవిద్యాలయ పరిధిలోని ఎలక్ట్రానిక్ మీడియా విభాగం, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ, నేరుగా రైతుల వద్దకు చేరే విధంగా రైతునేస్తం కార్యక్రమం ద్వారా పలు వ్యవసాయ సంబంధిత పంటల సమస్యలకు వేగంగా రైతు వేదికల ఆధారంగా సమాచారం చేరవేయడం జరుగుతుంది. అలాగే, విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని యూట్యూబ్ ఛానల్ అతి తక్కువ కాలంలోనే దేశంలోనే ప్రభావవంత యూట్యూబ్ ఛానల్‌గా రూపొందుకొని ముందుకు సాగుతుంది. అంతేకాకుండా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం ద్వారా రైతులకు సాగు సంబంధిత అంశాలపై అవగాహన కల్పించడం, గ్రామగ్రామాన విత్తన పంపిణీ కార్యక్రమం వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా రైతులకు మరింత చేరువయింది.

రైతు శ్రేయస్సే అంతిమ లక్ష్యంగా పురోగమిస్తున్న వ్యవసాయ విశ్వవిద్యాలయం మున్ముందు కూడా రైతులు ఎదుర్కొనే సాంకేతిక సమస్యలకు తగు విధంగా స్పందిస్తూ భవిష్యత్ కార్యచరణా ప్రణాళికలను రూపొందించుకొని ఆచరణలో పెడుతుంది. మన రైతాంగం వ్యవసాయ విశ్వవిద్యాలయ సేవలను సమర్ధవంతంగా వినియోగించుకుంటూ సాగు రంగంలో ముందడుగు వేస్తూ ఆర్థికంగా పురోభివృద్ధిని సాధిస్తారని ఆశిస్తూ...

(అల్దాస్ జానయ్య)
**ఉపకులపతి**



## వరి

- యాసంగి కాలంలో సాగు చేయడానికి స్వల్పకాలిక దొడ్డు గింజ రకాలైన జగిత్యాల రైస్-1, కెఎన్ఎమ్-118, ఎమ్‌టియు 1010, తెల్లహంస, ఆర్ఎన్ఆర్ 29325, సన్నగింజ రకాలైన తెలంగాణ సోన, డబ్ల్యుజిఎల్ 962, జగిత్యాల సాంబ, జగిత్యాల సన్నాలు, నెల్లూరి మషూరి, ఆర్ఎన్ఆర్ 21278, కెఎన్ఎమ్ 733 వంటి రకాలను డిసెంబర్ 15 వరకు నార్లు పోసుకునే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితుల్లో స్వల్పకాలిక రకాలను మాత్రమే సాగు చేయాలి.
- తెలంగాణ రాష్ట్రంలో ఆలస్యంగా నార్లు పోసుకున్నప్పుడు (డిసెంబర్ 20 తర్వాత) ముఖ్యంగా వరి గింజకట్టేటప్పుడు ఉండే అధిక ఉష్ణోగ్రతల వల్ల సన్నగింజ రకాలలో పగుళ్ళు ఏర్పడి నూక శాతం అధికంగా ఉంటుంది. కనుక ఏప్రిల్ మొదటి వారం వరకు వరికోతలు పూర్తయ్యేలా రకాలను ఎంచుకొని ప్రణాళిక ప్రకారంగా సాగు చేసుకోవాలి.
- ఈ వానాకాలంలో పండించిన విత్తనాలను యాసంగిలో సాగు చేయాలనుకున్నట్లైతే ఎంపిక చేసుకున్న రకాన్ని బట్టి, నిద్రావస్థ రోజులను బట్టి గాఢ నత్రికామ్లంను తీసుకొని ఆ ద్రావణంలో కిలో విత్తనాన్ని 24 గంటలు నానబెట్టి తదుపరి శుభ్రంగా కడిగి మండె కట్టాలి. రెండు వారాల నిద్రావస్థ గల తెలంగాణ సోన మరియు యమ్‌టియు 1010 రకాలను లీటరు నీటికి 6.5 మి.లీ. మరియు 3 వారాల నిద్రావస్థ గల కూనారం సన్నాలు రకానికి 10 మి.లీ. గాఢ నత్రికామ్లంను ఉపయోగించాలి.
- యాసంగిలో తెగుళ్ళ ఉధృతి (అగ్గితెగులు) అధికంగా ఉంటుంది. కావున విత్తనశుద్ధి కొరకు దమ్ము చేసిన నారుమడులకు లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ కలిపిన ద్రావణంలో 24 గంటలు నానబెట్టి తరువాత మండెకట్టి మొలకలను నారుమడిలో చల్లుకోవాలి.
- యాసంగి నారుమడి తయారీలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ఒక ఎకరానికి సరిపడా నారుమడికి 2 క్వింటాళ్ళ బాగా మాగిన కోళ్ళ లేదా గొర్రెల ఎరువు లేదా వర్మీకంపోస్ట్ వేసి కలియదున్నాలి. నారు అదుగులో కిలో నత్రజని, 2 కిలోల భాస్వరం, ఒక కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. నారు 15-20 రోజుల దశలో పైపాటుగా ఒక కిలో నత్రజని (2 కిలోల యూరియా) వేసుకోవాలి.
- ముఖ్యంగా డిసెంబర్ మాసంలో చలి ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో నారుమడిలో మొక్కలు ముదురు ఆకులు పసుపు రంగులోకి మారి నారు ఎదుగుదల లోపిస్తుంది. చలి యాజమాన్య చర్యలు చేపట్టాలి. అందులో భాగంగా రాత్రిపూట నారుమడిలో నీరు ఉంచి ఉదయాన్నే చల్లటి నీటిని తీసివేసి కొత్త నీరు పెట్టాలి. చలి తీవ్రత ఎక్కువైన సందర్భంలో 19:19:19 5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- నారుమడిలో జింక్ లోప లక్షణాలు గమనించినట్లైతే జింక్ సల్ఫేట్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- యాసంగిలో కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉంటుంది. కనుక నాటడానికి వారం రోజుల ముందు ఎకరానికి సరిపడా నారుమడికి 800 గ్రా. కార్బోఫ్యూరాన్ 3సిజి గుళికలను వేయాలి.
- యాసంగిలో అగ్గితెగులు ఆశించే అవకాశం ఎక్కువగా డిసెంబర్-ఫిబ్రవరి మాసంలో నారుమడి మరియు ప్రధాన పొలంలో ఉంది. కావున నివారణకు ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- ప్రధాన పొలాన్ని బాగా మురగనిచ్చి (10-12 రోజులు) దమ్ము చేసి చదును చేసుకోవాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 50 కిలోల డిఎపి, 15 కిలోల యూరియా మరియు 14 కిలోల పొటాష్ వేసుకోవాలి.
- నారు ఆరోగ్యకరంగా పెరగడానికి పైపాటుగా యూరియా వేసినప్పుడు ఒక కిలో యూరియాకి 2.5 గ్రా. కార్బండాజిమ్ 25% + మ్యాంకోజెబ్ 50% డబ్ల్యుఎస్ మిశ్రమ మందును కలిపి వేసుకోవాలి.

**డా॥ ఐ. స్వర్ణలత దేవి, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8333818218**



## మొక్కజొన్న

డిసెంబర్ మాసంలో 30-40 రోజులదశలో ఉన్న యాసంగి మొక్కజొన్న పైరుకు పైపాటుగా రెండవ దఫా నత్రజని ఎరువు ఎకరాకు 50 కిలోల యూరియా రూపంలో వేయాలి. అంతరకృషి జరిపి మట్టిని మొక్కమొదళ్ళకు ఎగదోయాలి. తొలిదశలో నున్న మొక్కజొన్నను కాండం తొలుచు పురుగు మరియు కత్తెరపురుగు ఆశించే అవకాశం ఉన్నది. కావున మొలచిన 12-15 రోజుల దశలో వీటి నివారణకు లీటరు నీటికి 0.4 మి.లీ చొప్పున క్లోరాంట్రానిలిప్రోల్ పిచికారి చేయాలి.

పూతదశకు ముందు నుండి గింజ పాలుపోసుకునే దశ వరకు మొక్కజొన్న బెట్టను తట్టుకోలేదు. ఈ దశలో నీటి తడిని తప్పనిసరిగా ఇవ్వాలి లేకపోతే దిగుబడి తగ్గుతుంది. 40-50 రోజుల దశలో రెండవ దఫాగా మరియు 50-60 రోజుల దశలో మూడవ దఫాగా నత్రజని వేయాలి. రెండవ దఫా మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎకరాకు 25 కిలోలు మూడవ దఫా నత్రజనితోపాటుగా వేయాలి.

పూతదశలో పైరు బెట్టకు గురి అయినచో కాండం కుళ్ళు తెగులు ఆశించును. కాబట్టి తప్పక నీటి తడులివ్వాలి. ఆకుమాడు/ ఆకుఎండు తెగుళ్ళు సోకకుండా మాంకోజెబ్ 2.5 గ్రా. 1 లీ. నీటికి కలిపి ఎకరాకు 200 లీటర్ల మందు ద్రావణం పిచికారి చేయాలి. పొడతెగులు లక్షణాలు గమనించినచో ప్రోపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి నివారించుకోవచ్చు.

వానాకాలం వరి తర్వాత జీరోటిల్లేజ్ పద్ధతిలో మొక్కజొన్నను డిసెంబర్‌లోగా విత్తుకోవచ్చు. వరిమాగాణుల్లో భూమిని దున్నడం ఉండదు కనుక కలుపు ఎక్కువగా వస్తుంది కాబట్టి కలుపు నివారణకు ఎకరాకు 1.0 కిలో అట్రజిన్ 50% పొడిమందు మరియు వరిదుబ్బులు చిగురు వేయకుండా 1.0 లీటరు పారాక్వాట్‌ను 200 లీటర్ల నీటికి కలిపి విత్తిన 48 గంటలలోపు నేల మరియు దుబ్బులు బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి. మొక్కజొన్న మొలచిన తరువాత పారాక్వాట్ కలుపు మందు పిచికారి చేయరాదు. మిగతా యాజమాన్య పద్ధతులైన ఎరువులు అందజేయుట మరియు సస్యరక్షణ సాధారణ యాసంగి మొక్కజొన్న పంటకు ఆచరించినట్లుగానే వరి మాగాణుల్లో సాగు చేసిన మొక్కజొన్నకు కూడా పాటించాలి.

## చిరుధాన్యాలు

**యాసంగి జొన్న:** యాసంగి జొన్న పంట విత్తిన 30-35 రోజుల దశలో కాండం తొలుచు పురుగు ఆశిస్తుంది. నివారణకు ఎకరాకు 4 కిలోల కార్బోఫ్యురాన్ 3సిజి గుళికలను కాండం సుడులలో వేయాలి. గుంటక లేదా దంతితో వరుసల మధ్య అంతర కృషి చేసుకోవాలి.

**రాగి:** యాసంగిలో రాగి పంటను నవంబర్-డిసెంబర్ మాసంలో విత్తుకోవాలి. నాటే పద్ధతిలో 2 కిలోల విత్తనం లేదా వెదజల్లే పద్ధతిలో 3-4 కిలోల విత్తనం అవసరం అవుతుంది. విత్తనశుద్ధికి గాను కిలో విత్తనానికి 2 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. మ్యాంకోజెబ్ మందును వాడాలి. 5 సెంట్ల నారు ఒక ఎకరాకు సరిపోతుంది. వరుసల మధ్య 30 సెం.మీ., మొక్కల మధ్య 10 సెం.మీ., దూరం ఉండేటట్లు నాటుకోవాలి. కలుపు నివారణకు నాటే ముందు తడినేలపై పెండిమిథాలిన్ మందును 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. నాటిన మూడు వారాలలోపు అంతరకృషి, కలుపు మరియు ఒత్తు మొక్కలను తీసివేయాలి. పూతదశలో పైరు నీటి ఎద్దడికి గురికాకుండా చూసుకోవాలి.

**కొర్ర:** నవంబర్‌లో వేసుకున్న కొర్ర పంటలో దంతి లేదా గుంటకతో అంతర సేద్యంచేయాలి. ఒత్తు మొక్కలను మూడు వారాలలోపు తీసివేయాలి.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9182968409**

## వేరుశనగ

- యాసంగిలో సాగు చేసిన వేరుశనగ ప్రస్తుతం 45-50 రోజుల దశలో ఉంది. సాధారణంగా ఈ దశలో ఊడలు దిగుతాయి. కాబట్టి ఎకరానికి 200 కిలోల జిప్సంను వేసుకోవాలి.
- ఈ దశలో వేరుశనగలో ఆకుముడత, పొగాకు లద్దెపురుగు మరియు తామర పురుగులు ఆశిస్తాయి.



- ఆకుముడత పురుగు ఉధృతిని ఎక్కువగా గమనించినప్పుడు ఒక లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా డెల్టామెత్రిన్ 0.5 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ 0.4 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి.
- పొగాకు లద్దెపురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5% వేపగింజల కషాయం పిచికారి చేయాలి. ఎదిగిన లార్వాలను నివారించేందుకు నొవాల్యురాన్ 1 మి.లీ. లేదా ఫ్లూబెండమైడ్ 0.6 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. దీని ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఫ్లూబెండమైడ్ + హెక్సాకొనజోల్ 3 మి.లీ. లేదా క్లోరోఫెనాఫైర్ 2 మి.లీ. లేదా నొవాల్యురాన్ + ఇండాక్సాకార్బ్ 1.75 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- పెద్ద లార్వాలను విషపు ఎర ఉపయోగించి నివారించవచ్చు. ఇందుకు గాను 10 కిలోల తవుడు, ఒక కిలో బెల్లం, ఒక లీటరు మోనోక్రోటోఫాస్ లేదా లీటరు క్లోరిపైరిఫాస్ మందును కలిపి, తగిన నీటితో ఉండలుగా చేసిన ఎరను తయారు చేసుకొని సాయంత్రం వేళ సమానంగా ఒక ఎకరా పొలంలో చల్లి, ఈ పురుగు ఉధృతిని నివారించుకోవచ్చు.
- తామర పురుగుల నివారణకు థయోమిథాక్సామ్ 0.5 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- తిక్కా ఆకుమచ్చ తెగులు మరియు కాండం కుళ్ళు తెగుళ్ళ నివారణకు 200 మి.లీ. టెబ్యుకొనజోల్ 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.
- ఆలస్యంగా నాటిన వేరుశనగ ప్రస్తుతం 20 నుండి 30 రోజుల దశలో ఉంది. సాధారణంగా మొదలు కుళ్ళు తెగులు ఉధృతి ఈ దశలో ఎక్కువగా ఉంటుంది. మొదలు కుళ్ళు తెగులు ఎక్కువగా ఉన్నట్లైతే కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ శిలీంధ్రనాశినిని 2 మి.లీ. ఒక లీటరు నీటిలో కలిపి మొదలు తడిచేటట్లు పిచికారి చేసుకోవాలి.

## ఆముదం

- ప్రస్తుతం వానాకాలంలో సాగు చేసిన ఆముదం కోత దశలో ఉంది. ఒక గెలలో 80 శాతం కాయలు ఎండినట్లైతే అటువంటి గెలలను కోసుకోవాలి. కోసిన తరువాత గెలలను రెండు మూడు రోజుల నీడలో ఉంచి తరువాత ఎండబెట్టి పలకలతో కొట్టి విత్తనాన్ని వేరుచేసుకోవాలి.
- యాసంగి ఆముదం విత్తిన సమయాన్ని బట్టి ప్రస్తుత 30, 45, 60 రోజుల దశల్లో ఉన్నది. విత్తిన 30, 60, 90 రోజుల తరువాత ఎకరానికి 15 కిలోల యూరియాను పైపాటుగా వేసుకోవాలి. వేసుకునే ముందు పొలంలో తేమ ఉండేటట్లు చూసుకోవాలి.
- తేలికపాటి నేలల్లో నాటినట్లైతే పంటకి 10 రోజుల వ్యవధిలో, బరువైన నేలల్లో అయితే 15 రోజుల వ్యవధిలో నీటితడులను ఇవ్వడం మంచిది. కలుపుని బట్ట అంతరకృషి చేసుకోవాలి. 60 రోజుల తరువాత అంతరకృషి చేయవలసిన అవసరం ఉండదు.
- ఎండుతెగులును గమనించినట్లైతే 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మొదళ్ళు తడిచే విధంగా పిచికారి చేసుకోవాలి.
- రసం పీల్చు పురుగులైన పచ్చదీపపు పురుగులు, తామర పురుగులు, తెల్లదోమ నివారణకు 2 మి.లీ. ప్రొఫెనోఫాస్ లేదా ఎసిటామిప్రిడ్ 0.2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- లద్దె పురుగు మరియు దాసరి పురుగు ఆశించినట్లైతే లీటరు నీటికి 1 మి.లీ. నొవాల్యురాన్ కలిపి పిచికారి చేసుకోవాలి.
- కాయ తొలుచు పురుగు నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

## కుసుమ

- అక్టోబర్‌లో వేసిన పంటకు తడి కట్టేటప్పుడు ఎకరానికి 10–15 కిలోల యూరియాను వేసుకోవాలి.
- నవంబర్ మాసంలో విత్తుకున్న కుసుమ పంటలో ఒత్తుగా ఉన్న మొక్కలను తీసివేసి పంటను పల్చన చేసుకోవాలి. కీలక దశల్లో



## అపరాలు

(కాండం సాగే దశలో అనగా 30-35 రోజులు, పూత దశలో 65-75 రోజులు) తడి ఇచ్చుకున్నచో 40-60% దిగుబడి పెరుగును.

- ఆల్టర్నేరియా ఆకుమచ్చ తెగులు నివారణకు 2.5 గ్రా. మ్యాంకోజెబ్ లీటరు నీటిలో కలిపి 7-10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.
- ఈ దశలో పేనుబంక తాకిడి ఎక్కువగా ఉంటుంది. పేనుబంక నివారణకు ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

## ప్రొద్దుతిరుగుడు

- ఆగష్టు మాసంలో విత్తిన పంట కోత దశలో ఉంటుంది.
- అక్టోబర్ మాసంలో వేసిన పంటకు రెండవ దఫా యూరియాని పైపాటుగా వేసుకోవాలి. ఆకర్షణ పత్రాలు వికసించే దశలో లీటరుకి 20 గ్రా. బొరాక్స్ కలిపి పిచికారి చేసుకోవాలి.
- నవంబర్‌లో వేసిన ప్రొద్దుతిరుగుడులో ఒత్తుగా ఉన్న మొక్కలను పల్చగా చేయవలెను. అంతరసేద్యం చేసి కలుపు నివారణ చేసుకోవాలి. విత్తిన 30-35 రోజులు మొదటి దఫా నత్రజని ఎరువులు వేసుకోవాలి.
- గంధకం తక్కువగా ఉన్న భూముల్లో ఎకరాకు 55 కిలోల జిప్సం వేస్తే నూనెశాతం పెరుగును.
- బెట్టకు గురి అయినప్పుడు పంటలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది. వీటి నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 4 మి.లీ. 10 లీటర్ల నీటిలో కలిపి రెండుసార్లు పిచికారి చేసుకోవాలి.
- బూడిద తెగులు ఆశిస్తే ప్రొపికొనజోల్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ ఎమ్. శ్రీధర్, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 8186945838**

**కంది:** తొలకరిలో వేసిన కంది పూత, కాయ దశలలో ఉంది. ఈ పంటకు మారుకా మచ్చల పురుగు మరియు కాయ ఈగ ఆశించే అవకాశం ఉంది. మారుకా మచ్చల పురుగు నివారణకు,

- పైరు పూత దశకు రాకముందు నుండే తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలి. పూత ప్రారంభ దశలో తప్పనిసరిగా పైరుపై 5% వేపగింజల కషాయం లేదా వేపనూనె 5.0 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసినట్లైతే రెక్కల పురుగులు గ్రుడ్లు పెట్టకుండా నివారించవచ్చు.
- మొగ్గ, పూత దశలో అక్కడక్కడా కొన్ని పూమొగ్గలను సేకరించి వాటిని తెరిచి పిల్ల పురుగులు కనిపించినట్లైతే వెంటనే క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.0 గ్రా. లేదా ఎసిఫేట్ 1.5 గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- పంటలో గూళ్ళు గమనించినట్లైతే నివారణకు ఒక లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. లేదా నొవాల్యురాన్ 1.0 మి.లీ. ఏదో ఒక మందును కలిపి పిచికారి చేయాలి. మరల అవసరమైతే మందులను మార్చి మార్చి 2-3 సార్లు పూత మరియు కాయ దశల్లో పిచికారి చేయాలి.
- పురుగు ఉధృతి అధికంగా గమనించినప్పుడు స్పైనోశాడ్ 0.3 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా ఫ్లూబెండమైడ్ 0.2 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.
- కాయ ఈగ నివారణకు పింద దశలో థయోక్లోప్రిడ్ 0.7 మి.లీ. లేదా డైమిథోయేట్ 2.0 మి.లీ. లేదా ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**వెర్రి తెగులు:** ఇది కందిలో ఇరియోఫిడ్ నల్లి ద్వారా వ్యాప్తి చెందే వైరస్ తెగులు. ఇది ఆశించిన మొక్క ఆకుల మీద ఆకుపచ్చ, పసుపు వర్ణపు మచ్చలు ఏర్పడి పూత, కాయ ఏర్పడదు. తెగులును వ్యాప్తి చేసే నల్లి నివారణకు స్పైరోమెసిఫిన్ 1.0 మి.లీ. లేదా ప్రొపార్గైట్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.



**యాసంగి పెసర / మినుము:** పెసర/మినుము ప్రస్తుతం పిందె నుండి కాయ తయారయ్యే దశలో ఉన్నది. కావున నీటి ఎద్దడికి గురికాకుండా చూడవలెను. అవసరాన్ని బట్టి తేలికపాటి తడి ఇచ్చినచో దిగుబడి పెరుగును. 20 గ్రా. యూరియా లేదా 1.0 మి.లీ. లేదా ప్రొపార్గైట్ 2 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

మల్టీ-కె లీటరు నీటికి కలిపి పిచికారి చేసినచో దిగుబడితోపాటు గింజ నాణ్యత కూడా పెరుగుతుంది. ఆలస్యంగా విత్తిన యాసంగి పెసర/మినుము పంటలు మొగ్గ, పూత దశలో ఉన్నవి. మొగ్గ దశలో తేలికపాటి తడి ఇచ్చినచో సమంగా పూతకు వచ్చి పిందె బాగా నిలుస్తుంది. అధిక పగటి ఉష్ణోగ్రతల వల్ల రసంపీల్చే పురుగులు ముఖ్యంగా పేనుబంక ఆశించును. నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పల్లాకు తెగులు ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించాలి. తెల్లదోమ ఉధృతిని తగ్గించడానికి పసుపు రంగు జిగురు అట్టలు అమర్చాలి. అవసరం మేరకు తెల్లదోమ నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా డైఫెన్‌థయూరాన్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. గాలిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నప్పుడు బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకై నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లేదా థయోఫానేట్ మిథైల్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సర్కోస్పోరా తుప్పు తెగులు, కొరినోస్పోరా ఆకుమచ్చ తెగుళ్ళ నివారణకై లీటరు నీటికి 2.0 మి.లీ. హెక్సాకొనజోల్ లేదా 1 మి.లీ. ప్రొపికొనజోల్ పిచికారి చేయాలి.

**మారుకా మచ్చల పురుగు:** కందిలో సూచించిన పురుగు మందులను పిచికారి చేసుకోవాలి.

**శనగ:** శనగ వేసిన 30 రోజుల వరకు కలుపు లేకుండా చూడాలి. అంతరకృషి చేసి కలుపు నివారించాలి. తద్వారా తేమ కూడా ఎక్కువ రోజులు మొక్కకు అందుతుంది. యాసంగిలో విత్తిన శనగ పంటకు 35-40 రోజులకు మరియు 55-65 రోజులకు తేలికపాటి నీటితడి ఇచ్చినచో దిగుబడులు పెరుగుతున్నాయి. మొగ్గదశలో ఉన్న శనగ పంటకు లీటరు నీటికి 20 గ్రా. డిఎపి లేదా యూరియా పిచికారి చేసినచో దిగుబడి పెరుగుతుంది. శనగను ఆలస్యంగా విత్తినచో తొలిదశలో పచ్చరబ్బరు పురుగు ఆశించి నష్టపరుచును. నివారణకై ఎసిఫేట్ 1.5 గ్రా. లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లేదా థయోడికార్బ్ 1.5 గ్రా. లీటరు నీటికి కలిపి సాయంత్రం వేళల్లో పెద్ద లార్వాలు గమనిస్తే విషపు ఎరలను అమర్చాలి.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## ప్రత్తి

- రాష్ట్రంలో ప్రత్తి పంట రెండవ తీత (135-150 రోజుల) దశలో ఉంది. పైపాటుగా ఎటువంటి ఎరువులు గాని పురుగు మందులు గాని వాడరాదు. పంటకాలంను పొడిగించరాదు.
- ప్రత్తి తీసేటప్పుడు గోనె లేదా గుడ్డ సంచులను వాడాలి. ఎండిన ఆకులు, కాయతొడిమలు ప్రత్తితో కలువకుండా చూసుకోవాలి.
- తీసిన ప్రత్తిని పట్టాలపై నీడలో 8-12 శాతం తేమ వచ్చే వరకు ఆరబెట్టి అమ్మినట్లైతే మార్కెట్‌లో మంచి ధర వస్తుంది.
- ప్రత్తి పంట సాగును జనవరి వరకు పొడిగించరాదు. పొడిగించినచో గులాబి రంగు పురుగు ఉధృతి ఎక్కువై గుడ్డి ప్రత్తి ఎక్కువగా వస్తుంది. రాబోయే రోజుల్లో గులాబి రంగు పురుగు సంతతి పెరిగి పంటను మరింత అధికంగా నష్టం చేసే అవకాశం ఉంది.
- డిసెంబర్ నెలలో ప్రత్తి పంటను తీసి వేసి నీటి వసతి ఉన్నచోట ప్రత్తి అడుగులో రెండవ పంటగా మొక్కజొన్న, జొన్న, బొబ్బర లేదా కూరగాయ లాంటి పంటలను సాగు చేసుకోవచ్చు.



- ప్రత్తి చేను (ప్రత్తి కట్టెను) ను కాల్చరాదు. రోటవేటర్ లేదా ష్రెడ్డర్‌తో భూమిలో కలియదున్నాలి. తద్వారా నేల సారవంతమవుతుంది మరియు నేలలో కర్బన శాతం పెరుగుతుంది.
- ప్రత్తి చేనులో గులాబిరంగు పురుగును గమనించినచో లీటరు నీటికి సైపర్‌మెత్రిన్ + క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లేదా లామ్డాసైహలోత్రిన్ + క్లోరాంట్రానిలిప్రోల్ 0.5 మి.లీ. కలిపి పిచికారి చేసుకోవాలి.

**డా॥ జి. వీరన్న, ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 8332970247**

## చెఱకు

డిసెంబర్ మాసంలో రాష్ట్రంలో చెఱకు కర్మాగారాలు గానుగాడుతుంటాయి. చెఱకు నరకడానికి పది రోజుల ముందే తోటకు నీరు కట్టడం ఆపివేయాలి. చెఱకు గడలను భూమట్టానికి నరకాలి. కొన్ని ప్రాంతాలలో భూమి పైన రెండు మూడు అంగుళాలు వదిలేసి నరుకుతుంటారు. ఇలా చేయడం వలన ఎకరానికి రెండు, మూడు టన్నులు దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. అంతేకాకుండా క్రింది కణుపులలో పంచదార పాలు ఎక్కువగా ఉండడం వలన ఇటు పంచదార అటు బెల్లం దిగుబడులు కూడా తగ్గుతాయి. చెఱకును భూమట్టానికి నరికినప్పుడు కార్శి చేసిన తోటలోని వేళ్ళు లోతుగా చొచ్చుకొనిపోయి, తోట బలంగా పెరిగి వర్షాకాలంలో వచ్చే ఈదురు గాలులు మరియు వర్షాలకు తట్టుకొని తోట నిలకడగా ఉండి, గడలు బాగా ఎదిగి మంచి దిగుబడినిస్తాయి. చక్కెర మిల్లుకు సరఫరా చేసిన చెఱకును చెత్త, ఎండుటాకులు, వేర్లు, మట్టిరేణువులు లేకుండా శుభ్రం చేయాలి.

డిసెంబర్ మాసంలో చెఱకును నాటుటకు నేలను అనువుగా తయారు చేసుకోవాలి. ముందుగా నేలను లోతు దుక్కి (30 సెం.మీ. వరకు) చేసుకోవాలి. దీని వల్ల వేరు మండలం బాగా విస్తరించి, పంటకు కావాలసిన నీరు, గాలి, పోషకాలు అందడం వలన పంట ఎదుగుదల అనుకూలంగా ఉంటుంది. ఆ తర్వాత ఎకరానికి 10 టన్నుల పశువుల పెంట లేదా కంపోస్ట్ ఎరువులను వేసి చెఱకును నాటుటకు 4 నుండి 6 వారాల ముందు పళ్ళెపు దంతితో భూమిలో కలియదున్నాలి.

చెఱకు విత్తనం కొరకు 7-8 నెలల వయసు గల లేవడి తోటల నుండి సేకరించిన రెండు లేదా మూడు కళ్ళ ముచ్చెలను కొట్టి ఎకరాకు విత్తనంగా వాడాలి.

చెఱకులో వేరు పురుగు ఉధృతి రోజురోజుకి ఎక్కువగానే కనబడుతుంది. కావున నాటుకునే ముందు కీటకనాశిని 40% ఇమిడాక్లోప్రిడ్ మరియు 40% ఫిప్రోనిల్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి మందుతో శుద్ధి చేయడం వలన ఈ పురుగుకు సంబంధించిన గుడ్లు కూడా చనిపోతాయి.

ముందుగా విత్తుకునే రైతులు స్వల్పకాలిక రకాలైన కో 8014, కో 94008, కో సి 671, 83 ఆర్ 23 మరియు మధ్యకాలిక రకాలైన కో 86032, కో 99004, కో 7805, 85 ఆర్ 186, 97 ఆర్ 129, కో 7219 వంటి రకాలను విత్తుకోవచ్చు.

మోడు చెక్కిన 10-20 రోజుల్లో భూమిలో తగినంత పదును ఉన్నప్పుడు వరుసల మధ్య భూమి గుల్ల బారేటట్లు చేయాలి. దీని వలన కార్శి తోటల వేర్లకు ప్రాణ వాయువు, నీరు, గాలి, పోషకాలు సక్రమంగా అందుతాయి. అంతేకాకుండా తడులు పెట్టినప్పుడు నీరు ఇంకి కార్శి పిలకలు నీరు, పోషకాలు సమానంగా తీసుకుంటాయి. ఇదే కాకుండా పళ్ళెపు నాగళ్ళతో దున్నటం వలన పాత వేర్లు కత్తిరించి, కొత్త వేర్లు తొడిగి, అధిక పిలకలు అభివృద్ధి చెందే అవకాశం ఉంది. భూమి గుల్లబారిన తర్వాత 50 కిలోల డి.ఎ.పి మరియు 86 కిలోల పొటాష్ ఎరువులను వేసి నీరు పెట్టాలి.

**డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

వాతావరణ విభాగం సమాచారం ప్రకారం రాబోయే శీతాకాలంలో (డిసెంబర్ 2025 నుండి ఫిబ్రవరి 2026 వరకు) తెలంగాణ రాష్ట్రంలో సాధారణం నుండి సాధారణం కంటే తక్కువ కనిష్ట మరియు గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నది. రాబోయే శీతాకాలంలో (డిసెంబర్ 2025 నుండి ఫిబ్రవరి 2026 వరకు) ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల మరియు కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ చలి గాలులు వీచే అవకాశం కలదు. డిసెంబర్ 2025 నెలలో, ఉత్తర తెలంగాణా జిల్లాలలో కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణంగాను మరియు దక్షిణ మరియు మధ్య తెలంగాణ జిల్లాలలో సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం కలదు. గరిష్ట ఉష్ణోగ్రతలు దక్షిణ తెలంగాణ జిల్లాలో సాధారణం కంటే ఎక్కువగా, మధ్య తెలంగాణా జిల్లాలలో సాధారణంగాను మరియు ఉత్తర తెలంగాణ జిల్లలో సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం కలదు. డిసెంబర్ 2025లో ఆదిలాబాద్ జిల్లాలలోని కొన్ని ప్రాంతాలలో చలిగాలులు సాధారణం కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉంది.

రాష్ట్రంలో 01.10.2025 నుండి 30.11.2025 వరకు కురిసిన వర్షపాతాన్ని గమనించినట్లయితే సాధారణ వర్షపాతం 105.8 మి.మీ. గాను 190 మి.మీ. అనగా సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ వర్షపాతం (80 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో వానాకాలం పంటకాలానికి ఇప్పటి వరకు (26.11.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి - 0.18 శాతం (9029), జొన్న - 12.65 శాతం (25047), మొక్కజొన్న - 26.7 శాతం (172388), కంది - 6.34 శాతం (333), శనగ 34.51 శాతం (105118), పెసర - 0.97 శాతం (225), మినుములు - 12.96 శాతం (7124), వేరుశనగ - 30.67 శాతం (79748), ప్రొద్దుతిరుగుడు - 6.45 శాతం (1598) మరియు కుసుమ - 24.64 శాతం (3051) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం వానాకాలం పంటకాలంలో ఇప్పటి వరకు 6.18 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 5.03 శాతం, నూనె గింజల పంటలు 23.90 శాతం సాగుచేయటం జరిగింది.

**వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు**

- రాష్ట్రంలో రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదవుతున్న జిల్లాలలో వరి నారుమడిలో చలి ప్రభావం తగ్గించి నారు ఎదుగుదలకు
- 2 క్వింటాళ్ళు బాగా చివికిన కోళ్ళు లేదా గొర్రెల ఎరువును 200 చదరపు మీటర్ల విస్తీర్ణం గల నారుమడికి ఆఖరి దుక్కిలో మరియు 1 కిలో నత్రజని, 1 కిలో భాస్వరం మరియు 1 కిలో పొటాషియంలను ఇచ్చే రసాయనిక ఎరువులను విత్తే సమయంలో వేయవలెను.
- పాలిథీన్ షీట్లతో నారుమడిని రాత్రిళ్ళు కప్పి ఉదయం వేళల్లో తీసివేయాలి.
- ప్రతి రోజు నారుమడి నుండి ఉదయం నీటిని తీసివేసి మళ్ళీ బావి లేదా బోరు బావి నీళ్ళు పెట్టాలి.
- ఎకరా పొలానికి సరిపడే నారుమడికి 2 కిలోల యూరియా పైపాటుగా నారు విత్తిన 10-15 రోజుల్లో చల్లాలి.
- వరి నారుమళ్ళలో కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలను 200 చ.మీ. నారు మడికి (5 సెంట్లకు) ఒక కిలో చొప్పున నారు పీకడానికి వారం రోజుల ముందు చల్లుకోవాలి.
- యాసంగి మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు,
  - విషపు ఎర తయారు చేసుకోవడానికి గాను 10 కిలోల వరి తవుడులో 2 కిలోల బెల్లంను కలిపి 2-3 లీ నీటిని చేర్చి సుమారు 12 గంటల పాటు పులియనిచ్చి మరుసటిరోజు 100 గ్రా. థైడికార్బ్‌ను కలుపుకొని ఈ మిశ్రమాన్ని చిన్న చిన్న ఉండలుగా చేసి మొక్క సుడులలో వేసుకోవాలి.
  - ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా థయోమిథాక్సామ్ 9.5% + లామ్డా సైహలోత్రిన్ 12.6% - 0.5 మి.లీ. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.
  - మోకాలు ఎత్తుదశలో ఉన్న పైరులో ఒక కిలో సున్నం మరియు 9 కిలోల ఇసుకను కలిపి మొక్క సుడులలో వేసి కత్తెర పురుగును నివారించుకోవలెను.
  - మిరపలో ఫ్యుజేరియం ఎండు తెగులు నివారణకు, 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 1 గ్రా. కార్బండాజిమ్ మందును లీటరు నీటికి కలిపి మొక్క మొదళ్ళ దగ్గర నేల తడిచే విధంగా పిచికారి చేయాలి.
  - పసుపులో దుంప, వేరుకుళ్ళు తెగులు నివారణకు 2 గ్రా. కాప్టాన్ లేదా 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును మొక్కల మొదళ్ళు తడిచేలా పోయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9704157445



# యాసంగి వరినారుకి తీసుకోవలసిన జాగ్రత్తలు

డా॥ యం. పరిమళ కుమార్, డా॥ బి. లక్ష్మీ ప్రసన్న, డా॥ శ్రీధర్ సిద్ధి, డా॥ ఐ. అరుణశ్రీ,
డా॥ టి. కిరణ్ బాబు మరియు డా॥ ఐ. స్వర్ణలతా దేవి
వరి పరిశోధన విభాగం, ఏ ఆర్ ఐ, రాజేంద్రనగర్, పిజెటిఏయు





భారతదేశంలో గత సంవత్సరం యాసంగిలో వరి సుమారుగా 109.39 లక్షల ఎకరాలలో పండించడం జరిగింది. అందులో ముఖ్యంగా తెలంగాణలో సుమారుగా 59.77 లక్షల ఎకరాలలో పండించి 167.86 లక్షల టన్నుల వరి ధాన్యం ఉత్పత్తి చేయడం జరిగింది. ప్రస్తుత సంవత్సరంలో రాష్ట్రంలో మంచి వర్షపాతం గమనించాము. 24-09-2025 నాటికి రాష్ట్ర సాధారణ వర్షపాతముకు 740.1 మి.మీ. గాను 912.9 మి.మీ. వర్షపాతం అనగా 28% అధికంగా కురవడం జరిగింది. తద్వారా జలాశయాలు నిండుగా ఉంటూ భూగర్భ జలాలు కూడా తోడవటంతో రైతాంగం యాసంగి వరికి మొగ్గు చూపుతున్నారు. పెరిగిన నీటి వనరులు, పుష్కలమైన సూర్యరశ్మి మరియు అనువైన వంగడాలు వలన యాసంగిలో వరి దిగుబడులపై అనుకూల ప్రభావం ఉంటుంది.

తెలంగాణ రాష్ట్రంలో చలి నవంబర్ నుండి ఫిబ్రవరి మాసం వరకు విస్తరించి ఉంటుంది. కానీ డిసెంబర్ మరియు జనవరి మాసాలలో చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. రాత్రి వేళలో ఉష్ణోగ్రత 13$^{0}$ సెల్సియస్ కంటే తగ్గువగా ఉండటం వలన యాసంగి వరి నారుమళ్ళ పై దుష్ప్రభావం కనబడుతుంది.

సరైన సస్యరక్షణ మరియు యాజమాన్య పద్ధతులను అవలంభిస్తే చలి తీవ్రత నుండి నారుని సంరక్షించుకోవచ్చు.

అనువైన రకాలు: తమ తమ ప్రాంతాల్లో ఉన్న గత మార్కెటింగ్ దృష్టిలో ఉంచుకొని రైతాంగం అనువైన రకాలను ఎంచుకోవాలి. యాసంగిలో స్వల్పకాలిక రకాల సాగు శ్రేయస్కరం.

**సన్న గింజ రకాలు:** తెలంగాణ సోన (ఆర్.యన్.ఆర్. - 15048), కూనారం వరి-2 (కె.ఎన్.ఎం.-1638) మరియు వరంగల్ వరి-2 (డబ్ల్యు.జి.ఎల్ - 962)

**దొడ్డు గింజ రకాలు:** కూనారం సన్నాలు (కె.ఎన్.ఎమ్.-118), జగిత్యాల వరి-1 (జె.జి.ఎల్-24423), తెల్లహంస (ఆర్.ఎన్.ఆర్ 10754), కాటన్ దొర సన్నాలు (యం.టి.యు-1010) మరియు ఆర్.ఎన్.ఆర్ 29325

నారు పోసుకునే సమయం: తెలంగాణలో యాసంగికి నారు పోసుకునే అనువైన కాలం నవంబర్ 15 నుండి డిసెంబర్ 20 వరకు.

రైతులు నారు నవంబర్ మొదటి వారంలో పోసుకున్నట్టయితే వరి పూత దశలో తక్కువ ఉష్ణోగ్రతల కారణంగా గింజ తాలు పోయే ప్రమాదం ఉంది. అదే నారుని డిసెంబర్ 20 తరువాత పోసుకున్నట్టయితే వరి పైరు పూతదశ ఎక్కువ ఉష్ణోగ్రతలకు గురి అయ్యి గింజలో పగుళ్ళు పడి తద్వారా నూకశాతం ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ మొదటి వారం వరకు వరి కోతలు పూర్తయ్యేలా జాగ్రత్త వహించాలి.

**నారుమడి యాజమాన్యం:** యాసంగిలో వరి నారుమడి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. ముందుగా నాటడానికి ఎంపిక చేసుకున్న వరి విత్తనం లభ్యత చూసుకోవాలి. నాణ్యమైన విత్తనాలకు దగ్గరలో ఉన్న వ్యవసాయ పరిశోధన స్థానం కానీ, విత్తన అభివృద్ధి సంస్థకానీ, విత్తన డీలర్ల దగ్గర కాని కొని రశీదులను భద్రపరుచుకోవాలి. రైతులు తమ వ్యవసాయ క్షేత్రంలోనే విత్తనం తయారు చేసుకున్నట్టయితే చాలా సమస్యలను నివారించుకోవచ్చు. స్వంత విత్తనం మొలక శాతం సమస్యలను నివారించుకోవచ్చు. స్వంత విత్తనం చేసిన విత్తనాన్ని విత్తనశుద్ధి చేసుకోవాలి. ముందుగా ఒక డ్రమ్ములో లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 3 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ గాని

కలుపుకొని దాంట్లో ఒక కిలో వరి విత్తనాన్ని 24 గం. నానబెట్టుకోవాలి. అలా మన దగ్గర ఉన్న విత్తనానికి సరిపడా ద్రావణాన్ని తయారు చేసుకొని ఒక రోజు నానబెట్టాలి. తరువాత విత్తనాన్ని నోటి నుండి తీసి ఇంకో 24 గం. మండె కట్టాలి. మండె ఎప్పుడూ తడిగా ఉండేటట్టు చూసుకోవాలి. అలా చేసిన సంక్రమించే తెగుళ్ళని 15-20 రోజుల వరకు తట్టుకుంటుంది. అదే విధంగా నారుమడి కోసం నీటి వసతికి దగ్గర ఉన్న పొలం ఎంపిక చేసుకొని బాగా రెండు సార్లు పొడి దుక్కి దున్ని అందులో రెండు గంటల నారుమడికి 2 క్వింటాళ్ళ మాగిన కోళ్ళ ఎరువు లేదా గొర్రెల ఎరువు వేసి కలియదున్నాలి. ఈ ఎరువుల ద్వారా నేల ఉష్ణోగ్రత కొద్దిగా ఎక్కువగా ఉంటుంది. తద్వారా చలి కాలానికి బాగా ఉపయోగపడుతుంది. ఎరువులు వేసాక 2 నుండి 3 సార్లు బాగా నీరు పెట్టి దమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి మరియు తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేసి ఎత్తు నారుమళ్ళను తయారు చేయాలి.

రెండు గుంటల నారుమడి ఒక ఎకరాకి సరిపోతుంది. అలా ఇందులో 2 కిలోల నత్రజని (కిలో విత్తనం చల్లే ముందు మరొక కిలో విత్తన 12-14 రోజులకు) 2 కిలోల భాస్వరం మరియు కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేసుకోవాలి. చలి సమస్యను అధిగమించడానికి నారుమళ్ళ పైన ఇనుప చువ్వలు లేదా వెదురు కర్రలకు ఊతం ఇచ్చి పైన పలుచని పాలిథీన్ షీట్ లేదా ఖాళీ ఎరువుల సంచితో తయారుచేసిన పట్టాలను సాయంత్రం వేళ కప్పి ఉంచి ఉదయాన్నే తీసివేయాలి. దీని ద్వారా రాత్రి ఉండే చలి ప్రభావం నారుమడి మీద తక్కువగా ఉంటుంది. యాసంగిలో జింక్ లోప లక్షణాలు తరచుగా ఉంటాయి. దీన్ని గమనించి జింక్ లోప సవరణకు లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. వారం వ్యవధిలో రెండుసార్లు చేస్తే సరిపోతుంది. నారు ఆరోగ్యంగా పెరగడం కోసం కిలో యూరియా ఎరువుకి 2 గ్రా. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ అనే మిశ్రమాన్ని కలుపుకొని వేసుకోవాలి. యాసంగిలో నాటిన విత్తనం చల్లిన మొదటి వారం రోజుల వరకు ఆరుతడి పద్ధతి అవలంభించాలి. ఆ తర్వాత నీరు ఎప్పుడూ 2-3 సెం.మీ. ఉండేటట్టు చూసుకోవాలి. చలి ప్రభావాన్ని తగ్గించుకోవడానికి రాత్రి వేళల్లో నారుమడిలో నిండుగా నీరు పెట్టి ఉదయాన్నే తీసివేసి కొత్త నీరు అందించాలి.

**నారుమడిలో కలుపు యాజమాన్యం:** నారుమడిలో బ్యూటాక్లోర్ లేదా ప్రెటిలాక్లోర్ + సేఫ్‌నర్ 25 మి.లీ. ఎకరాకు సరిపడా నారుమడికి 5 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 8-10 రోజులకు పిచికారి చేసుకోవాలి. బిస్‌పైరిబాక్ సోడియం అనే కలుపు మందును ఒక లీటరు నీటికి 0.5 మి.లీ. కలిపి విత్తిన 10-12 రోజులకు పిచికారి చేసుకోవాలి. నారుమడిలో ఊద, ఒడిపిలి వంటి గడ్డిజాతి కలుపు ఉన్నట్లయితే విత్తిన 15-20 రోజులకు సైహలోఫాప్-పి-బ్యుటైల్ అనే కలుపు మందును 1.5 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9948589387**

**నవంబర్ 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1. | 01.11.2025 | పూర్వపు విద్యార్థులు - గెస్ట్ లెక్చరర్ (డా॥ టి.వి. నాగేంద్ర ప్రసాద్) |
| 2. | 07.11.2025 | ఆయిల్‌పామ్ సాగు - మేలైన యాజమాన్యం |
| 3. | 08.11.2025 | వేరుశనగలో వివిధ రకాల తెగుళ్ళు - నివారణ |
| 4 | 13.11.2025 | సేంద్రియ కర్బనంతోనే నేల ఆరోగ్యము |
| 5 | 13.11.2025 | యాసంగి నూనె గింజలు సస్యరక్షణ |
| 6 | 21.11.2025 | పూర్వపు విద్యార్థులు - గెస్ట్ లెక్చరర్ (డా॥ సి. అచలేందర్ రెడ్డి) |
| 7 | 22.11.2025 | మిరప పంటలో సమగ్ర సస్యరక్షణ |
| 8 | 22.11.2025 | మిరప పంటలో పురుగులు - యాజమాన్యం |
| 9 | 26.11.2025 | మిరప పంటలో తెగుళ్ళ యాజమాన్యం |
| 10 | 29.11.2025 | 2024 సంవత్సరం - వీడియో గ్యాలరీ |

# రబీ సీజన్‌లో జింక్ వినియోగం - వరి పంట అభివృద్ధికి కీలకం

డా॥ రమ్య రాథోడ్, ఎం. సాయి చరణ్, డా॥ కృష్ణ చైతన్య, డా॥ వై.ఎస్. పరమేశ్వరి, డా॥ ఫిర్దోస్ సహానా,
డా॥ ఆర్. రమేష్, జి. రాకేష్, మంజు భార్గవి మరియు డా॥ కె. పవన్ చంద్రా రెడ్డి
ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్, నిజామాబాద్



రబీ సీజన్‌లో వరి పంట మంచి దిగుబడిని ఇవ్వాలంటే సమతుల్య పోషక నిర్వహణ అత్యంత అవసరం. పెద్ద ఎరువులతో పాటు సూక్ష్మపోషకాలలో జింక్ ప్రాధాన్యం ప్రత్యేకం. జింక్ మొక్కల పెరుగుదల, వేర్ల అభివృద్ధి, ఆకుల సస్యశ్యామలత, ధాన్యం నాణ్యత వంటి అనేక అంశాలలో కీలక పాత్ర పోషిస్తుంది. ఇటీవల కాలంలో నేలలో జింక్ లోపం పెరగడం వల్ల పంటలో తగ్గిన పెరుగుదల, ఆకుల పసుపుదనం, దిగుబడిలో నష్టాలు కనిపిస్తున్నాయి. రబీ సీజన్‌లో తగిన మోతాదులో జింక్ వినియోగం ద్వారా ఈ సమస్యలను నివారించి అధిక దిగుబడిని సాధించవచ్చు.

## జింక్ ఎందుకు అవసరం?

జింక్ పంటలకు మన శరీరంలో విటమిన్ లాంటిదే. ఇది మొక్కల పెరుగుదల, ఆరోగ్యం, దిగుబడిపై నేరుగా ప్రభావం చూపుతుంది.

## జింక్ వల్ల కలిగే ప్రయోజనాలు:

- మొక్కలలో మాంసకృత్తులు, అమినో ఆమ్లాల తయారీకి, నత్రజని, భాస్వర పోషకాల సమర్థ వినియోగానికి తోడ్పడుతుంది.
- మొక్కలలో వివిధ ఎంజైముల కార్యకలాపాలను ఉత్తేజ పరచడం ద్వారా జీవ రసాయనిక ప్రక్రియలు సక్రమంగా జరగడానికి జింకు దోహదపడుతుంది.
- మొక్క పెరుగుదలకు కావాల్సిన ఇండోల్ ఎసిటిక్ ఆసిడ్ (అక్సిన్) ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.
- పత్రహరితములో జింకు ముఖ్య ధాతువు కాబట్టి ఇది కిరణజన్య సంయోగ క్రియకు తద్వార ఆహార తయారీకి ఉపయోగపడుతుంది.

## జింక్ లోపానికి కారణాలు:

- ఎక్కువ మోతాదులో యూరియా/డి.ఎ.పి. మరియు మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను వాడటం వల్ల పోషక సమతుల్యత లోపించడం.
- సేంద్రియ ఎరువులు (గొర్రెమాటు, పచ్చిరొట్ట) తగినంత వాడకపోవడం.
- నేల క్షారగుణం ఎక్కువగా ఉండటం (ఉదజని సూచిక 8.0 కంటే ఎక్కువ).
- వరుసగా వరి పంట వేసుకోవడం.
- నేలలో నీరు ఎక్కువకాలం నిల్వ ఉండటం.
- చౌడు నేలలు లేదా లవణాల శాతం ఎక్కువ ఉన్న నీటిని వాడటం.
- చలి కాలంలో (రబీలో) ఉష్ణోగ్రతలు తక్కువగా ఉన్న సమయంలో జింకు లోపం తీవ్రత అధికంగా ఉంటుంది.

## జింక్ లోప లక్షణాలు:

- నాటిన పైరు బలహీనంగా, అనారోగ్యంగా కనిపిస్తుంది.
- పిలకలు ఆలస్యంగా వస్తాయి, పెరుగుదల మందగిస్తుంది.
- ఆకులు మధ్యభాగం పసుపు రంగులోకి మారతాయి.
- ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడి, మొద్దుబారి ఎండిపోతాయి.

- పంట సరిగా పెరగక దిగుబడి గణనీయంగా తగ్గుతుంది. ఇవి ప్రధానంగా నీరు బయటకు సరిగా వెళ్లని పొలాల్లో ముందుగా కనిపిస్తాయి.

**నేలలో జింక్ స్థాయి:** సాధారణంగా నేలలో 1.0 పి.పి.యం. (కిలో మట్టిలో 1 మి.గ్రా.) ఉంటే మంచి దిగుబడులు వస్తాయి. మొక్కలో అయితే 10 పి.పి.యం. నల్లరేగడి నేలలో అయితే 0.7 పి.పి.యం మరియు ఎర్ర నేలలో అయితే 0.6 పి.పి.యం. కనీస స్థాయిగా గుర్తించడం జరిగింది. ఈ స్థాయికి తగ్గినప్పుడు పైరులో జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి.

**జింక్ లోప నివారణ చర్యలు:**

**1. సేంద్రియ ఎరువులు వినియోగం:** ప్రతి పంటకు అవసరమైన పోషకాలలో కనీసం 30% సేంద్రియ ఎరువుల ద్వారా అందించాలి.

**2. దమ్ములో జింక్ సల్ఫేట్ వాడకం:**

- ఎకరానికి 20 కిలోల జింక్ సల్ఫేట్ నాటే ముందు దమ్ములో వేయాలి.
- భాస్వరం ఎరువులతో కలిపి వేయరాదు.
- భాస్వరం ఎరువులు వేసిన రెండు రోజుల ముందు లేదా తరువాత వేయాలి.
- జింకు సల్ఫేటు రెండు పంటలకు ఒకసారి వేస్తే సరిపోతుంది.

**3. పిచికారి ద్వారా నివారణ:**

- దమ్ములో వేయని పొలాల్లో జింక్ లోపం కనిపిస్తే, లీటరు నీటికి 2 గ్రా. జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేయాలి.
- నాటిన 20 రోజులకు మొదటి పిచికారి, ఆపై 5-7 రోజుల తర్వాత రెండవ పిచికారి చేయాలి.
- పురుగు మందులు లేదా తెగుళ్ళ మందులతో కలిపి వాడకూడదు.

**4. చౌడు నేలలలో:**

- నేలలో చౌడు ఎక్కువగా ఉంటే ఎకరానికి 40 కిలోల జింక్ సల్ఫేట్ అవసరం అవుతుంది. అయితే ఇది ఖర్చుతో కూడినది. కావున పిచికారి విధానం అనుసరించడం లాభదాయకం. నాటిన 15 రోజులకు మొదటి పిచికారి చేసి, వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు పిచికారి చేయాలి.

వరి పంటలో జింక్ సరైన యాజమాన్యం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడి వస్తుంది. కాబట్టి రైతులు తమ నేలలో జింక్ స్థాయిని తెలుసుకొని, శాస్త్రవేత్తల సూచనలతో తగిన ఎరువుల వినియోగం, పిచికారి పద్ధతులు పాటించడం ద్వారా పంట దిగుబడి, ధాన్యం నాణ్యత రెండింటిని మెరుగుపరచవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8179525139**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి గురువారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్ ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. డిసెంబర్, 2025 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 04.12.2025 | వరి మాగాణుల్లో ఆరుతడి పంటల సాగు యాజమాన్యం | డా॥ కె. చంద్రశేఖర్, శాస్త్రవేత్త (ఎస్.ఎస్.ఎ.సి.) కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, ఫోన్ నెం.: 9848430317 |
| 11.12.2025 | రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రాముఖ్యత మరియు లాభాలు | డా॥ పి. అర్చన, శాస్త్రవేత్త (అగ్రి. ఎక్స్‌టెన్షన్) తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పాలెం, ఫోన్ నెం.: 9666150842 |
| 18.12.2025 | యాసంగి జొన్నలో మేలైన యాజమాన్య పద్ధతులు | శ్రీమతి కె. స్వాతి, శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూర్, ఫోన్ నెం.: 8374601360 |
| 25.12.2025 | కుసుమ పంటలో సస్యరక్షణ | డా॥ టి. రాజేశ్వర్ రెడ్డి, శాస్త్రవేత్త (క్రాప్ ప్రొటెక్షన్) తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, పరిగి, వికారాబాద్, ఫోన్ నెం. 9390898305 |

# యాసంగిలో వరిని ఆశించే అగ్గితెగులు – యాజమాన్యం

డా॥ వి. రమ్య, డా॥ ఆర్. శ్రవణ్ కుమార్, డా॥ డి. వీరన్న, కె. మానస, బి. మాధవి, డా॥. జె. భార్గవి,
డా॥ జి. శేషు, బి. సౌందర్య, డా॥ సిహెచ్. రాములు మరియు డా॥ ఆర్. ఉమారెడ్డి

ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్



తెలంగాణ రాష్ట్రంలో యాసంగిలో సాధారణంగా 20 లక్షల హెక్టార్లకు పైగా వరి పంట సాగు జరుగుతుంది. వరిలో వివిధ రకాల కీటకాలు మరియు తెగుళ్ళు ఆశించడం వలన దిగుబడులు తగ్గే అవకాశం ఉన్నది. గత కొన్ని రోజులుగా రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలిలో తేమ పెరగడం లాంటి పరిస్థితులు వరిలో అగ్గితెగులు ఆశించడానికి మరియు వ్యాప్తికి చాలా అనుకూలంగా ఉన్నాయి. ఈ తెగులు పైరును ఏ దశలోనైనా ఆశించవచ్చు. కావున రైతాంగం ఈ తెగులు యొక్క లక్షణాలు, అనుకూల వాతావరణ పరిస్థితులు మరియు నివారణ చర్యలు తెలుసుకొని ముందుగా జాగ్రత్తలు తీసుకున్నట్లైతే పంటకు నష్టం కలుగకుండా కాపాడుకోవచ్చు.

## తెగులు లక్షణాలు:

అగ్గితెగులు ఆకులపైన, మొక్క యొక్క కణుపుల పైన, మరియు వెన్ను పైన వస్తుంది. తొలిదశలో ఆకులపైన చిన్న చిన్న గోధుమరంగు మచ్చలు ఏర్పడి, అవి క్రమేపి పెరిగి పెద్దవై నూలు కండె ఆకారంలోకి మారుతాయి. మచ్చల యొక్క మధ్య భాగం బూడిదరంగులో ఉండి, అంచులు ముదురు గోధుమ రంగులో ఉంటాయి. తెగులు ఉధృతి పెరిగే కొద్దీ మచ్చలు ఒక దానితో ఒకటి కలిసి ఆకులు ఎండిపోతాయి. మరియు తగలబడినట్లు కనిపిస్తాయి. తెగులు పిలకల కణుపుల వద్ద ఆశిస్తే ఆ ప్రదేశం వద్ద విరిగి పిలక వాలిపోతుంది. వెన్నుల మెడభాగంలో ఈ తెగులు ఆశించడం వలన వెన్నులు విరిగి క్రిందకు వాలిపోతాయి.

## తెగులు అభివృద్ధికి అనుకూల పరిస్థితులు:

- ఒక వారం రోజుల పాటు రాత్రి ఉష్ణోగ్రత $18-22^{0}$ సె. గాలిలో తేమ 90 శాతం, మంచు లేదా వర్షపు జల్లులు నవంబర్ – ఫిబ్రవరి మాసాల్లో ఈ పరిస్థితులు ఉంటాయి.
- అధిక మోతాదులో నత్రజని ఎరువును వినియోగించడం వలన తెగులు త్వరగా అభివృద్ధి చెంది ఎక్కువ నష్టం కలుగజేస్తుంది.

## నివారణ చర్యలు:

- అగ్గి తెగులుకు కారణమైన శిలీంధ్రము పంట అవశేషాల మీద, కలుపు మొక్కల మీద జీవిస్తుంది. కాబట్టి పంట అవశేషాలను నాశనం చేయాలి. కలుపు మొక్కలు గట్ల మీద లేకుండా శుభ్రం చేసుకోవాలి.
- నత్రజని ఎరువులను సిఫారసు మేరకు దఫాలుగా వేసుకోవాలి.
- నాణ్యమైన విత్తనాన్ని ఎంచుకొని 1 గ్రా. కార్బండాజిమ్ ఒక కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలి.
- తెగులు లక్షణాలు కనిపించిన వెంటనే ట్రైసైక్లోజోల్ 0.6 గ్రా. లేదా ఐసోప్రోథయోలేన్ 1.5 మి.లీ. లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఈ విధంగా నారుమడిలో గాని, పంట తొలిదశలోగాని, అగ్గితెగులు వచ్చిన పొలంలో, తరువాత దశలలో తెగులు పునరావృత్తం కాకుండా తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టినట్లైతే రైతులు ఎక్కువ నష్టం జరగకుండా, అధిక దిగుబడి పొందడానికి అవకాశముంటుంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9553951819

# రైతుస్థాయిలో లాభసాటిగా మొక్కజొన్న విత్తనోత్పత్తి – పాటించవలసిన సాంకేతిక మెళకువలు

డా॥ డి. శ్రావణి, డా॥ డి. భద్రు, డా॥ బి. మల్లయ్య, డా॥ సిహెచ్. అనూష, డా॥ ఆర్. సుశీల మరియు డా॥ ఎమ్. సుజాత

మొక్కజొన్న పరిశోధన విభాగం, రాజేంద్రనగర్



ఆహారపంటల్లో వరి తరువాత తెలంగాణలో అత్యధికంగా సాగుచేసే పంట మొక్కజొన్న. మొక్కజొన్నను యాసంగిలో ఆరుతడి పంట క్రిందసాగు చేస్తారు. మొక్కజొన్నను ఆహారపంటగా పశువులు, కోళ్ళ దాణాగా వివిధ పరిశ్రమలలో ముడిసరుకుగా మరియు ఈ మధ్యకాలంలో ఇథనాల్ ఉత్పత్తికి ఉపయోగిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు, జనాభా అవసరాలకు ఆహారధాన్యాల ఉత్పత్తి పెరగాలంటే తప్పనిసరిగా నాణ్యమైన విత్తనాన్ని ఎంచుకొని, రైతులు మొక్కజొన్న విత్తనోత్పత్తి ద్వారా వ్యాపార సరళి మొక్కజొన్న సాగు కన్నా అధిక లాభాలను పొందవచ్చు. ఇతర పంటలతో పోల్చినప్పుడు, మొక్కజొన్నలో అత్యధిక పరపరాగ సంపర్కము జరుగుతుంది. కావున హైబ్రిడ్ విత్తనోత్పత్తిలో కొన్ని ప్రత్యేక మెళకువలు పాటిస్తే నాణ్యమైన అధిక విత్తన దిగుబడులు సాధించవచ్చు మరియు అధిక లాభాలు పొందవచ్చును. మన తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన బండాగారం అంటారు. మన రాష్ట్రంలో ఉన్న వాతావరణ పరిస్థితులు, విత్తనోత్పత్తిలో రైతుల అనుభవం మరియు అధిక మొత్తంలో ప్రాసెసింగ్ ప్లాంటులు అందుబాటులో ఉండడం వలన ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు మొక్కజొన్న విత్తనోత్పత్తిని అధిక మొత్తంలోనే మన రాష్ట్రంలో రైతుల పొలాల్లో ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మెదక్ జిల్లాలలో చేస్తున్నారు. అంతేకాక మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రంలో కూడా మన తెలంగాణలో ఉత్పత్తి చేసిన విత్తనానికి చాలా డిమాండ్ ఉంది. కావున పెద్ద మొత్తంలో మన రాష్ట్రంలో విత్తనోత్పత్తి జరుగుతుంది.

### హైబ్రిడ్ విత్తనోత్పత్తిలో సాంకేతిక అంశాలు:

- అంతర దూరం/అంతర సమయం
- ఆడ మరియు మగ రకాల నిష్పత్తి
- బెరుకులు తీసివేయుట
- ఆడ మరియు మగ రకాలు ఒకేసారి పుష్పించుట
- జల్లుల తీసివేయుట (డిటాసిలింగ్)

### విత్తనోత్పత్తికి ఎంచుకునే క్షేత్రం:

- నీటి పారుదల సౌకర్యం కలిగి ఉండి సారవంతమైన నేలతోపాటు మురుగు నీరు పోయే వసతి ఉండాలి.
- ఎన్నుకునే విత్తనోత్పత్తి క్షేత్రము రవాణాకు సులభంగా ఉంటే ఎరువులు/క్రిమిసంహారక మందులు సమయానికి అందడంతోపాటు విత్తనోత్పత్తి పొలాన్ని ఎప్పటికప్పుడు గమనించుకోవడానికి సులువుగా ఉంటుంది.

మొక్కజొన్న విత్తనోత్పత్తి చేపట్టే పొలంలో అంతకుముందు సీజన్‌లో మొక్కజొన్న వేయకుండా ఉండాలి. లేనిచో ఎక్కువ బెరకు మొక్కలు వచ్చే అవకాశం ఉంది.

**అనుకూల వాతావరణ పరిస్థితులు:**

- విత్తనోత్పత్తి చేసేటప్పుడు పూతదశలో 20-27$^0$ సె. ఉష్ణోగ్రత ఉంటే గింజ బాగా కడుతుంది. అలాగే ఉష్ణోగ్రత 10$^0$ సె. కంటే తక్కువ లేదా 40$^0$ సె. కంటే ఎక్కువగా ఉంటే గింజకట్టే శాతం బాగా తగ్గుతుంది. పూతదశలో వర్షాలు కురిస్తే కూడా గింజ కట్టే శాతం తగ్గుతుంది.

**విత్తన మోతాదు:** ఎకరానికి 10 కిలోలు (మగ+ఆడ). ఆడ మరియు మగ విత్తనాల మోతాదు వాటి వరుసల నిష్పత్తిపై ఆధారపడును.

**విత్తు పద్ధతి:** 60×20 సెం.మీ చొప్పున బోదెలకు విత్తుకోవాలి.

- ఎక్కువ లోతులో మరియు మట్టి పెళ్ళల మధ్య విత్తుకోరాదు.
- ఆడ మొక్కలు ఎక్కువ దగ్గరగా విత్తుకోరాదు.
- మగ మొక్కలు దగ్గరగా విత్తుకోవాలి.

**వేర్పాటు దూరం:**

- విత్తనోత్పత్తి చేసే పొలం నుండి కనీసం 400 మీ. ఫౌండేషన్ విత్తనానికి, 200 మీ. ధృవీకరణ విత్తనానికి ఇతర మొక్కజొన్న పంటకు వేర్పాటు దూరం పాటించాలి.
- ఒకవేళ చుట్టు ప్రక్కల మొక్కజొన్న పంట ఉంటే కనీసం 25 రోజుల అంతరం ఉండేలా విత్తనోత్పత్తి పంటను విత్తుకోవాలి.

**ఆడ మరియు మగ మొక్కల వరుసలు:**

మగ మొక్క నుండి వచ్చే పుప్పొడి సమయం మరియు ఆడ/మగ మొక్క పూత మధ్య చాలా తక్కువ అంతరం ఉండేటట్లు 3:1 (ఆడ:మగ) లేదా 4:1 (ఆడ:మగ) విత్తనాలను నాటుకోవాలి.

- ఆడ మొక్కల వరుసలను గుర్తుపట్టేలా రిబ్బన్ లేదా రంగులతో కూడిన కర్రను అమర్చడం వలన డీటస్సేలింగ్‌లో పొరపాటు కాకుండా చూసుకోవాలి.

**బెరుకులు తీసివేయుట:**

- విత్తన పంట పుష్పించుటకు ముందే బెరుకులను ఏరివేయాలి.
- నేలలో క్రితం పంటకు చెంది మొలకెత్తిన బెరుకు మొక్కలు, ఇతర పంట మొక్కలు, కలుపు మొక్కలు ఏరివేయాలి.
- శాఖీయ దశలో మొక్కల ఎత్తు, ఆకుల మరియు కాండం యొక్క లక్షణాలను బట్టి బెరుకులను తీసివేయాలి.
- పూత దశల్లో, జల్లులు పుప్పొడిని వెదజల్లుటకు ముందే ఆడ మరియు మగ వరుసలలోని కేళీలను జల్లు, పూల గుణగణాలను బట్టి ఏరివేయాలి.

**నేర్పరితనం:**

విత్తనోత్పత్తి చేపట్టే రైతులు, మొక్కజొన్న పంటపై పూర్తి అవగాహన, బెరుకు మొక్కలను గుర్తించడంలో అనుభవం, సమయానికి డీటస్సేలింగ్ మరియు ఆడ/మగ మొక్కల వరుసలను వేరువేరుగా కోత చేపట్టడం లాంటివి తెలుసుంటే నాణ్యమైన అధిక దిగుబడులు తీసుకోవచ్చు.

**ఆడ మరియు మగ మొక్కల పూత ఒకేసారి రావడం:**

యూరియాని పిచికారి చేసి గాని (200 గ్రా./లీ) లేదా ప్రత్యేకంగా ఆడ/మగ వరుసలకు తడులు ఇవ్వడం వలన గాని పూతను త్వరగా తెప్పించవచ్చు తద్వారా ఆడ/మగ మొక్కలు ఒకేసారి పూతకు వచ్చి పరపరాగ సంపర్కం జరగడం వలన గింజకట్టే శాతం బాగా పెరుగుతుంది.

**జల్లులు తీసివేయుట (డిటాసిలింగ్):**

- ఆడ వరుసలలోని ప్రతి మగ పుష్పగుచ్ఛాన్ని మొవ్వు నుండి బయటకు వచ్చిన వెంటనే తీసివేయాలి.
- ఎడమ చేతితో కాండాన్ని పట్టుకొని కుడి చేతితో జల్లు మొత్తం ఒకేసారి వచ్చేలా లాగాలి.
- ఈ ప్రక్రియ 10-15 రోజుల వరకు చేపట్టాలి.

**కోత మరియు తదుపరి యాజమాన్యం:**

పక్వదశలో ముందుగా మగ వరుసల కోత చేపట్టాలి. తదుపరి ఆడ వరుసల కోతను గింజ 25-30 శాతం దశలో చేపట్టాలి. కండెలను కల్లంలో లేదా ఎండబెట్టు యంత్రాలలో బాగా ఎండబెట్టి గింజలను ఒలిచి తేమ శాతం 8-12 శాతం వరకు ఆరబెట్టాలి. యంత్రాలలో ప్రాసెసింగ్ గ్రేడింగ్ మరియు విత్తనశుద్ధి ప్యాకింగ్ చేస్తారు.

- ఈ పద్ధతులు అన్నింటినీ సమయానుకూలంగా పాటిస్తే మొక్కజొన్నలో లాభసాటి నాణ్యమైన అధిక విత్తన దిగుబడులు సాధించవచ్చు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8464943732

# కంది పంట పూత మరియు కాత దశలో తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలు

డా॥ ఆర్. విశ్వతేజ్, డా॥ విజయ భాస్కర్, డా॥ బి. రాజ్ కుమార్ మరియు డా॥ ఆర్. ఉమా రెడ్డి

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్





కంది పంటలో పూత దశ అనేది అధిక మరియు నాణ్యమైన దిగుబడులను నిర్ణయించే అత్యంత కీలకమైన కాలం. ఈ దశలో మొక్కలు తమ శక్తిని పూర్తిగా పూలు, పిందెలు మరియు కాయల అభివృద్ధికి కేంద్రీకరిస్తాయి. కాబట్టి, ఈ సమయంలో సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపే వాతావరణ ఒత్తిళ్లు పురుగుల/తెగుళ్ళ ఉధృతి మరియు పోషక లోపాలు నుండి పంటను రక్షించుకోవచ్చు.

**1. నీటి మరియు వాతావరణ ప్రభావం:** కంది పంట యొక్క కీలకమైన దశలలో పూత దశ ముఖ్యమైనదిగా పరిగణించబడుతుంది. ఈ దశలో నీటి యాజమాన్యం చాలా ముఖ్యం, ఎందుకంటే పూత మరియు పిందె దశలలో తేమ ఎద్దడి ఏర్పడితే దిగుబడి 40 నుంచి 80 శాతం వరకు తగ్గుతుంది .

**నీటి ఎద్దడి నివారణ:** ఈ పంటలో పూత కనిపించినప్పుడు, నీటి తడులు అందించడం ద్వారా నీటి ఎద్దడి లేకుండా చూసుకోవాలి. ఒకవేళ నీటి తడులు కేవలం నాలుగు మాత్రమే ఇవ్వడానికి అవకాశం ఉంటే, అందులో ఒక తడిని పూత దశలో తప్పనిసరిగా అందించాలి.

**వాతావరణ ప్రభావాలు:** పూత దశలో తక్కువ ఉష్ణోగ్రతలు $22^0$ సెంటీగ్రేడ్ కంటే తక్కువ ఏర్పడితే, గింజ మాడిపోయే ప్రమాదం ఉంది. అలాగే, రైతులు ఆలస్యంగా విత్తనం వేసినట్లయితే, గింజ కట్టే దశలో అధిక ఉష్ణోగ్రతలు నమోదై, గింజల్లో నాణ్యత తగ్గి, దిగుబడిలో నష్టం కలుగుతుంది.

**తేమ అధికమైతే:** పొలంలో తేమ అధికంగా ఉండి, పూత దశ తొందరగా వచ్చినట్లయితే, కందిలో పంచదార పదార్థాలు తగ్గిపోతాయి.

**2. కలుపు యాజమాన్యం:** కలుపు మొక్కలను అరికట్టడానికి, పొలంలో రెండుసార్లు కలుపు తీయడం ద్వారా దిగుబడి నష్టం తగ్గుతుంది. కలుపు మొక్కలు లేకుండా చేయడం వలన పోషకాలు, నీరు వృధా కాకుండా పురుగుల (పింక్ పాడ్ బోరర్, కంది తొలుచు పురుగుల) ఉధృతి కూడా తగ్గుతుంది. విత్తిన 30 మరియు 60 రోజులకు గుంటక, గొర్రు లేదా దంతె వంటి పరికరాలతో అంతరకృషి చేయాలి. ఎడంగా విత్తిన కందిలో, ట్రాక్టర్ కల్టివేటర్ లేదా రోటావేటర్ ఉపయోగించి కూడా అంతరకృషి చేయవచ్చు.

**3. పోషక యాజమాన్యం:** పూత దశలో మొక్కలకు అవసరమైన స్థూల మరియు సూక్ష్మ పోషకాలను అందించడం వలన అధిక దిగుబడి సాధించవచ్చు.

**పోషకాల వాడకం సమయం:** సాధారణంగా, భాస్వరం మరియు పోటాష్ ఎరువులను పూత దశలో వాడటం మంచిది.

**నత్రజని మరియు పోటాష్ యాజమాన్యం:** లేత ఆకులలో నత్రజని లోపం (లేత పసుపు రంగు) కనిపిస్తే, లీటరు నీటికి 20 గ్రా. యూరియా మరియు 0.5 మి.లీ. జిగురు / స్టిక్ గమ్ కలిపి 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. పోటాషియం లోపం లక్షణాలు కనిపిస్తే, లీటరు నీటిలో 5 గ్రా. పొటాషియం నైట్రేట్ లేదా 10 గ్రా. మల్టీ-కె మరియు 0.5 మి.లీ. జిగురు / స్టిక్ గమ్ కలిపి రెండుసార్లు పిచికారీ చేయాలి

**బోరాన్ ప్రాముఖ్యత:** బోరాన్ అనేది పూత, పిందె ఏర్పడటం మరియు కాయల అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా చౌడు నేలల్లో మరియు ఆమ్ల భూముల్లో బోరాన్ లోపం తరచుగా కనిపిస్తుంది. బోరాన్ లోపం తీవ్రంగా ఉంటే, ఆకులు

చిన్నవిగా మారడం, చివర్లు ముడుచుకుపోవడం, మరియు పిందెలు సరిగా ఏర్పడక పోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. నివారణకు లీటరు నీటికి 1.5 గ్రా. బోరాక్స్ పొడిని కలిపి పిచికారీ చేసుకోవాలి.

**4. సస్యరక్షణ చర్యలు:** పూత మరియు కాయ దశలలో కంది పంటపై పురుగుల మరియు తెగుళ్ళ దాడి అధికంగా ఉండి, దిగుబడిపై నష్టం కలిగిస్తుంది. కంది పంటపై కాయతొలుచు పురుగు (పచ్చ పురుగు), పొగాకు లద్దె పురుగు, మరియు కాయ తొలుచు పురుగులు అధికంగా ఆశించే అవకాశం ఉంది.

**మారుకా మచ్చల పురుగు:** కంది పంటకు మారుకా మచ్చల పురుగు అత్యంత ప్రమాదకరమైనది. ఇవి పూమొగ్గలు, పూలు, ఆకులు మరియు కాయలను గూడుగా చేసుకొని తిని, మొక్కలు, పిందెలు మరియు కాయలను నాశనం చేస్తాయి. నివారణకు పురుగు ఉధృతిని బట్టి, పూత మరియు మొగ్గ దశలో వేప నూనె 1500 పి.పి.ఎం ను 5 మి.లీ. లీటరు నీటికి లేదా క్వినాల్‌ఫాస్ 2.0 మి.లీ. లీటరు నీటికి లేదా ప్రొఫెనోఫాస్ 2.0 మి.లీ. లేదా నొవాల్యూరాన్ 0.75 మి.లీ. కలిపి పిచికారి చేయవచ్చు.

ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఈ రసాయన మందుల ప్రభావం పరాగ సంపర్కం చేసే జీవులపై పడకుండా ఉండాలంటే, పూత దశకు రాకముందే సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి.

**శనగ పచ్చ పురుగు మరియు కాయ తొలుచు పురుగు:** పూత మరియు కాయ దశలలో శనగ పచ్చ పురుగు లేదా కాయ తొలుచు పురుగుల ఉధృతిని గమనించినట్లయితే, నివారణకు, లీటరు నీటికి క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లేదా ఇండాక్సాకార్బ్ 0.8 మి.లీ. లేదా ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

**కాయ రసం పీల్చే పురుగు:** పిందెలు మరియు కాయ దశలలో తేమతో కూడిన వాతావరణం, అధిక ఉష్ణోగ్రతలు ఉన్నప్పుడు ఈ పురుగు ఆశిస్తుంది. దీని నివారణకు డైమిథోయేట్ మందును 2.0 మి.లీ. లీటరు కలిపి పిచికారీ చేయాలి.

**తెగుళ్ళ నివారణ:**

**ఎండు తెగులు:** ఎండు తెగులు అధికంగా వచ్చే ప్రాంతాలలో రైతులు తెగులును తట్టుకునే నూతన రకాలైన డబ్ల్యుఆర్‌జిఇ-93, డబ్ల్యుఆర్‌జిఇ-97, డబ్ల్యుఆర్‌జి - 252, టిడిఆర్‌జి-4 లేదా ఆశ (ఐసిపిఎల్-87119) వంటి విత్తనాలను ఎన్నుకొని సాగు చేసుకోవాలి. ఎండు తెగులు (ఫ్యూజేరియం) ఆశించిన మొక్కలను పొలం నుండి వెంటనే తీసివేయాలి. విత్తనశుద్ధి (10 గ్రా. ట్రైకోడెర్మా కిలో విత్తనానికి) ద్వారా దీనిని నివారించాలి .

**ఆకుమచ్చ/కాయకుళ్ళు తెగుళ్లు:** అధిక వర్షాలు మరియు తేమతో కూడిన వాతావరణ పరిస్థితుల వలన ఆకుమచ్చ /కాయకుళ్ళు తెగులు వచ్చే అవకాశం ఉంది. నివారణకు ప్రొపికొనజోల్ 1.0 మి.లీ. లేదా టెబ్యుకొనజోల్ + ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్ 0.6 గ్రా. లీటరు నీటికి పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆకుమచ్చ మరియు కాయకుళ్ళు తెగులు నివారణకు క్రిసాక్సోమిథైల్ + వాలిడామైసిన్ 1 మి.లీ. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. + స్ట్రెప్టోసైక్లిన్ 0.1 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

**వెర్రి తెగులు (స్టెరిలిటీ మొజాయిక్ వైరస్):** తెగులు ప్రారంభ దశలో, లేత ఆకుల ఈనెలు లేత ఆకుపచ్చ రంగులోకి మారతాయి. తరువాతి దశలో ఆకులు లేత మరియు ముదురు ఆకుపచ్చ కలిపి మొజాయిక్ లాగా కనిపిస్తాయి. ఈ తెగులు సోకిన మొక్కల ఆకులు చిన్నగా ఉండి, పూత కాత లేకుండా గుబురుగా పెరుగుతాయి. వెర్రి తెగులు వైరస్ ఈరియోఫైడ్ నల్లి ద్వారా వ్యాపిస్తుంది. నివారణకు తొలుత వైరస్ లక్షణాలు కనిపించిన మొక్కలను వెంటనే పంట నుండి వేరు చేసి, కాల్చి నాశనం చేయాలి. తెగులు ఉధృతి తక్కువగా ఉన్నట్లైతే, నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు కలిపి పిచికారీ చేయాలి. అలాగే ఉధృతి అధికంగా ఉన్నప్పుడు ప్రోపర్‌గైట్ 57 శాతం ఇసి. 2. మి.లీ. లీటరు లేదా ఫెన్ పైరోక్సీమేట్ 5 శాతం ఇసి. 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకుంటే తద్వారా వైరస్ తెగులు వ్యాప్తిని తగ్గించవచ్చు.

**పూత రాలిపోవడం:** తెగుళ్ళ నివారణ చర్యలతో పాటు, పూత రాలిపోకుండా నివారించడానికి, పూత దశ నుంచి నీటి ఎద్దడి లేకుండా తడులు ఇవ్వడం ముఖ్యం. పూత, పిందె దశలో తేమ ఎద్దడికి గురైతే దిగుబడి 40-80% వరకు తగ్గుతుంది.

కంది పంటలో అధిక దిగుబడి సాధించడానికి, పూత దశలో సరైన నీటి యాజమాన్యం, పురుగులు/తెగుళ్ళ ఉధృతిని ఎప్పటికప్పుడు గమనించి సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టడం, సరైన స్థూల పోషకాలను, ముఖ్యంగా సూక్ష్మ పోషకాలను, సకాలంలో అందించడం, మరియు తేమ ఎద్దడి లేకుండా చూసుకోవడం ద్వారా అధిక మరియు నాణ్యమైన దిగుబడులను సాధించే అవకాశం ఉంటుంది మరియు రైతులకు లాభం చేకూరుతుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9849817896**

# వానాకాలం వరి సాగులోని పోషక అవశేషాలతో యాసంగి పెసర మరియు మినుము సాగులో ఎరువుల ఆదా

డా॥ కస్తూరి రాజమణి, డా॥ జి. మనోజ్ కుమార్, డా॥ కె. సురేష్, డా॥ యం. విజయలక్ష్మి మరియు డా॥ కె.పి. వాణి
నీటి సాంకేతిక పరిజ్ఞాన కేంద్రం, పిజెటిఏయు, హైద్రాబాద్





తెలంగాణ రాష్ట్రంలో వానాకాలం మరియు యాసంగి సీజన్లలో నిరంతరంగా వరి పంటను సాగుచేయడం ద్వారా వరి పొలాల్లోని నీటి నిల్వ వల్ల గాలి సంచారం తగ్గి నేల గట్టిగా మారి వేర్ల పెరుగుదల అణిచి వేయబడుతుంది. రైతులు సేంద్రియ ఎరువుల వాడకం తగ్గించి రసాయన ఎరువులపై అధికంగా ఆధారపడటం వలన నేలలోని సేంద్రియ కర్బన స్థాయి తగ్గి నేలలోని సూక్ష్మజీవుల జీవక్రియలు మందగించి నేల సారం తగ్గిపోతుంది. అలాగే నైట్రోజన్ మరియు ఫాస్ఫరస్ సంబంధిత ఎరువుల అధిక వినియోగం ద్వారా ఇతర మూలకాల మధ్యన అసమతుల్యత ఏర్పడి సూక్ష్మ మూలకాలైన జింక్, ఇనుము, మాంగనీస్ వంటి సూక్ష్మపోషకాల లోపం సాధారణమవుతుంది. అదనంగా, నైట్రేట్ కింది పొరలలోకి లీచ్ అవడం మరియు ఫాస్ఫరస్ స్థిరీకరణ జరిగి పంటకు అందుబాటులోకి రాని కారణంగా భూగర్భజలాలు మరియు సమీప జలాలు కాలుష్యానికి గురై ఆమ్లజని రహిత పరిస్థితులు ఇంకా పెరిగి వివిధ హానికారక శిలీంద్ర శైవలాలు వృద్ధి చెంది చేపల మరణం సంభవిస్తుంది.

వరి తరువాత వరి పంటను సాగు చేసేపుడు రైతులు విచక్షణారహితంగా ఒకే విధమైన ఎరువులను పునరావృతం చేయడం వల్ల, ముఖ్యంగా నత్రజని ఎరువులను అధిక మోతాదులో ఉపయోగించడం వలన నైట్రస్ ఆక్సైడ్ అనే హరిత గృహ వాయువు విడుదలవుతుంది. దీని యొక్క గ్లోబల్ వార్మింగ్ సామర్థ్యం కార్బన్ డయాక్సైడ్ కంటే సుమారు 298 రెట్లు ఎక్కువగా ఉండటంతో వాతావరణ వేడిని గణనీయంగా పెంచుతుంది. అలాగే వరి పొలాల్లోని ఆమ్లజని రహిత పరిస్థితులల్లో మెథానోజెనిక్ సూక్ష్మజీవులు నేలలో ఉన్న సేంద్రియ పదార్థాలను విచ్ఛిన్నం చేసి మిథేన్ వాయువు ను ఉత్పత్తి చేస్తాయి. రైతులు అధికంగా వినియోగించే నత్రజని ఎరువులు ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి మెథానోజెనిక్ బ్యాక్టీరియాకు అవసరమైన కర్బన ఉపపదార్థాల లభ్యతను మరింతగా పెంచడం వల్ల మిథేన్ ఉత్పత్తి వరి తరువాత వరిని సాగు చేసే పొలాల్లో మరింతగా పెరుగుతుంది. అధిక మొత్తంలో ఉపయోగించే ఫాస్ఫరస్ ఎరువుల వలన నేలలోని సూక్ష్మజీవుల క్రియాశీలత ప్రభావితమై నేలలో మిథేన్ ఉద్గారాల సమతుల్యత దెబ్బతింటుంది. ఇలా అధికంగా వినియోగించే ఎరువుల వాడకం వల్ల నేలలోని ఆక్సిడేటివ్ ఎంజైమ్‌ల క్రియాశీలత తగ్గి, ఆక్సిడేషన్-రిడక్షన్ మార్పులు జరిగి మిథేన్ ఉద్గారాలు మరింత ఎక్కువగా వరి పొలాల నుండి విడుదల అవుతున్నవి. ఈ మిథేన్ వాయువు కార్బన్ డయాక్సైడ్ కంటే దాదాపు 28-34 రెట్లు అధిక ఉష్ణనిరోధక సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ ప్రతికూల ప్రభావాలను తగ్గించడానికి వరి-వరి పంటల సరళికి బదులుగా వరి-పప్పుధాన్యాల సరళిని రైతులు అవలంబించాలి.

ఖరీఫ్ వరి పంట అనంతరం రబీ సీజన్లో ముఖ్యంగా పెసర మరియు మినుము సాగు చేయడం సుస్థిర వ్యవసాయానికి అత్యంత అనుకూలమైన పద్ధతి. ఈ పప్పుధాన్య పంటలు వాతావరణ నత్రజనిని స్థిరపరచి నేలలోని సహజ నత్రజని నిల్వలను పెంచుతాయి, దాంతో రసాయన ఎరువుల అవసరం తగ్గి నేల సార నిలకడగా ఉంటుంది. తక్కువ నీటి అవసరంతో పెరిగే ఈ పంటలు ఖరీఫ్ వరి తర్వాత మిగిలిన పోషకాలను సమర్థంగా వినియోగించుకుంటూ ఆమ్లజని రహిత పరిస్థితుల కారణంగా ఏర్పడిన దుష్ప్రభావాలను మెరుగుపరచడంలో కీలక

పాత్ర పోషిస్తుంది. పప్పుజాతి పైర్ల వేర్లలో ఉండే రైజోబియం కణజాలం నేలలోని సూక్ష్మజీవుల చైతన్యాన్ని పెంచి స్థిరికరించబడి ఉన్న పోషకాలను అందుబాటులోకి తెచ్చుకుని నేల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. తక్కువ కాలపరిమితి మరియు ఖర్చుతో ఎక్కువ లాభాలు ఇచ్చే పెసర్లు మరియు మినుము పంటలు రైతులకు ఆర్థికంగా లాభదాయకంగా ఉండటంతో పాటు హరిత గృహ వాయువుల ఉద్గారాలను తగ్గించి వాతావరణ మార్పులను సైతం నియంత్రణలో ఉంచడానికి సహాయపడతాయి.

ఖరీఫ్ కాలంలో సాగుచేసే వరి పంటకు సాధారణంగా నత్రజని, భాస్వరం మరియు పొటాషియం వంటి ప్రధాన పోషకాలు అత్యంత ముఖ్యమైనవి, సాధారణంగా 40-48 కిలోల నత్రజని, 20-24 కిలోల భాస్వరం మరియు 16 కిలోల పొటాషియం, అలాగే రబీ వరి సాగుకి 48-60 కిలోల నత్రజని, 24 కిలోల భాస్వరం మరియు 16 కిలోల పొటాషియంను ఒక ఎకరాకు భూసార పరీక్ష ఫలితాల ఆధారంగా వేసుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించగా, రైతులు ఇష్టానుసారంగా ఎరువులను వినియోగించడం వల్ల పంట కోత అనంతరం ఆ ఎరువుల అవశేషాలు నేలలో నిల్వగా పేరుకుపోయి వాటిలో గణనీయమైన పోషకాలు అలాగే మిగిలి ఉండి క్రమేణా ఆ భూముల్లో చౌడుగా పేరుకుంటున్నాయి. ఎరువుల వినియోగ సామర్థ్యం నేల స్వభావం, ఎరువుల పరిమాణం, వేసిన పైరు పై ఆధారపడి ఉంటుంది. నత్రజని సంబంధిత ఎరువుల సామర్థ్యం 20-30%, భాస్వరం ఎరువుల్లో 15-25%, పొటాషియం ఎరువులకు 30-50% మాత్రమే ఉంటాయని పరిశోధన ఫలితాల ద్వారా నిర్ధారణ అయింది. దీని ప్రకారంగా పంట భూముల్లో అధిక మొత్తంలో పోషక అవశేషాలు మిగిలి ఉండే అవకాశం ఉంది, కావున ఈ పోషక అవశేషాలను రబీ సీజన్లో సక్రమంగా పెసర మరియు మినుము వంటి పప్పుజాతి పంటల సాగులో వినియోగించడం ద్వారా ఎరువుల వినియోగం తగ్గించి వ్యయాన్ని ఆదా చేయవచ్చును.

అయితే సాధారణంగా పెసర మరియు మినుము పంటకు 18 కిలోల నత్రజని ఎరువులు ఒక ఎకరానికి అవసరం, అయితే ఖరీఫ్ వరి పంట పోషక అవశేషాల ద్వారా మరియు గాలిలోని నత్రజని స్థిరీకరణ (బయోలాజికల్ నైట్రోజన్ ఫిక్సేషన్) చేసే శక్తి కలిగి ఉండడం వల్ల నత్రజని ఎరువులను కొంతమేర తగ్గించవచ్చు లేదా పూర్తిగా మానుకోవచ్చు. ఇక తెలంగాణ రాష్ట్రంలోని వరి పొలాల్లో అధికంగా భాస్వరం ఎరువులను ఉపయోగించడం వలన వీటి అవశేషాలు ఎక్కువ మొత్తంలో వరి పొలాల్లో పేరుకుని ఉన్నాయి కనుక రబీ పెసర మరియు మినుముకు అవసరమయ్యే 100 కిలోల సింగల్ సూపర్ ఫాస్ఫేట్ లేదా 50 కిలోల డి.ఎ.పి. ఎరువుల మోతాదును తగ్గించుకోవచ్చును. పొటాషియం పంట అవసరానికి రైతులకు అందుబాటులో ఉండని కారణంగా, మరియు దాని యొక్క అధిక ధర వల్ల తక్కువ మోతాదులో వాడుతుంటారు, కనుక ఈ ఎరువును రైతులు భూసార పరీక్షల ద్వారా నిర్దేశించిన మోతాదులో వినియోగించడం చాలా ముఖ్యం. అలాగే, ఖరీఫ్ వరి సాగులో పశువుల ఎరువు, కంపోస్ట్ లేదా పచ్చి రొట్టె ఎరువులను వాడినట్లయితే, నేలలోని స్థిరీకరించబడిన భాస్వరం మరియు పొటాషియం మరింతగా అందుబాటులోకి వస్తుంది, దాంతో రబీ పంటలకు అదనపు ఎరువుల అవసరం తగ్గుతుంది. ఇలా వరి పంటలోని పోషక అవశేషాలను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా ఎరువుల వ్యయం తగ్గి, నేల సారం మరియు పంట దిగుబడి మెరుగుపడతాయి.

**వానాకాలపు వరి పంట పోషక అవశేషాలతో యాసంగి పెసర మరియు మినుము సాగులో పాటించాల్సిన మరిన్ని యాజమాన్య చర్యలు:**

- వరి తరువాత సాగుచేసే పెసర మరియు మినుము పంటలు నీటిముంపుకు చాలా సున్నితంగా ఉంటాయి కనుక సరైన నీటి యాజమాన్యం అత్యంత ముఖ్యమైనది. నీటిముంపు కొనసాగితే నాడ్యూల్స్‌లలో ఆక్సిజన్ సరఫరా తగ్గిపోయి నాడ్యూలేషన్ మరియు నైట్రోజన్ స్థిరీకరణ పూర్తిగా దెబ్బతింటాయి. ఇది మొక్కల పెరుగుదల నుండి గింజల ఏర్పాటు వరకు ప్రతికూల ప్రభావం చూపుతుంది.
- ఈ పంటల పెరుగుదల దశలో రెండు దశలు నీటి పరంగా అత్యంత కీలకం, పుష్పించే దశ (35-40 రోజులకు) మరియు గింజల అభివృద్ధి దశ (50-60 రోజులకు). ఈ దశల్లో తేమ లోపం ఉంటే పూత రాలడం అధికమై, గింజ సరిగా పట్టకపోవడంతో తాలు గింజల సమస్య అధికంగా కనబడుతాయి. కాబట్టి వర్షాభావ ప్రాంతాలలో లేదా తేమ కొరత ఉన్న పొలాల్లో ఈ దశల్లో తప్పనిసరిగా ఒక్కో తడి ఇస్తే దిగుబడిలో 15-25% వరకు అభివృద్ధి కనిపిస్తుంది.
- తేలికపాటి నేలల్లో స్ప్రింక్లర్ ద్వారా చేసే నీటి యాజమాన్యం మంచి ఫలితాలను ఇస్తుంది. అధిక నీటి వ్యయాన్ని తగ్గించడానికి డ్రిప్ ద్వారా చేసే నీటి యాజమాన్యం అత్యంత సమర్థవంతమైన పద్ధతి. వర్షాభావ పరిస్థితుల్లో యాంటీ ట్రాన్స్పిరెంట్స్‌ని ఉపయోగించడం, అలాగే 1% పొటాషియం నైట్రేట్ లేదా 2% 19-19-19 వంటివి పిచికారి చేయడం వల్ల మొక్కలు బెట్ట పరిస్థితుల నుండి కోలుకుంటాయి.
- ఈ రెండు పంటలు చీడపీడలకు అత్యంత సున్నితంగా ఉండే పంటలు. ముఖ్యంగా పుష్పించే దశ నుండి గింజల అభివృద్ధి దశ వరకు చీడపీడల వల్ల గణనీయమైన దిగుబడి నష్టం సంభవిస్తుంది. అందువల్ల సమగ్ర చీడపీడల నిర్వహణ

అత్యవసరం. కాయ తొలిచే పురుగు ఆకులు, కోమలమైన పుష్పాలు, లేత దశలో ఉన్న గింజలను తిని నష్టం చేస్తుంది. దీని నివారణకు ప్రారంభ దశలలో వేపనూనె 5% లేదా జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా కట్టడి చేసుకోవాలి. నష్టం తీవ్రంగా ఉంటే గనుక ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.2 గ్రా. లేదా క్లోరాంట్రానిలిప్రోల్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

- తామర పురుగులు మరియు తెల్లదోమ ఈ పంటల్లో పంట రసాన్ని పీల్చడంతో పాటు వైరస్ వ్యాప్తికి కారకాలుగా ఉండి ఎల్లో మోసాయిక్ వైరస్ వ్యాప్తికి ప్రధాన వాహకంగా ఉంటాయి. ఈ పురుగులను నియంత్రించడానికి పంట పొలాల్లో కలుపు మొక్కలు లేకుండా జాగ్రత్తపడాలి. అలాగే ఎసిటామిప్రిడ్ 2 గ్రా. లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ముఖ్యంగా ఈ వ్యాధిని తట్టుకునే రకాలను సాగుచేసుకోవాలి.
- ఆకులపై తెల్లటి పొరలా ఏర్పడే బూడిద తెగులును తగ్గించడానికి డైఫెన్‌కొనజోల్ 1.0 మి.లీ. లేదా గంధకం 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి 10–15 రోజుల వ్యవధిలో రెండు మార్లు పిచికారి చేసుకోవాలి. అలాగే ఆకులపై మచ్చలను నివారించడానికి మాంకోజెబ్ 2.5 గ్రా లేదా కార్బండాజిమ్ 1.0 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- అలాగే చీడపీడల నివారణలో జీవ నియంత్రణ పద్ధతుల (వేప కషాయం, బవేరియా, మెటారైజియం, క్రైసోపెర్ల మరియు ట్రైకోగ్రామ) ద్వారా ఉదయం లేదా సాయంత్రం సమయంలో సన్నని నాజిల్‌తో ఎకరానికి 200-250 లీ. నీటిలో కలిపి పిచికారి చేసుకోవడం వల్ల పర్యావరణానికి సైతం మేలు కలుగును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 6304489410**

## ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం మరియు వ్యవసాయశాఖ వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న "రైతు నేస్తం"

### రైతు వేదికల వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా శాస్త్రవేత్తల – రైతుల ముఖాముఖి – డిసెంబర్ 2025

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| 1 | 02.12.2025 | యాసంగికి అనువైన వరి రకాలు | **డా।। బి. లక్ష్మీ ప్రసన్న,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)<br>వరి పరిశోధన కేంద్రం, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9573316477 |
| 2 | 09.12.2025 | పురుగు మందుల అవశేషాలు – తీసుకోవాల్సిన జాగ్రత్తలు | **డా।। కె. వాణిశ్రీ,** సీనియర్ శాస్త్రవేత్త (ఎంటమాలజీ)<br>ఎ.ఐ.ఎన్.పి. ఆన్ పెస్టిసైడ్ రెసిడ్యూస్ ల్యాబ్, రాజేంద్రనగర్<br>ఫోన్ నెం.: 9494407924 |
| 3 | 16.12.2025 | యాసంగి మొక్కజొన్నలో సస్యరక్షణ | **డా।। బి. మల్లయ్య,** ప్రధాన శాస్త్రవేత్త (పాథాలజీ)<br>మొక్కజొన్న పరిశోధన విభాగం, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9440504167 |
| | | | **డా।। సిహెచ్. అనూష,** శాస్త్రవేత్త (ఎంటమాలజీ)<br>మొక్కజొన్న పరిశోధన విభాగం, రాజేంద్రనగర్, ఫోన్ నెం. 9701518923 |
| 4 | 23.12.2025 | యాసంగిలో పశుగ్రాసాల సాగు – సూచనలు | **డా।। ఎస్. శ్రీనివాస్,** సీనియర్ శాస్త్రవేత్త (అగ్రానమి)<br>ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ ఫోరేజ్ క్రాప్స్ యూనిట్, ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్<br>ఫోన్ నెం.: 9010406447 |
| 5 | 30.12.2025 | యాసంగి అపరాల్లో సస్యరక్షణ | **డా।। జె. హేమంత్ కుమార్,** అసోసియేట్ డీన్<br>వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట, ఫోన్ నెం.8332970374 |



# వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్

డా॥ ఆర్. విజయ కుమారి, జి. రామకృష్ణ, పి. వెంకటేష్ మరియు ఏ. శ్రీనివాస్
వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో వ్యవసాయ ఆర్థిక శాస్త్ర విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్‌లో వ్యవసాయ మార్కెట్ ఇంటలిజెన్స్ కేంద్రంను ఒక పరిశోధన పథకంగా వ్యవసాయ పంటల ముందస్తు ధరలను అంచనా వేయుటకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖ వారి ఆర్థిక సహాయంతో స్థాపించడం జరిగింది. ఈ కేంద్రం 2025-26 సం॥ ఖరీఫ్ మరియు రబీ కాలంలో సాగు చేసే వివిధ రకాల పంటల ముందస్తు ధరలను పంటకోత సమయంలో ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది. ఈ ముందస్తు ధరలను అంచనా వేయుటకు రాష్ట్ర ప్రధాన మార్కెట్లలోని 7 నుండి 23 సం॥ల నెలవారీ మోడల్ ధరలను తీసుకొని విశ్లేషణ చేయడం జరిగింది. ఈ విశ్లేషణ ఫలితాలు మరియు మార్కెట్ సర్వేలను అనుసరించి 2025-26 ఖరీఫ్ మరియు రబీ పంటకోత సమయంలో ధర ఏ విధంగా ఉండునో అంచనా వేయడం జరిగింది, దానిని అనుసరించి:

**2025-26 వానాకాలం (ఖరీఫ్) పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | ఆముదం | గద్వాల్ | డిసెంబర్-జనవరి | 5550-5850 |

**2025-26 యాసంగి (రబీ) పంట కోత సమయంలో వివిధ పంటల ధరలు:**

| క్ర.సం | పంటలు | ప్రధాన మార్కెట్ | అంచనా ధరలు వర్తించు సమయం | అంచనా ధరలు (రూ./క్వి). |
|---|---|---|---|---|
| 1. | టమాట | బోయినపల్లి | డిసెంబర్-జనవరి | 1500-1800 |
| 2. | వంకాయ | బోయినపల్లి | డిసెంబర్-జనవరి | 1780-2020 |

ముందస్తు ధరల గురించిన సమాచారం కోసం దిగువ ఇవ్వబడిన ఫోన్ నెంబర్లని సంప్రదించగలరు.
మొబైల్ నెం. : 9948780355, 9154828514, ఈ మెయిల్ : amic.pjtsau@gmail.com
వెబ్ సైట్ : https://pjtau.edu.in/agri-marketing-intelligence.html

**గమనిక :** గత 20 సంవత్సరాల ధరలను విశ్లేషించి పైన తెలిపిన ధరలను వివిధ పంటల ముఖ్య మార్కెట్లలో అంచనా వేయడం జరిగింది. పంట రకము, నాణ్యత, అంతర్జాతీయ ధరలు, ఎగుమతి లేదా దిగుమతి పరిమితుల మూలంగా అంచనా ధరలలో మార్పు ఉండవచ్చును, కావున భవిష్యత్‌లో పంటల ధరల మార్పునకు ఈ కేంద్రం ఏ విధమైన బాధ్యత వహించదు.

# వ్యవసాయ విద్యా దినోత్సవం ప్రాముఖ్యత

డా॥ కె. సౌజన్య, డా॥ బి. సవిత, డా॥ బి. జగదీశ్వరి, డా॥ ఏ. ఉదయ్, డా॥ కె. రాకేష్, డా॥ డి. శిరీష మరియు డా॥ అఫ్షాన్ జబీన్

వ్యవసాయ విస్తరణ విభాగం, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్







2016 సం. నుండి ప్రతి సంవత్సరం డిసెంబర్ 3న, భారతదేశం వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని జరుపుకుంటుంది. ఇది దేశ వ్యాప్తంగా వ్యవసాయ విద్యను ప్రోత్సహించడానికి మరియు బలోపేతం చేయడానికి భారత వ్యవసాయ పరిశోధన మండలి ద్వారా అంకితం చేయబడిన దినోత్సవం. ఈ తేదీ, మన దేశ స్వాతంత్ర్యం తర్వాత ఏర్పడిన మధ్యంతర ప్రభుత్వంలో (1946-47) మొదటి ఆహార మరియు వ్యవసాయ శాఖామంత్రి గానూ, తరువాత మొదటి రాష్ట్రపతిగా దీర్ఘకాలం సేవలందించిన డా॥ బాబు రాజేంద్రప్రసాద్ గారి జయంతి.

ఈ రోజును ఆయనకు అంకితం చేయాలనే నిర్ణయం కేవలం ఉత్సవప్రాయమైనది కాదు, ఇది ఆయన దార్శనికత మరియు భారతదేశ ఆధునిక వ్యవసాయ విద్యా వ్యవస్థ మధ్య నిరంతరాయతను ప్రతిబింబించే, చారిత్రక ఆధారాలతో కూడిన మేధోపరమైన నివాళి. ఈ ఆచరణ వ్యవసాయం కేవలం సాగు రంగం మాత్రమే కాదు, జ్ఞానం, శాస్త్రం, విధానం, నీతి మరియు జాతీయ మనుగడా గుర్తింపుకు ప్రతీక.

డా॥ రాజేంద్రప్రసాద్ అధికారికంగా వ్యవసాయ శాస్త్రవేత్త కానప్పటికీ, ఆధునిక భారతదేశంలో, గ్రామీణ జీవితపు ఆత్మని లోతుగా అర్థం చేసుకున్న బహు కొద్ది మంది నాయకులలో ఆయన ఒకరు. 1884లో బీహార్‌లోని వ్యవసాయ కుటుంబంలో జన్మించిన ఆయన పెంపకం-గ్రామ జీవితం. కాలానుగుణ సాగు మరియు వ్యవసాయ సంస్కృతి యొక్క లయలలో సాగింది. తన రాజకీయ జీవితంలో మరియు రాష్ట్రపతిగా సేవలందించిన కాలంలోనూ భారతదేశ భవిష్యత్తు మన గ్రామాలు మరియు రైతులలో ఉందని పునరుద్ఘాటించారు. వ్యవసాయ ఉత్పాదకత, గ్రామీణ అభివృద్ధి మరియు రైతు సంక్షేమం మన జాతీయ నిర్మాణానికి మూలం అని, వ్యవసాయం వెనుకబడిన వృత్తి కాదు, నాగరికతకు పునాది అని విశ్వసించి, తదనుగుణ వ్యవసాయ మరియు గ్రామీణ అభివృద్ధి విధానాలను ఆయన తీసుకొచ్చారు. వీటి మూలాలపైనే ఆధునిక వ్యవసాయ విద్యా వ్యవస్థ ఉద్భవించింది. ఉదాహరణకు వ్యవసాయ విద్యను ప్రోత్సహించడం, సాంకేతిక ఉత్పత్తి (పరిశోధన) మరియు సాంకేతిక వ్యాప్తి (విస్తరణ) యూనిట్ల మధ్య బలమైన అనుసంధానాల ద్వారా వ్యవసాయ రంగం పటిష్ఠంగా నిలుస్తూ, దేశ ప్రగతికి తోడ్పడుతుందని ఊహించి, తద్వారా భారత వ్యవసాయ పరిశోధన మండలి రాష్ట్ర విభాగాలు, విశ్వవిద్యాలయాలు రైతులకు ప్రయోజనం చేకూర్చేలా అనుసంధానించిన దార్శనికుడు.

రైతుల యొక్క సాంప్రదాయ వ్యవసాయ జ్ఞానానికి, ఆధునిక పద్ధతులు జోడించే విధంగా దేశానికి దిశా నిర్దేశం చేసారు. తదుపరి కాలాలలో భారతదేశం జీవనాధార వ్యవసాయం నుండి ప్రణాళికాబద్ధమైన వ్యవసాయ అభివృద్ధి వైపు అడుగులు వేస్తూ హరితవిప్లవం నుండి ఈరోజు కృత్రిమ మేధస్సును వినియోగించే స్థాయికి అభివృద్ధి చెందింది. డా॥ రాజేంద్రప్రసాద్ గారు ఊహించినట్టు ఈ పరివర్తనకు శిక్షణ పొందిన నిపుణులు, శాస్త్రీయ నైపుణ్యం మరియు నిర్మాణాత్మక విద్యాసంస్థలు అవసరమయ్యాయి. వ్యవసాయ పరిశోధన, విస్తరణ మరియు బోధన కోసం అత్యున్నత సంస్థ అయిన భారత వ్యవసాయ పరిశోధనా మండలి, దేశ వ్యాప్తంగా విస్తరించిన రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, కృషి విజ్ఞాన కేంద్రాలు, కేంద్ర వ్యవసాయ వర్సిటీలు, డీమ్డ్ విశ్వవిద్యాలయాలతో ప్రపంచంలోనే అతి పెద్ద సంస్థాగత నెట్‌వర్క్‌గా వ్యవసాయ రంగ కార్యకలాపాలను సమన్వయం చేస్తుంది.






ఈ పునాదుల ప్రాముఖ్యాన్ని గుర్తించడానికి డిసెంబర్ 3వ తేదీని వ్యవసాయ విద్య దినోత్సవంగా అంకితం చేయడం ద్వారా జాతీయ ఆహార వ్యవస్థలు, గ్రామీణ జీవనోపాధి మరియు పర్యావరణ స్థిరత్వాన్ని కొనసాగించడంలో వ్యవసాయ ప్రాముఖ్యతను తెలిపి; వ్యవసాయ విధానాలు ఎలా సంస్థాగతీకరించి, భవిష్యత్ విధానాలు రూపకల్పన చేయాలో విశ్లేషించడం; మరియు భావితరాలకు వ్యవసాయం పట్ల అవగాహన మరియు గౌరవాన్ని ప్రోత్సహించే మహోన్నత దినోత్సం.




మన రాష్ట్రంలో ఉన్న రాజేంద్రనగర్ వ్యవసాయ పరిశోధన స్థానానికి, రాజేంద్రనగర్ మండలానికి మరియు డా॥ రాజేంద్రప్రసాద్ గారికి చారిత్రాత్మక అనుబంధం కూడా ఉంది. 1955 లో రాష్ట్రపతిగా అప్పటి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ ఎస్టేట్, హిమాయత్‌సాగర్‌కు విచ్చేసి, వ్యవసాయ పరిశోధనలు ఎలా జరుగుతున్నాయో పర్యవేక్షించి, అప్పటి నిర్వహణ అధికారులతో కార్యకలాపాలను అడిగి తెలుసుకొని, మెళకువలు సూచించి, హర్షం వ్యక్తం చేసారు. వారు కిద్వాయ్ కాటేజ్‌లో బసచేసి, తన రాకకు గుర్తుగా ఒక మొక్క నాటారు. వారికి వ్యవసాయం పై ఉన్న శ్రద్ధ, పటుత్వం చూసి ప్రాంతీయ నిర్వహణ అధికారులు హిమాయత్ సాగర్ ఏరియాకు రాజేంద్రనగర్ అని నామకరణం చేసారు.



ఆ తర్వాత ఇదే ప్రాంతంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ కళాశాల ఏర్పాటు, భారత వ్యవసాయ పరిశోధన మండలి విభాగాల ఏర్పాటు ద్వారా వ్యవసాయ పరిశోధన, బోధన, విస్తరణ పటిష్టం చేయడం జరిగి, రాజేంద్రనగర్ అనగానే వ్యవసాయ మరియు అనుబంధ సంస్థల నిలయంగా పేరుగాంచింది. ఆయన నాటిన మొక్క, మన వ్యవసాయ పరిశోధన స్థానం పరిసరాల్లో వృక్షం అయి విరసిల్లుతుంది. వ్యవసాయ విద్యా దినోత్సవాన్ని జరుపుకోవడం వ్యవసాయ రంగానికి మనం అందించే గౌరవం.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9398262273

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునీత దేవి



**అడ్డం:**

1. వివిధ పంటల్లో వచ్చే ఎండు తెగులు నివారణకు విరివిగా వాడే శిలీంధ్రనాశిని పేరు? (8)
4. క్యాబేజీలో డైమండ్ బ్యాక్ మాత్ నివారణకు అంతరపంటగా ఏ పంటను వేసుకోవాలి? (3)
7. తొలకరి వర్షాలు పడిన తర్వాత భూమి నుండి బయటకు వచ్చి వేప, మునగ, సబాబుల్‌లను ఆశించే పురుగు ఏది? (5) (కుడి నుండి ఎడమకు)
8. వరిలో ఆశించే ఓ తెగులు ఆకులపై నూలు కండె ఆకారం మచ్చలు ఏర్పరుస్తుంది? (5)
9. నూనెగింజల పంట పూరెక్కలలో ఔషధ గుణాలు ఉంటాయి? అది ఏ పంట? (3)
11. తీగజాతి కూరగాయలలో ఆశించి అధిక నష్టం కలుగజేసే పురుగు ఏది? (4)
13. వయ్యారిభామ కలుపు మొక్క నియంత్రణకు ఏ పురుగు విడుదల చేయాలి? (4)

**నిలువు:**

1. టమాటాలో ఏ ధాతువు లోపం వలన కాయ ఎండుతెగులు వస్తుంది? (3)
2. చెదలు నివారణకు ఉపయోగించే క్రిమి సంహారక మందు? (6)
3. ప్రకృతి వ్యవసాయంలో భూమిలో పోషక విలువలు పెంచడానికి ఏమి వాడాలి? (4)
5. ప్రత్తిలో కాండానికి మందు పూత పద్ధతిలో ఉపయోగించే రసాయనిక మందు ఏది? (5) (క్రింది నుండి పైకి)
6. వరి మాగాణుల్లో గట్ల మీద పెంచడానికి అనువైన కంది రకం ఏది? (3)
8. బంచిటాప్ అనే తెగులు ఏ పంటలో ఆశించి నష్టం కలుగజేస్తుంది? (3)
10. వరిలో ఏ పురుగు ఆశించినప్పుడు పొలంలో నీరు ఆపివేస్తే తగ్గుతుంది? (4)
12. కందిలో కాపు దశకు వచ్చిన తర్వాత మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోతాయి దేని వలన? (5) (క్రింది నుండి పైకి)

సమాధానాలు 32వ పేజీలో

# చెఱకు నాణ్యతను ప్రభావితం చేసే అంశాలు

జి. రాకేష్, ఎం. సాయి చరణ్, డా॥ ఏ. కృష్ణ చైతన్య, డా॥ సమతా పరమేశ్వరి బి. మంజు భార్గవి,
డా॥ రమ్య రాథోడ్ మరియు డా॥ కె. పవన్ చంద్రా రెడ్డి
ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూరు



మన దేశ ఆర్థిక వ్యవస్థలో చక్కెర పరిశ్రమ కీలకమైన పాత్ర వహిస్తోంది. ఈ పరిశ్రమలో లాభదాయకత ప్రధానంగా కర్మాగారాలకు లభ్యమయ్యే చెఱకు నాణ్యత మరియు పంచదార రికవరీ శాతంపై ఆధారపడి ఉంటుంది. కాబట్టి పంచదార కర్మాగారాలు చెఱకు క్రషింగ్ సీజన్ మొత్తం – సాధారణంగా నవంబర్ నెల నుండి మార్చి రెండవ వారం వరకు – బాగా పక్వమయిన, అధిక పంచదార పాళ్ళు కలిగిన చెఱకును లభ్యమయ్యేలా ఏర్పాట్లు చేసుకోవాలి.

రైతులు సాధారణంగా అధిక దిగుబడి కోసం నత్రజని ఎరువులను అధిక మోతాదులో వాడతారు. దాంతో చెఱకు ఉత్పత్తి పెరిగినా, రసనాణ్యత మరియు పంచదార రికవరీ శాతం తగ్గే అవకాశం ఉంటుంది. పంచదార రికవరీ తగ్గితే కర్మాగారాలు కూడా తక్కువ రేటును చెల్లిస్తాయి, ఎందుకంటే ఫ్యాక్టరీలు చెఱకు రికవరీ శాతాన్ని బట్టి రైతులకు ధర నిర్ణయిస్తాయి.

అందువల్ల, చెఱకు పంటలో అధిక దిగుబడి మాత్రమే కాకుండా, నాణ్యత మరియు పంచదార శాతం పెంపొందించడం కూడా రైతుల ప్రధాన లక్ష్యంగా ఉండాలి. నాణ్యమైన చెఱకు ఉత్పత్తి చేస్తే రైతులకు మెరుగైన ధర లభించడమే కాక, కర్మాగారాలకు కూడా లాభదాయకమవుతుంది.

**చెఱకు నాణ్యత:** చెఱకు పంట దిగుబడి, నాణ్యత పరస్పరం ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్న అనేక అంశాలపై ఆధారపడి ఉంటాయి. అందులో కొన్ని అంశాలు చెఱకు మొక్కకు సంబంధం లేనివి అనగా బాహ్యమయిన వాతావరణం. ముఖ్యంగా గరిష్ట–కనిష్ట ఉష్ణోగ్రతలు, వర్షపాతం, భూమిలోని తేమ, భూమిలోగల నత్రజని ప్రభావితం చేసే బాహ్యంశాలు. మరికొన్ని అంశాలు చెఱకు మొక్కకు సంబంధించిన అంతర్గతమయిన అంశాలైనటు వంటి మొక్క వయస్సు ఆకులలో ఉండే నత్రజని, ఆకులలో ఉండే తేమ, చీడ పీడలు మొదలయినవి.

**వాతావరణ పరిస్థితుల ప్రభావం:** ఒక ప్రాంతంలో ఆచరిస్తున్న వ్యవసాయ పద్ధతులు దాదాపు ఎలాంటి మార్పులు లేకుండా కొనసాగుతున్నప్పటికీ పంచదార కర్మాగారంలో ఆడించడానికి లభ్యమయ్యే చెఱకు నాణ్యత మాత్రం ఒక సీజనులో ఉన్న విధంగా మరొక సీజన్లో ఉండదు, తేడాలు గమనించవచ్చు. వర్షాపాతం, ఉష్ణోగ్రత, గాలిలో తేమ, సూర్యరశ్మి లభించే కాల వ్యవధి మొదలయిన వాతవరణాంశాలే ప్రధాన కారణంగా ఉంటున్నాయి. అంతేగాక వర్షపాతం మరింత ప్రధానపాత్ర వహిస్తుంది.

**ఉష్ణోగ్రతలో హెచ్చుతగ్గుల ప్రభావం:** ఏ రోజుకారోజు, గరిష్ట ఉష్ణోగ్రతకు కనిష్ట ఉష్ణోగ్రతకు మధ్య తేడా అధికము అయినకొలదీ, చెఱకులోని సుక్రోసు పాలు అధికం అవుతుంది. నిజామాబాద్, జహీరాబాద్, మెట్ పల్లి ప్రాంతాలలోగల శీతోష్ణ పరిస్థితులు, చెఱకు గడలలో పంచదార హెచ్చుగా కూడుకొనటానికి అనువుగా ఉన్నాయి. అక్టోబర్ నుండి మార్చి వరకు చెఱకు నరుకుతూ ఉంటారు. ఆ సమయంలో వాతావరణం పొడిగా ఉంటుంది, కనిష్ట గరిష్ట ఉష్ణోగ్రతకు మధ్య తేడా హెచ్చుగా ఉంటుంది.

**పైరు వయస్సు రకాలకుగల పాత్ర:** చెఱకు రస నాణ్యతను, దిగుబడిని ప్రభావితం చేసే అంశాలలో–సీజన్, చెఱకు నాటిన సమయం, చెఱకు నరికే సమయం రకాలు కూడా ఉన్నాయి. ఆలస్యంగా నాటినందువలన రస నాణ్యత తగ్గి దిగుబడి తగ్గుతుంది. ఆయా చెఱకు రకాలకు పుట్టుకతో వచ్చిన సామర్థ్యం కారణంగా పక్వానికి వచ్చే సమయాలలో తేడాలుంటాయి. పంచదార పాలు హెచ్చుగా ఉండే నాణ్యమయిన రకాలు, మొక్క

ప్రక్రియ నిర్వహణలో సమర్ధవంతంగా ఉంటాయి. పక్వానికి వచ్చే తరుణంలో మొక్కలో తేమ తక్కువగా ఉండునట్లు చేసుకుంటాయి. ముందుగా పక్వానికి వచ్చే చెఱకు రకాలలో కో 6907, కో సి 671 మరియు వసుధ, సీజన్ మధ్యలో పక్వానికి వచ్చే రకాలలో కో 86032 మరియు హరిత మంచి దిగుబడులను ఇస్తున్నాయి. స్వల్ప, మధ్య మరియు దీర్ఘకాల రకాలను వరుసగా 30:50:20 నిష్పత్తిలో నాటుకొని అదే క్రమంలో మిల్లులలో ఆడించినచో పంచదార దిగుబడులు బాగుగా పెరుగుతాయి.

**భూసార పరిస్థితి:** పల్లపు నేలల్లో పెరిగిన చెఱకులో సీజన్ ప్రారంభంలో సుక్రోస్ పాలు, రసనాణ్యత మెరక భూములలో పండించిన చెఱకు కన్నా తక్కువగా ఉంటాయి. మాగాణి భూములలో పండించిన చెఱకు కంటే లంక భూములలో పెరిగిన చెఱకు అధిక దుగుబడులనివ్వడమేగాక, నాణ్యమయినదిగా కూడా ఉంటుంది. తేలిక ఇసుకపారు నేలల్లో పండించు చెఱకు బంకమట్టితో కూడిన బరువయిన నేలల్లో పండించిన చెఱకు కంటే నాణ్యమయినదిగా ఉంటున్నది. బరువయిన నేలల్లో పండించిన చెఱకు రసంలో సున్నం, బూడిద అధికంగా ఉంటాయి కాని భాస్వరం తక్కువగా ఉంటుంది.

**పిలకలు తొడిగే తీరు:** పిలకలన్నీ ఒకేసారి పెరగక పోవడంవల్ల ఆలస్యంగా వచ్చే పిలకల వల్ల చెఱకు నాణ్యత మరియు దిగుబడి తగ్గుతుంది. కో 419 మరియు కో 8013 రకాలలో ఆలస్యంగా వచ్చే పిలకలు హెచ్చుగా ఉంటాయి. వాటి వల్ల చెఱకు దిగుబడి పెరుగుతుంది కాని నాణ్యత దెబ్బ తింటుంది.

**ఎరువుల వాడకం:** చెఱకు గడకు అవసరమయిన వివిధ పోషక పదార్థాలు తగుపాళ్ళలో లభ్యమవడంపైనే రస నాణ్యత రీకవరీలు ఆధారపడి ఉంటాయి. ప్రత్యేకించి నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను తగిన పాళ్ళలో మొక్కకు లభ్యం కావాలి. చెఱకు పక్వానికి వచ్చే తరుణంలో మొక్క కణజాలంలో నత్రజనిపాలు అధికంగా ఉన్న భూమిలో నత్రజని అధికంగా ఉన్న చెఱకు గడలో పంచదార పాలు తగ్గుతుంది. చెఱకు పక్వానికి వచ్చే దశలో నీటి తడులు తరుచు ఇవ్వటం వలన నేలలోని నత్రజని ఆ నీటిలో కరిగి బయటకు పోతుంది. తడులు ఆలస్యంగా కట్టినందువల్ల త్వరగా పక్వానికి వస్తుంది. భాస్వరం పొటాష్‌లను ఏ మేరకు చెఱకు ఇమిడ్చుకోగలదో, ఆ మేరకే నత్రజనని కూడా స్వీకరించ గలుగుతుంది. అందువల్ల ఎరువులు వాడకంలో సమతూకం అవసరం. చెఱకు రసంలో పంచదార పాలను అధికం చేసే లక్షణం ఫాస్ఫేట్‌కు మౌలికంగా ఉంది. చెఱకు రసంలో భాస్వరం ఉనికి రసంలో నలుసులు లేకుండా నివారించుతుంది. చీడ-పీడలను తట్టుకోగల శక్తిని పెంపొదించుతుంది.

**వర్షాభావస్థితి:** తీవ్రమైన వర్షాభావ పరిస్థితులలో సుక్రోస్ కూడు కొనడానికి అంతరాయం ఏర్పడి రస నాణ్యత దెబ్బతింటుంది. వర్షాభావానికి లోనయిన చెఱకు గడులు త్వరగాను, వేగం గాను కొరగాకుండా పోతాయి. పంట దిగుబడిలో కూడా అధిక నష్టం సంభవించుతుంది.

**నీటిముంపు:** చెఱకు తోటలో నీరు అధికంగా నిలిచి ఉంటే మొక్క ప్రక్రియ నిర్వహణలో అంతరాయం కలుగుతుంది. నీటిముంపు వల్ల ముదురు పైరుకంటే లేతపైరు మరింత హెచ్చుగా దెబ్బ తింటుంది. అందువల్ల చెఱకు దిగుబడి మరియు నాణ్యత దెబ్బతింటాయి. మిగతా రకాల కంటే కో 6907, కో 7219 రకాలు ముంపును బాగా తట్టుకొనగలవు.

చెఱకు పక్వానికి వచ్చే దశలో, పక్వతకు దోహదపడే మందులను పిచికారి చేస్తుంటారు అలా చేసినందువలన, చెఱకు గడలోని తేమ హరించుకుపోతుంది. అలాంటి మందులు చల్లని పొలాలలో కంటే చల్లిన పొలాలలో పంచదార దిగుబడి హెచ్చుగా ఉంటుంది.

**చీడ-పీడలు:** చీడ-పీడలకు గురయినందువల్ల చెఱకు దిగుబడి, నాణ్యత దెబ్బతింటాయి. ఎక్సాలి చెఱకు నాట్లు ఆలస్యంగా జనవరి తర్వాత చేస్తే పీకపురుగు ఆశించే ప్రమాదం అధికం. అడ్సాలి చెఱకు పైరుకు పొలుసు పోరుగు హెచ్చు. వాటివల్ల పంట దిగుబడి, రసనాణ్యత దెబ్బతింటాయి.

**పక్వత- చెఱకు నరికే తరుణం:** చేలోనే చెక్కర తయారవుతుంది, మిల్లులో దానిని బయటకు తీస్తారు అనే వాస్తవాన్ని గుర్తించి ప్రతి రైతు మిల్లులో పంచదార దిగుబడి పెంచడానికి మిల్లు పరిధిలోని చెఱకు తోటలలో పక్వత ఏ విధముగా ఉన్నది నిర్ణయించి దాని ప్రకారము చెఱకు తోటలను నరకాలి.

కొత్త రకాలను విడుదలతోనే సమస్యలు పరిష్కారంకావు. దానితోనే పంట దిగుబడి, నాణ్యత వాటంతటవే పెరగవు. సరైన వ్యవసాయ పద్ధతుల ద్వారా ఆ రకాల సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవాలి. అందుకుగాను, వ్యవసాయ పద్ధతులను నిరంతరం మెరుగు పరచుతూ ఉండాలి. ఒక చెఱకు రకం ద్వారా సరియైన సాగు పద్ధతులతో చెఱకులో పంచదారను అధికంగా ఉండేట్లు చేయుట రైతు వంతు కాగా, దానిని పూర్తిగా వెలికిదీయడం మిల్లులోని సాంకేతిక నిపుణుల పని.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9398157303**

# యాసంగి పశుగ్రాస పంటల యాజమాన్యం

డా॥ డి. పద్మజ, డా॥ ఎస్. శ్రీనివాస రావు మరియు డా॥ జె. అరుణ కుమారి

అఖిల భారత సమన్వయ పరిశోధన సంస్థ, పశుగ్రాస పంటల విభాగం, ఏఆర్ఐ, రాజేంద్రనగర్





యాసంగిలో పశుగ్రాసాలు మొక్కజొన్న, జొన్న, ఓట్స్, ల్యూసర్న్ మరియు అలసందలు సాగుచేయవచ్చును. పశువులకు 3 వంతుల ధాన్యపుజాతి, ఒక వంతు పప్పుజాతి పశుగ్రాసాలు మేపాలి. ల్యూసర్న్‌లో 22% మాంసకృతులు ఉంటాయి. మొక్కజొన్నలో 8–10% ముడి మాంసకృతులు ఉంటాయి.

**బొబ్బర్లు / అలసందలు:**

**నేలలు:** నీరు నిలువని నల్లరేగడి మరియు ఎర్రగరప నేలల్లో బొబ్బర్లు సాగుచేయవచ్చును.

**రకాలు:** విజయ, యుపిసి-5286, బుందేల్ లోబియ-1, బుందేల్ లోబియ-2, కెబిసి-2 మరియు ఇసి 4216 రకాలు సాగుచేయవచ్చును.

**విత్తు సమయం:** అక్టోబర్ – నవంబర్ వరకు విత్తుకోవచ్చును.

**విత్తన మోతాదు:** ఎకరానికి 15–18 కిలోల విత్తనం వేయాలి.

**విత్తు దూరం:** సాలుకు సాలుకు మధ్య దూరం 30 సెం.మీ. మొక్కకు మొక్కకు మధ్య దూరం 10 సెం.మీ.

**ఎరువుల యాజమాన్యం:** ఎకరానికి 8 కిలోల నత్రజని మరియు 16 కిలోల భాస్వరంతో పాటుగా పశువుల ఎరువు 2 టన్నులు ఆఖరి దుక్కిలో వేసుకోవాలి.

**నీటి యాజమాన్యం:** విత్తిన వెంటనే నీరు పెట్టాలి. తర్వాత 8–10 రోజులకు ఒకసారి నీటితడి పలుచగా ఇవ్వాలి. తదుపరి నీటితడులు నేల స్వభావాన్ని మరియు వాతావరణ పరిస్థితులను బట్టి ఇవ్వాలి.

**కలుపు యాజమాన్యం:** విత్తిన 24–48 గంటలలోపు పెండిమిథాలిన్ 5 మి.లీ. లీటరు నీటిలో కలిపి తేమగల నేలపై పిచికారి చేయాలి. పంట మొలిచిన 15–20 రోజులకు లీటరు నీటికి ఇమాజితాఫిర్ 1.5 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**కోత సమయం:** విత్తిన 55–65 రోజులకు 50% పూతదశలో కోయాలి.

**దిగుబడి:** 8–10 టన్నులు / ఎకరానికి

**పశుగ్రాస మొక్కజొన్న:**

**నేలలు:** నీరు విలువని అన్ని రకాల నేలలు అనుకూలం.

**విత్తు సమయం:** అక్టోబర్ – నవంబర్

**రకాలు:** ఆఫ్రికన్ టాల్, జె-1006, టిఎస్ఎఫ్ఎమ్ 15-5, జె-1007 రకాలు అనుకూలమైనవి.

**విత్తన మోతాదు:** 20–25 కిలోలు / ఎకరానికి విత్తుకోవాలి.

**విత్తు దూరం:** వరుసల మధ్య దూరం 30 సెం.మీ. మొక్కల మధ్య దూరం 10 సెం.మీ.

**ఎరువుల యాజమాన్యం:** ఆఖరి దుక్కిలో ఎకరానికి పశువుల ఎరువు 4 టన్నులు, 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరం మరియు 12 కిలోల పొటాష్‌ను వేసుకోవాలి. విత్తిన 30-35 రోజులకు 12 కిలోల నత్రజనినిచ్చే ఎరువులను వేసుకోవాలి.

**విత్తనశుద్ధి:** థైరామ్ లేదా కాప్టాన్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**నీటి యాజమాన్యం:** విత్తిన వెంటనే నీరు పెట్టాలి. నేల స్వభావాన్ని బట్టి మరియు వాతావరణ పరిస్థితులను బట్టి 3-4 నీటితడులు 8–10 రోజుల వ్యవధిలో ఇవ్వాలి.

**కలుపు యాజమాన్యం:** విత్తిన 24 గంటలలోపు అట్రజిన్ 4 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**కోత సమయం:** 50% పీచు దశలో పాల కండె దశలో సైలేజ్ కొరకు కోయవచ్చును లేదా 75-85 రోజులకు పచ్చిమేతగా కోయవచ్చును.

**దిగుబడి:** 20-24 టన్నులు / ఎకరానికి

**పశుగ్రాస పంటగా జొన్న:**

**నేలలు:** అన్ని రకాల నేలల్లో జొన్నను సాగుచేయవచ్చును.

**విత్తే సమయం:** అక్టోబర్-నవంబర్

**రకాలు:** ఏక కోత రకాలు

పిసి-6, పిసి-9, యుపి చారి-1 మరియు సియస్‌వి 30 ఎఫ్

**పలు కోత రకాలు:** ఎస్ఎస్‌జి - 59-3, ఎస్ఎస్‌జి 898, పిసి 23, ఎమ్‌పి చారి

**పలుకోత హైబ్రిడ్స్:** సియస్‌హెచ్ 24 యంఎఫ్, సియస్‌హెచ్ 20 ఎమ్ఎఫ్

**గడ్డి మరియు గింజ రకాలు:** పిఎస్‌వి 31, (సి.యస్.వి 31), పిఎస్‌వి 56, ఎస్ఎస్‌వి-84, సిఎస్‌వి-27

**బహువార్షిక / పెరిన్నియల్:** సిఓఎఫ్ఎస్-29, సిఓఎఫ్ఎస్-31, సిఎస్‌వి 33 ఎమ్ఎఫ్

**విత్తన మోతాదు:** 10-12 కిలోలు / ఎకరానికి

**విత్తే దూరం:** వరుసకు వరుసకు మధ్య దూరం 30×10 సెం.మీ. మొక్కకు మొక్కకు మధ్య దూరం 10 సెం.మీ.

**ఎరువుల యాజమాన్యం:** 40:16:12 కిలోల నత్రజని, భాస్వరం మరియు పొటాష్‌నిచ్చే ఎరువులను వేసుకోవాలి. నత్రజని ఎరువులు విత్తుటకు ముందు 12 కిలోలు, రెండవ దఫా నెల రోజులకు ప్రతి కోత తర్వాత 8 కిలోలు వేయాలి.

**విత్తనశుద్ధి:** థైరామ్ లేదా కాప్టాన్ 3 గ్రా. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. మొవ్వు ఈగ నివారణకు 3 గ్రా. థయోమిథాక్సామ్ కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి.

**కలుపు యాజమాన్యం:** అట్రజన్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేసి వెడల్పాకు కలుపును నివారించుకోవచ్చును.

**నీటి యాజమాన్యం:** విత్తిన వెంటనే నీరు పెట్టవలెను. మరల విత్తిన 8-10 రోజులకు పలుచగా నీరు పెట్టవలెను.

**కోత సమయం:** 50% పూతదశలో కోయాలి. తర్వాత కోతలు ప్రతి 40 రోజుల వ్యవధిలో కోయాలి. పంటను పూతదశకు ముందు కోస్తే పశువుల్లో వాము వ్యాధి సోకే అవకాశం ఉంది.

**దిగుబడి:**

**ఏకకోత రకాలు:** 18-20 టన్నులు / ఎకరా

**పలుకోత రకాలు:** మొదటి కోతలో 16-18 టన్నులు, తర్వాత కోతకోతకి 8-10 టన్నులు / ఎకరా

**పోషకాలు:** ముడి మాంసకృతులు : 6-7% ఉంటుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9959306929**

## 28వ పేజీలోని పదవినోదం సమాధానాలు

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 కా | ప | ర్ | ఆ | క్సీ | 2 క్లో | రై | డ్ | | | 3 జీ | |
| ల్షి | | | | | రి | | మి | | 4 ఆ | వా | లు |
| యం | | | | | పై | | కా | | | మృ | |
| | | | | | రి | | ని | | | తం | |
| | | | | | ఫా | | 5 ఫ్లో | | | | |
| | | | | | స్ | | | 6 మా | | | |
| | | | | | | | గు | రు | పు | రు | 7 వే |
| 8 అ | గ్గి | తె | గు | లు | | | | తి | | | |
| ర | | | | గు | | | | | 9 కు | 10 సు | మ |
| టి | | | | తె | | | | | | డి | |
| | | | 11 పం | డు | ఈ | గ | | | | దో | |
| | | | | 12 ఎం | | | 13 జై | గో | గ్రా | మ | |

# మామిడిలో పూతకు ముందు మరియు పూత సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు

డా॥ వి. చైతన్య, డా॥ టి. సుచరిత దేవి, డా॥ టి. పావని మరియు పి.ఎస్.ఎమ్. ఫణిశ్రీ
కృషి విజ్ఞాన కేంద్రం, వైరా, ఖమ్మం





మామిడిలో పూత అనేది చాలా వరకు వాతావరణ పరిస్థితులను బట్టి జూన్ నుండి అక్టోబర్ మరియు నవంబర్ వరకు రైతులు చేపట్టే సేద్యపు విధానాలపై ఆధారపడి ఉంటుంది. సాధారణంగా నవంబర్ నుండి డిసెంబర్ మాసాల్లో ముదిరిన రెమ్మలో పూ మొగ్గలు ఏర్పడడం జరుగుతుంది. ఆయా రకం వాతావరణ పరిస్థితులను బట్టి డిసెంబర్ రెండవ పక్షం నుండి జనవరి మొదటి వారం వరకు పూ మొగ్గలు ఆలస్యంగా కనిపిస్తాయి. డిసెంబర్ 15 నుండి 20 ల మధ్య నీటి వసతి ఉన్న తోటల పాదుల్లో తేలిక పాటి తడి ఇవ్వడం లేదా పొటాషియం నైట్రేట్ (మల్టి – కే) 10 గ్రా., యూరియా 5 గ్రా. + ఆర్క మాంగో స్పెషల్ సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లీటరు నీటికి 5 గ్రా. చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి లేదా ఫార్ములా ఫోర్ సూక్ష్మ పోషకాల మిశ్రమాన్ని లీటరు నీటికి 3 గ్రా. కలుపుకొని పిచికారి చేసుకోవచ్చు. ఈ విధంగా పిచికారి చేయడం వల్ల దాదాపు ఒకేసారి పూత రావడం, పూత త్వరగా రావడం మరియు ద్విలింగ పుష్పాలు అధికంగా వచ్చి ఎక్కువ పిందెలు ఏర్పడడానికి ఉపయోగపడుతుంది. సాధారణంగా ఒక పువ్వు కొమ్మల్లో సుమారు రెండు నుండి మూడు వేల పుష్పాలు ఉంటాయి. వీటిలో 99% శాతం పూత రాలిపోతుంది. ఒక పూరెమ్మకు ఐదు నుండి ఆరు పిందెలు కడతాయి. ఈ ఐదు నుండి ఆరు పిందెలలో చివరికి ఒకటి నుండి రెండు పిందెలు మాత్రమే ఎదిగి కాయలుగా మారుతాయి. మామిడిలో మగ పుష్పాలు, ఫలదీకరణం చెందని పుష్పాలు రాలిపోవడంతో పాటు, అధిక ఉష్ణోగ్రత, బూడిద తెగులు, తేనెమంచు పురుగు, నీటి ఎద్దడి, అధిక తేమ, హార్మోన్ల లోపం వల్ల కూడా పూత, పిందె రాలిపోతాయి.

పూత సమయంలో ఒకటి నుండి రెండు తేనెటీగల పెట్టెలను తోటలలో పెట్టడం ద్వారా పిందె కట్టే శాతాన్ని మెరుగుపరచవచ్చు.

తోటల్లో అక్కడక్కడ బెల్లం ద్రావణంతో తడిపిన గోనె సంచులను వేలాడ దీయడం ద్వారా ఈగలను ఆకర్షించి పిందె కట్టే శాతాన్ని పెంచవచ్చు. పూతకు ముందు, పూ గుచ్ఛాలు సాగే సమయంలో, పూత విచ్చుకున్న సమయంలో బోరాక్స్ 2 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయడం ద్వారా పిందె కట్టడంను పెంచవచ్చు.

**చీడపీడల యాజమాన్యం:** పూతకు ముందు, పచ్చి పూత దశలో, కాయ ఎదుగుదల దశలో పలు రకాల పురుగులు, తెగుళ్ళు ఆశించి పంటకు అపార నష్టం కలిగిస్తాయి.

**పూతకు ముందు:** డిసెంబర్ రెండవ పక్షంలో చెట్ల మొదళ్ల లోని కలుపు మొక్కలు, చెత్త చెదారాలలో దాగి ఉన్న తేనె మంచు పురుగులు, పిండి పురుగులు, చెట్ల కాండం కొమ్మలపైకి ఎగబాకుతాయి కావున వీటి నివారణకు డిసెంబర్ మూడవ వారంలో ఎసిఫేట్ 1.5 గ్రా. ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. కలిపి చెట్ల మొదళ్ళు, కొమ్మలు బాగా తడిచేలా పిచికారి చేయాలి లేదా అజాడిరక్టిన్ 1500 పిపిఎం లీటరు నీటికి 3 మి.లీ. లేదా 10 వేల పిపిఎం లీటరు నీటికి 0.5 మి.లీ చొప్పున కలిపి పిచికారి చేసుకోవచ్చు.

**లేత పూత /పచ్చిపూత దశ:** పచ్చి పూత దశలో అంటే పూత కాడలు బయటకు వచ్చి పూలు వికసించకుండా ఇంకా మొగ్గ దశలో ఉన్నప్పుడు తేనె మంచు పురుగు, పూ మొగ్గలను తినే గొంగళి పురుగు, పేను బంక, బూడిద తెగులు ఆశించి నష్ట పరుస్తాయి.

తేనెమంచు పురుగులు చెట్ల మధ్య గాలి, వెలుతురు సరిగా సోకక, గాలిలో తేమ అధికంగా ఉన్నప్పుడు ఈ పురుగుల ఉధృతి అధికంగా ఉంటుంది. వీటి తల్లి, పిల్ల పురుగులు పూరెమ్మలు, మొగ్గల నుండి రసాన్ని పీలుస్తాయి. ఈ పురుగులు తీయని జిగురు పదార్థాన్ని విసర్జిస్తాయి. దీనివల్ల రెమ్మలు, ఆకులు, పూల గుత్తులపై నల్లటి బూజు ఏర్పడుతుంది. ఈ పురుగులు ఆశించిన పూల గుత్తిలోని పూలు బలహీనపడి రాలిపోతాయి.

పూతను తేనె గొంగళి పురుగులు పూల గుత్తులను గూడుగా చేసి, అందులో ఉంటూ పూలను తినేస్తాయి. ఇవి ఆశించిన చెట్లలో లార్వా పురుగులు సన్నని తీగకు వేలాడుతూ కనిపిస్తాయి.

వీటితోపాటు లేత పూత / పచ్చి పూత దశలో ఆశించే తెగుళ్లలో బూడిద తెగులు చాలా ప్రమాదకరమైనది. ఈ తెగులు పూరెమ్మల మీద, లేత రెమ్మలు, పిందెల మీద బూడిద రంగు గల తెల్లటి బూజు వ్యాప్తి చెందిస్తుంది. దీనితో పూత వడిలి మగ్గిపోతుంది .

రాత్రులు చల్లగా ఉండుట, గాల్లో తేమ అధికంగా ఉండి మంచు ఉండే పరిస్థితులు ఈ తెగులు వ్యాప్తికి అనుకూలం. చెట్లపూత ప్రారంభ దశలో ఈ చీడల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా థయోమిథాక్సామ్ 0.3 గ్రా. లేదా ఎసిఫేట్ + ఇమిడాక్లోప్రిడ్ 2 గ్రా. లీటరు నీటికి ఈ మందులలో ఏదో ఒక దానిని నీటిలో కరిగే గంధకం 3 గ్రా. మందు కలిపి పూ మొగ్గలు బాగా తడిచేటట్లు పిచికారి చేయాలి.

**తెల్ల పూత దశ/ పూర్తిగా ఎదిగిన పూత దశ:** ఈ దశలో పురుగు మందులు చల్లడం వల్ల మామిడిలో పిందె కట్టడానికి సహాయపడే కీటకాలు తేనెటీగలు చనిపోతాయి. పూలలోని పుప్పొడి మందు ద్రావణంతో కొట్టుకపోతుంది. పూలలో సంపర్కం జరగక పిందెలు ఏర్పడవు.

పిందె ఏర్పడే దశ: మామిడిలో చిన్న పిందెలు ఏర్పడే దశలో తామర పురుగులు, పిండి పురుగులు, మచ్చ తెగులు, బూడిద తెగుళ్లు ఆశించి నష్ట పరుస్తాయి. తామర పురుగుల తల్లి, పిల్ల పురుగులు పూలకాడల, పిందెలను గోకి రసాన్ని పీలుస్తాయి. దీంతో పూత ఎండి రాలిపోతుంది. ఈ పురుగులు గోకిన కాయలపై వక్క రంగులో మంగు ఏర్పడి నాణ్యత లోపించి మార్కెట్లో ధర రాదు. గాలిలో తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, పూల రెమ్మలపైన, పిందెల పైన గోధుమ రంగు లేదా నల్లటి మచ్చలు ఏర్పడతాయి. దీనివల్ల పూత, పిందె అధికంగా రాలిపోతుంది. ఈ దశలో చీడపీడలతో పాటు పిందె రాలిపోవడం సమస్య కూడా అధికంగా ఉంటుంది. నివారణకు పిందెకట్టే దశలో లీటరు నీటికి 2 మి.లీ ఫిప్రోనిల్, పూత చుట్టూ పురుగు నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. మరియు బూడిద తెగులు నివారణకు హెక్సాకోనజోల్ 2.0 మి.లీ లేదా ప్రోపికొనజోల్ 1 మి.లీ లేదా డైనోకాప్ 1 మి.లీ చొప్పున లీటరు నీటికి కలిపి పూత కాడలు తడిచేలా పిచికారీ చేయాలి.

పూత మాడు తెగులు/ఆకుమచ్చ/ఆంత్రాక్నోస్ తెగులు నివారణకు మొగ్గ బయటకు వచ్చే దశలో 3 గ్రా. ల కాపర్ ఆక్సీక్లోరైడ్ పచ్చి పూత మీద 1 గ్రా. కార్బండాజిమ్ లేదా 2.5 గ్రా. ల మాంకోజెబ్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. వీటితోపాటు మామిడి పూత పిందె దశలో ఉన్నప్పుడు చెట్లకు నీరు పెట్టడం వల్ల పూత పింద రాలుడు తగ్గుతుంది. కాయలు నాణ్యంగా పెద్ద సైజులో వస్తాయి. పిందెలు ఏర్పడిన తర్వాత వీలును బట్టి 15 రోజుల వ్యవధిలో రెండు నుండి నాలుగు సార్లు నీటి తడులు ఇవ్వవలసి ఉంటుంది.

ఈ విధమైన సమగ్ర యాజమాన్య చర్యలు మామిడిలో పూత దశలో చేపట్టినట్లయితే రైతులు మంచి దిగుబడులు సాధించవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9441632227**

**నవంబర్ 2025 మాసంలో పి.జె.టి.ఎ.యు. వారి అగ్రికల్చర్ వీడియో యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన షార్ట్స్**

| క.సం. | తేది | అంశం |
|---|---|---|
| 1 | 15.11.2025 | ఆయిల్‌పామ్ సాగు – మేలైన యాజమాన్యం |
| 2 | 26.11.2025 | రాగి బెల్లం మఫిన్లు |
| 3 | 26.11.2025 | రాగి బీట్ రూట్ ఫింగర్స్ |
| 4 | 27.11.2025 | రాగి పంచదార మఫిన్లు |



# పంట చేలను తగులబెట్టవద్దు



మెర్లె శ్రీలత
వ్యవసాయ కళాశాల, ఆదిలాబాద్

ఓ హలధారీ..

బలరామదేవుని పాలనలో బహుళ పంటల సాగుల సుహాలికుడవు కావు

మురళీధర వాసుదేవుని ఆలనలో ఆలమందల కాపుల గోపాలకుడవు కావు

వాయుదేవుని వరపుత్ర జండాపై కపిరాజు నీడన సవ్యసాచి గాండీవధారి కావు

అగ్నిదేవుని అజీర్తిని అరిగించే ఔషధుల ఖాండవవనములు నీ పంటచేలు కావు

పంటయందలి పువ్వులు కాయలు – దుంపలు ఫలములు నీకు పైసల పాలు

పంటల అవశేషాలు ఆకులు అలములు – నీ వెంబడి సాగే మూగ పసులపాలు

పాడి పంట నానుడికి – సహజ న్యాయ సూత్రాలకు ఇచ్చెను ఏనాడో తిలోదకాలు

పైరుకోతలు కోసి దిగుబడులు విపణీ చేరక ముందే మడిలోన ఎరగడిమంటలు

పత్తితీతలు చేసి దూదిబస్తాలు తూకము కాక ముందే చేనులో ఎగిసె నిప్పురవ్వలు

బువ్వనిచ్చే పంటభూమికి, కాపుకాసే మిత్ర సుజీవులకు సజీవ దహనాలు

వ్యవసాయ బలరామదేవుని పాలనలో విరబూసిన మూడు పువ్వులు

విరగపండిన ఆరు కాయలు – పప్పులు నూనెలు వైవిధ్య నవ ధాన్యాలు

వాసుదేవుని ఆలనలో ఆలమందల నడయాడే ఆస్తిగా ఎంచిన కాలములు

పాలపొంగులు, క్షీరకవ్వములు, వెన్నముద్దలు, నేతికడవల సమృద్ధి నిల్వలు

మామిడి మారేడు జమ్మి జువ్వి రావి ఉత్తరేణి జిల్లేడు నేరేడు దేవదారులు

ఘనమానుల శాఖలు, నవధాన్యరాశులు, పూసనేతులు యజ్ఞములో సమిధలు

విరామమెరుగక అగ్ని హెూత్ర యాగములు కొనసాగెను పలు పుష్కర కాలాలు

అలుపెరుగక సాగినా సరే సమయానికి సమకూరెను పుష్కలమైన వనరులు

ఏకబిగిన ఏళ్ళకేళ్ళు సాగిన యజ్ఞములందు అర్పించిన అంతులేని ఆజ్యములు

ఆరగించిన అగ్నిదేవునికి అంటుకొనె అనారోగ్య అగ్ని మాంద్యములు

ఎంతటి నలతలకైనా నయమైన ఓషధులు నవనవలాడే ఖాండవ వనములు

అంతటి మూలికలనన్నీ కొరకొర కొరుకగ అగ్ని కోరే కిరీటిని శరణులు

సవ్యసాచి సమక్షంలో సమస్త మందాకులనారగించగా ఉరికిన నిప్పుకణికలు

భస్మభోజ్య కార్యమునాపగా ఉరుముల కురిసెను వరుణుని చినుకులు

మేఘనాధునడ్డగించి ఉరవకుండా ముసిరెను విజయుని గాండీవ శరములు

మేలైన మూలికలన్నీ మలమలమాడించి శాంతించె వసువుదేవ నిప్పులు

ఓ కృషీవలా.. నిన్నెవరు అర్థించారని మంట అంటిస్తున్నవు సేంద్రియ కర్బనరాశులు

ఓ పంటకాపు.. నేల విడిచి సాము, నేలసారము కాల్చి సాగగ లేవు అతీంద్రియ శక్తులు

ఓ కర్షకా.. కండను పెంచేటి తిండిని పండించగా సారమున్న నేలలే మూల కారకాలు

ఓ సైరికా.. రేపటి తరముల మనుగడలు సాగించగా – మన నేలలే మన భవిష్యత్తులు

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 7569255871

# కానుగ (పొంగామియా పిన్నట) సాగులో మెళకువలు

డా|| ఎమ్. రమేష్, డా|| ఏ.వి. రామాంజనేయులు మరియు డా|| డి. విజయలక్ష్మి
అటవీ వ్యవసాయ విభాగం, రాజేంద్రనగర్, హైదరాబాద్



కానుగ ఫాబేసి జాతికి చెందిన చెట్టు. ఆసియా ఖండంలోని ఉష్ణ ప్రాంతాల్లో ఎక్కువగా పెరుగుతుంది. ముఖ్యంగా రోడ్ల పక్కన, ఉద్యానవనాల్లో పెంచుతారు. కానుగలో అనేక ఔషధ గుణాలు ఉన్నాయి. కానుగను వంటచెరకుగా ఉపయోగించ వచ్చు. కిలో వంటచెరకు నుండి 4,600 కిలో కాలరీల శక్తి ఉత్పత్తి అవుతుంది. దీని కలప గట్టితనాన్ని కలిగి ఉండటం వలన బండి చక్రాలు మరియు ఫర్నీచర్ తయారీకి ఉపయోగపడుతుంది. ఆకులను పచ్చిరొట్టగా వేసుకోవచ్చును. నీటి ఎద్దడి ప్రాంతాలలో దీని పచ్చికాయలను పశువుల మేతగా వాడుకోవచ్చును. గింజలలో 30-40 శాతం నూనె ఉంటుంది. దీని నూనెను వార్నిష్ తయారీల్లో ఇంధనంగా ఉపయోగించవచ్చు. దీపాలను వెలిగించడానికి ఇంజనులలో ఇంధనంగా ఉపయోగపడుతుంది. చెక్కను కోళ్ళ దాణాలో కలిపి వాడవచ్చు. నూనెను సబ్బుల తయారీలో వాడతారు.

**నేలలు:** ఇసుక, నల్లరేగడి, చౌడు, క్షార భూముల్లో కూడా పెరుగుతుంది. లోతు తక్కువ ఉన్న భూములు అనువైనవి. బంజరు భూములలో సాగు చేయటానికి అనుకూలం.

**విత్తే పద్ధతి:** విత్తనాలు లేత కాండపు ముక్కలు మరియు పిలకల ద్వారా పునరుత్పత్తి చేయవచ్చు. అంటు కట్టడం ద్వారా కూడా ప్రవర్ధనం చేయవచ్చును.

**విత్తే సమయం:** జూలై నుండి ఆగష్టు వరకు అనుకూలం.

**సాంద్రత:** 160-200 మొక్కలు అవసరం.

**గుంతలు:** 30×30×45 సెం.మీ. పరిమాణంలో త్రవ్వుకోవాలి.

**విత్త దూరం:** 5×4 లేదా 5×5 మీ. ఎడంలో నాటాలి.

**మొక్కల సాంద్రత (ఎకరాకు):** 160-200 మొక్కలు నాటుకోవచ్చు.

**ఎరువుల యాజమాన్యం:** సేంద్రియ ఎరువులు పశువుల ఎరువు/వర్మికంపోస్ట్ గుంతకు 4 కిలోల వేయాలి. నాటిన 2 సంవత్సరాల్లో 100 గ్రా. డిఎపి సరిపోతుంది.

3వ సంవత్సరం నుండి 200-250 గ్రా. డిఎపి వేస్తే చెట్టు త్వరగా పెరుగుతుంది

**కలుపు యాజమాన్యం:** ప్రారంభ దశలో మొక్క పెరిగేటప్పుడు కలుపు మొక్కలను తీసివేయాలి. సంవత్సరంలో రెండు సార్లు లోతుగా మొక్కలు మధ్య దున్నాలి.

లేత మొక్కలను అవసరాన్ని బట్టి వెదురు బొంగులతో ఊతమివ్వాలి. సంవత్సరానికి 6 టన్నుల గింజల దిగుబడి వస్తుంది. ఇలా 70 సంవత్సరాల వరకు దిగుబడినిస్తాయి.

**నూనె దిగుబడి:** గింజల్లో 26-30 శాతం నూనె ఉంటుంది. ఎకరానికి 600-700 కిలోల నూనె వస్తుంది. వర్షాధారంగా ఎకరానికి ఖర్చు రూ. 16,000, ఆదాయం రూ. 16 నుండి 20 వేలు లభిస్తుంది.

కనీస మద్దతు ధర టన్నుకు 10,000 రూపాయిలు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9959960992

# విత్తన బిల్లు ముసాయిదా 2025 - ముఖ్య అంశాలు




డా॥ యమ్. పల్లవి, డా॥ కె. లక్ష్మీప్రసన్న, డా॥ కె. కనకదుర్గ,
డా॥ బి. వరప్రసాద్ మరియు డా॥ సి.హెచ్. దామోదర్ రాజు
సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం, సీడ్ రీసెర్చ్ అండ్
టెక్నాలజీ సెంటర్, రాజేంద్రనగర్, హైదరాబాద్

విత్తన బిల్లు, 2025 అనేది 1966 విత్తన చట్టం మరియు 1983 విత్తన ఉత్తర్వులకు బదులుగా రూపొందించబడిన ఒక ముసాయిదా (డ్రాఫ్ట్) బిల్లు. ఇది రైతులు మరియు విత్తన పరిశ్రమకు ప్రయోజనం చేకూర్చే ఉద్దేశంతో తీసుకువచ్చిన ఒక ముఖ్యమైన ప్రతిపాదన. ఈ ప్రతిపాదిత బిల్లు యొక్క ముఖ్య లక్ష్యాలు: నాణ్యమైన విత్తనాల లభ్యతను నిర్ధారించడం, నకిలీ విత్తనాల అమ్మకాలను అరికట్టడం, మరియు విత్తన నియంత్రణ వ్యవస్థను ఆధునీకరించడం. ఇది విత్తన పరిశ్రమకు ఆధునిక, పారదర్శక మరియు పరిశోధన ఆధారిత వాతావరణాన్ని అందించడానికి సహాయపడుతుంది.

## విత్తన బిల్లు యొక్క ముఖ్య లక్షణాలు

1. **రైతుల కోసం ప్రత్యేక హక్కులు:** ఈ చట్టం కింద నమోదు చేయబడిన వ్యవసాయ విత్తనాలను లేదా రకాన్ని రైతులు పెంచడం, విత్తడం, తిరిగి విత్తడం, దాచిపెట్టుకోవడం, మార్పిడి చేయడం, లేదా విక్రయించే హక్కును రైతుకు కల్పించారు, కాని అతను అటువంటి విత్తనాన్ని బ్రాండ్ పేరుతో విక్రాయించరాదు.
2. **కేంద్రీకృత విత్తన ట్రేసబిలిటీ పోర్టల్:** విత్తన ఉత్పత్తి మరియు పంపిణీని గుర్తించడానికి మరియు ట్రాక్ చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక పోర్టల్‌ను ఏర్పాటు చేస్తుంది.
3. **క్యూఆర్ కోడ్ తప్పనిసరి:** విత్తనం కంటైనర్‌పై క్విక్ రెస్పాన్స్ కోడ్ (క్యూఆర్ కోడ్) లేదా సెంట్రలైజ్డ్ సీడ్ ట్రేసబిలిటీ పోర్టల్ ద్వారా రూపొందించబడిన ఇతర గుర్తులు తప్పనిసరిగా ఉండాలి. ఈ క్యూఆర్ కోడ్ ధృవీకరణ ఏజెన్సీ లేదా స్వీయ-ధృవీకరణ వివరాలను వెల్లడిస్తుంది (భారతీయ కనీస విత్తన ధృవీకరణ ప్రమాణాల కింద పేర్కొన్న క్షేత్ర మరియు విత్తన ప్రమాణాలను నిర్ధారిస్తాయి).
4. **రిజిస్ట్రేషన్:** రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్న అన్ని రకాల విత్తనాలు విసియు (వాల్యూ ఫర్ కల్టివేషన్ & యూస్) ట్రయల్స్కు లోబడి ఉండాలి. కొత్త విత్తనం మార్కెట్లోకి రావాలంటే, అది ఐసిఏఆర్, సిఏయు, ఎస్ఏయు వంటి అర్హత కలిగిన సంస్థలు నిర్వహించే విసియు ట్రయల్స్‌లో (సాగుకు మరియు ఉపయోగించడానికి ఆ విత్తనం ఎంత విలువైనదో అంచనా వేసే పరీక్షలు) ఉత్తీర్ణత సాధించాలి. ఈ ట్రయల్స్ ఎలా నిర్వహించాలనే నియమాలను ప్రభుత్వం ఎప్పటికప్పుడు తెలియజేస్తుంది.

కొత్త రకాలను సిఫార్సు చేయడానికి రిజిస్ట్రేషన్ సబ్-కమిటీలు ఏర్పాటు చేయబడతాయి. అలాగే విత్తన ఉత్పత్తిదారులు, డీలర్లు, డిస్ట్రిబ్యూటర్లు మరియు ప్లాంట్ నర్సరీల రిజిస్ట్రేషన్ కోసం రాష్ట్ర విత్తన కమిటీలు ఏర్పాటు చేయబడతాయి. నమోదు చేయని విత్తనాలను ఎవరూ అమ్మకూడదు, రైతుల కోసమే ప్రత్యేకంగా తయారు చేసిన లేదా ఎగుమతి కోసం ఉత్పత్తి చేసిన విత్తనాలకు మాత్రం మినహాయింపు ఉంటుంది.

5. **ధృవీకరణ ప్రమాణాలు:** విత్తనం యొక్క కనీస ప్రమాణాలను - అంటే అంకురోత్పత్తి, జన్యు మరియు భౌతిక స్వచ్ఛత, లక్షణాలు, మరియు విత్తన ఆరోగ్యం వంటి వాటిని - నిర్ధారిస్తారు.
6. **ప్లాంట్ నర్సరీల నియంత్రణ:** నమోదు చేసుకున్న ప్లాంట్ నర్సరీ యజమాని తప్పనిసరిగా కొన్ని రికార్డులను నిర్వహించాలి మరియు నిర్దిష్ట ప్రమాణాలను పాటించాలి. ఆ వ్యక్తి ప్రతి నాటే పదార్థం యొక్క మూలం పూర్తి రికార్డును, అలాగే విత్తనాలను సేకరించిన రకం లేదా నర్సరీలోని తల్లి మొక్క యొక్క పనితీరు రికార్డును ఉంచాలి. అదనంగా, మొలకల పెంపకానికి సంబంధించిన లే అవుట్ ప్రణాళిక

లేదా మొక్కలను పెంచడంలో ఉపయోగించే వేర్లు మరియు సియాన్స్ స్థానాన్ని చూపించే లేఅవుట్ ప్రణాళికను కూడా ఉంచాలి. అంతేకాక, మొక్కల ఉత్పత్తి లేదా వ్యాప్తికి ఉపయోగించే నర్సరీ మొక్కల మూలం లేదా విత్తనాలు లేదా మాతృ వృక్షాల అంట్లను కీటకాలు లేదా వ్యాధులు లేకుండా చూసుకోవాలి మొక్కల ఉత్పత్తి లేదా వ్యాప్తికి ఉపయోగించే నర్సరీ మొక్కల మూలం లేదా విత్తనాలు లేదా మాతృ వృక్షాల అంట్లను కీటకాలు లేదా వ్యాధులు లేకుండా చూసుకోవాలి.

7. **కేంద్ర అక్రిడిటేషన్ వ్యవస్థ:** విత్తన రంగంలో పరిశోధన మరియు అభివృద్ధిని ప్రోత్సహించడానికి మెరిట్-ఆధారిత మరియు పారదర్శక కేంద్ర అక్రిడిటేషన్ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయవచ్చు. అటువంటి వ్యవస్థ కింద గుర్తింపు పొందిన కంపెనీలు అక్రిడిటేషన్ మంజూరు చేసిన తేదీ నుండి ఈ విభాగం కింద నమోదు చేయబడినట్లు పరిగణించబడతాయి.
8. **ప్రతిపాదిత జరిమానాలు:** నేరాలను మూడు వర్గాలుగా విభజించి, ప్రతిపాదిత జరిమానాలను కింద ఇవ్వబడింది:

| నేరాల వర్గం | ఉదాహరణలు | మొదటి నేరానికి జరిమానా | తదుపరి నేరానికి జరిమానా |
|---|---|---|---|
| చిన్న చిన్న నేరాలు | రికార్డులు నిర్వహించకపోవడం, క్యూఆర్ కోడ్‌ను అతికించకపోవడం, గడువు ముగిసిన రిజిస్ట్రేషన్ పై వ్యాపారం చేయడం (12 నెలల్లోపు), సాగుకు సిఫార్సు చేయని ప్రాంతములో రైతులకు రిజిస్టర్డ్ రకాల విత్తనాలను విక్రయించడం. | దిద్దుబాటు కోసం రిట్టెన్ నోటీసు | 3 ఏళ్లలోపు ప్రతి తదుపరి నేరానికి రూ. 50,000 |
| చిన్న నేరాలు | విత్తనాన్ని తప్పుగా బ్రాండ్ చేయడం, నాసిరకం విత్తనాలను అమ్మడం, నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధరకు అమ్మడం, ప్రభుత్వ పోర్టల్ (Govt. Sathi) లో వివరాలను లోడ్ చేయడంలో విఫలం. | రూ. 1 లక్ష | 3 ఏళ్లలోపు ఇలాంటి నేరానికి రూ. 2 లక్షలు |
| పెద్ద నేరాలు | నకిలీ విత్తనాలను సరఫరా చేయడం, నమోదు కాని రకాన్ని అమ్మడం, నమోదు చేసుకోకుండా వ్యాపారం చేయడం. | రూ. 10 లక్షలు | 5 ఏళ్లలోపు ఇలాంటి నేరానికి రూ. 20 లక్షలు<br><br>ఒక వ్యక్తికి ఒక తప్పుకు సంబంధించి జరిమానా విధించిన తర్వాత, అతను ఐదేళ్ల లోపు మళ్లీ అదే తప్పు చేస్తే, ముప్పై లక్షల రూపాయల జరిమానా మరియు డీలర్ రిజిస్ట్రేషన్ రద్దు లేదా, మూడు సంవత్సరాల వరకు పొడిగించదగిన జైలు శిక్ష లేదా, ఈ రెండూ విధించబడతాయి. |

రైతులు ముసాయిదా బిల్లు మరియు దాని నిబంధనలపై తమ సూచనలను jsseeds-agri@gov.in కు ఈమెయిల్ ద్వారా వీలైనంత త్వరగా ఎమ్ఎస్ వర్డ్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో కానీ 11.12.2025 నాటికి తెలియజేయవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 7893262992**








# 'అందాల ఆస్టర్స్'

డా॥ గద్దె జ్యోతి, డా॥ సల్మా, డా॥ ప్రణీత్ కుమార్
మరియు డా॥ విజయలక్ష్మి
పూల పరిశోధన స్థానం, శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన
విశ్వవిద్యాలయం, తెలంగాణ








చైనా ఆస్టర్స్ (కాలిస్టెఫస్ చైనెన్సిస్) ఆస్టరేసి కుటుంబానికి చెందినది. వివిధ రంగులలో కనిపించే ఏకవార్షిక పంట. దీనిని కుండీ మొక్కగా, కట్ ఫ్లవర్స్ బొకే తయారీలో ఉపయోగించుకోవచ్చు. పింక్ మరియు గులాబి రంగు పువ్వులకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది.

**వాతావరణం:** ఈ పూల సాగుకు సెప్టెంబర్-అక్టోబర్ నెలలో నాటుట అనుకూలం. పగటి ఉష్ణోగ్రతలు 20-30 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు 15-17 డిగ్రీల సెల్సియస్ అనుకూలం. ఆస్టర్స్‌లో నాణ్యమైన పూల ఉత్పత్తులకు అధిక సూర్యరశ్మి అవసరం.

**నేలలు:** లోతైన ఎర్రగరప నేలలు మరియు ఉదజని సూచిక 6-7 మధ్య నేలలు అనుకూలం. బరువైన నేలల్లో సాగు చేస్తే వేరుకుళ్ళు వచ్చే అవకాశం ఉంటుంది కాబట్టి మురుగు నీరు వ్యవస్థ కలిగి ఉండాలి.

**రకాలు:** లోకల్ వైట్, అర్కపూర్ణిమ, అర్క శశాంక్, అర్క అర్చన, లోకల్ పింక్, అర్క కామిని, అర్క ఆధ్య, ఫూలే గణేష్ పింక్, ఫూలే గణేష్ పర్పుల్ అనుకూలం.

**ప్రవర్ధనం:** చైనా ఆస్టర్స్ విత్తనం ద్వారా ప్రవర్ధనం చేసుకోవాలి. ఒక ఎకరాకు 500-800 గ్రా. విత్తనం అవసరమవుతుంది. నారుమడులలో నారు 3-4 ఆకులు వచ్చిన 35 నుండి 45 రోజుల వయస్సు గల నారును 30×30 సెం.మీ. దూరంలో నాటుకోవాలి. నారుకుళ్ళు తెగుళ్ళు నివారణకు విత్తిన రెండు వారాల తర్వాత 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ ఒక లీటరు నీటికి కలిపి నారుమళ్ళను తడపాలి.

**ఎరువులు:** బాగా చివికిన పశువుల ఎరువుతోపాటు ఎకరాకు 36 కిలోల నత్రజని, 48 కిలోల భాస్వరం మరియు 24 కిలోల పొటాషియంనిచ్చే ఎరువులు వేయాలి. మొక్కలు నాటిన 40 రోజులకు 36 కిలోల నత్రజని వేసుకోవాలి. సూక్ష్మధాతువుల లోపాన్ని నివారించడానికి సూక్ష్మధాతువు మిశ్రమం 4 గ్రా. లీటరు నీటికి కలిపి రెండుసార్లు 15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**నీటి యాజమాన్యం:** వాతావరణం మరియు నేలల పరిస్థితులను బట్టి నీటి తడులివ్వాలి. మొక్కలు నీటి ఎద్దడికి గురి కాకుండా డ్రిప్ ద్వారా నీరు అందించి అధిక దిగుబడులు తీసుకోవచ్చును.

**పించింగ్ (తల త్రుంచడం):** మొక్కలు నాటిన 30 రోజులకు తలలు తుంచితే ఎక్కువ ప్రక్క కొమ్మలు వచ్చి అధిక దిగుబడి వస్తుంది.

**పూత కోత:** నాటిన 70 నుండి 80 రోజులకు (రకాన్ని బట్టి) పూలు వస్తాయి. పూలను పొడుగాటి కాడలతో కోత కోసినట్లైతే "కట్ ఫ్లవర్" గా ఉపయోగించవచ్చు. విడిపూలను జాగ్రత్తగా గోనె సంచులలో ప్యాకింగ్ చేసి జాగ్రత్తగా మార్కెట్‌కు రవాణా చేయాలి.

**దిగుబడి:** ఎకరాకు 4-5 టన్నుల వరకు దిగుబడి వస్తుంది.

**సస్యరక్షణ:**

**ఆకు తొలిచే పురుగు:** లార్వా పురుగులు ఆకుల కణజాలాన్ని తింటాయి. ఆకుల మీద వెండిలా మెరిసే తెల్లని మచ్చలు ఏర్పడుతాయి. నివారణకు ఇమిడాక్లోప్రిడ్ లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**మొగ్గ తొలిచే పురుగులు:** లార్వాలు పూ మొగ్గలను ఆశించి, పూరేకులను కూడా తింటాయి. దీని నివారణకు వేపనూనె 3 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు:**

**వేరుకుళ్ళు తెగులు:** దీని వలన ఆకులు ఎండుబారి కాండం మరియు వేర్లు నల్లబడుతాయి. మొక్కలు అకస్మాత్తుగా చనిపోతాయి. నివారణకు మ్యాంకోజెబ్ 2 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి మొక్కల కాండం దగ్గర పాదుల్లో పోయాలి.

**ఎండుతెగులు:** తేమతో కూడిన వెచ్చని వాతావరణం, ఎక్కువ మోతాదులో నత్రజని ఎరువుల వాడకం వలన ఈ తెగులు వస్తుంది. భూమి సమీపంలో కాండం కుళ్ళిపోతుంది. నివారణకు 1 గ్రా. కార్బండాజిమ్ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 7993613179



# డిసెంబర్ మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు


డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
**వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట**


**మామిడి:** ఈ నెలలో భూమిలో నిద్రావస్థలో ఉన్న పిండి పురుగులు బయటపడి చెట్లపైకి పాకి చెట్లను ఆశిస్తాయి. ఇవి ఆశించిన కొమ్మలపై లీటరు నీటికి 0.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్‌ను కలిపి పిచికారి చేయాలి. మామిడిని ఆశించే తేనెమంచు పురుగు, పొలుసు పురుగులు, బూడిద తెగులు నివారణకు 3 గ్రా. కార్బరిల్‌కు 2 మి.లీ. హెక్సాకొనజోల్ మరియు 2.5 మి.లీ. వేపనూనెను లీటరు నీటికి చొప్పున కలిపి ఆకులు, కొమ్మలు, కాండం మొదలు తడిచేలా పిచికారి చేయాలి.

**జామ:** పిండినల్లి చిన్న, పెద్ద పురుగులు కొమ్మల చివర, కాయలను ఆశించి రసాన్ని పీలుస్తాయి. కాయలు, ఆకులు రాలిపోతాయి. ఇవి జిగురు పదార్థాన్ని విసర్జించడం వల్ల మసి తెగులు ఆశిస్తుంది. నివారణకు అక్షింతల పురుగు బదనికలను తోటలో విడుదల చేయాలి. ఎసిఫేట్ 1.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉన్న తోటల్లో చెట్టుకు 250 గ్రా. క్లోరిపైరిఫాస్ పొడిమందును పాదుల్లో చల్లి మట్టిలో కలిసేటట్లు చేయాలి.

**అరటి:** ఈ మాసం నుండి చలి పెరగటం వల్ల జింక్ ధాతు లోపం కనిపిస్తుంది. ఆకుల ఈనెల వెంబడి తెల్లని చారలు ప్రారంభమై ఆకులు పాలిపోయినట్లు కనబడతాయి. ఆకుల అడుగుభాగాన ముదురు ఊదా రంగు ఏర్పడుతుంది. దీని నివారణకు ఒక్కో మొక్కకు 10 గ్రా. జింక్ సల్ఫేట్ భూమిలో వేయాలి. ఆకులపై 2 గ్రా. జింక్ సల్ఫేట్ లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**బత్తాయి, నిమ్మ:** అంబేబహర్ (జనవరి పూత) చెట్లు పూతకు రావడానికి నీటిని ఇవ్వడం ఆపి బెట్టకు సరి చేయాలి. నల్లి పురుగుల నివారణకు 3 గ్రా. గంధకంను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. 15 రోజుల తరువాత రెండోదఫా పిచికారి చేయాలి.

**ద్రాక్ష:** బూడిద తెగులు నివారణకు కొమ్మలు కత్తిరించిన 65వ రోజు హెక్సాకొనజోల్ 1 మి.లీ. 70 రోజులప్పుడు ఇప్రోవాలికార్బ్+ప్రొపినెబ్ 3 గ్రా., 75వ రోజు మైక్రోబుటానిల్ 0.4 గ్రా. లను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి.

**సపోట:** ఆకుమచ్చ తెగులు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**ఆపిల్, రేగు:** ఈ మాసంలో బూడిద తెగులు ఆశిస్తుంది. లేత ఆకులపైన, కాయలపైన తెల్లటి మచ్చలు ఏర్పడి తర్వాత అంతా వ్యాపిస్తుంది. డైనోకాప్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి ఉధృతిని బట్టి 2-3 సార్లు 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి.

**కూరగాయలు:**

**టమాట:**

ఆకు ఎండుతెగులు వల్ల గోధుమ రంగు మచ్చలు మొక్కలోని అన్ని భాగాలకు వ్యాపించి నష్టపరుస్తాయి. పూత, పిందెను కూడా ఈ తెగులు ఆశిస్తుంది. కార్బండాజిమ్ + మ్యాంకోజెబ్ మిశ్రమాన్ని 2.5 గ్రా. లీటరు





నీటికి చొప్పున కలిపి పైరుపై పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు టెబ్యుకొనజోల్ 1.5 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**మిరప:**

రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గే కొద్దీ కొమ్మ కుళ్ళు, కాయ ఎండుతెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు 1 మి.లీ. టెబ్యుకొనజోల్ లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు 1 మి.లీ. అజాక్సీస్ట్రోబిన్ లేదా పైరాక్లోస్ట్రోబిన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. బూడిద తెగులు కూడా ఈ మాసంలో వ్యాపిస్తుంది. నివారణకు గంధకంను 3 గ్రా. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**బెండ:**

తెల్లదోమ నివారణకు 1.5 గ్రా. ఎసిఫేట్‌ను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. కాయ తొలుచు పురుగుల నివారణకు కార్బరిల్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**వంగ:**

ఆకుమాడు తెగులు నివారణకు మ్యాంకోజెబ్ 2.5 గ్రా. లేదా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**తీగజాతి కూరగాయలు:**

బూడిద తెగులు నివారణకు మైక్రోబ్యుటానిల్ 0.5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి. తీగజాతి పంటలపై గంధకం సంబంధిత తెగులు మందును వాడరాదు. దీని వలన ఆకులు మాడిపోతాయి.

పుచ్చను డిసెంబర్
రెండవ పక్షం నుండి నాటుకోవచ్చు. 2-2.5 మీ. ఎడంతో, 60 సెం.మీ. వెడల్పు గల నీటి కాలువలను తయారుచేసుకొని, కాలువలకు ఇరువైపులా 30-50 సెం.మీ. ఎడంతో విత్తనాలు విత్తుకోవాలి. 500-600 గ్రా. విత్తనం ఎకరాకు సరిపోతుంది.

**ఫ్రెంచి చిక్కుడు:**

ఈ పంట సాగుకు చల్లని వాతావరణం అనుకూలం. ఈ మాసం చివరి వరకు నాటుకోవచ్చు. 20-25 కిలోల విత్తనం ఎకరాకు సరిపోతుంది. పాలకూరను కూడా ఈ మాసం చివరి వరకు నాటుకోవచ్చు.

**అల్లం:**

ఈ మాసంలో అల్లం దుంపలు పక్వానికి వస్తాయి. తవ్వుకోవచ్చు. ఆకులు పసుపు పచ్చగా మారి ఎండిపోవడం, కాండం ఎండిపోవడంను బట్టి అల్లం దుంపలు పక్వానికి వచ్చినట్లుగా గుర్తించవచ్చు.

**పసుపు:**

మచ్చాకు తెగులు నివారణకు లీటరు నీటికి 1 మి.లీ. ప్రొపికొనజోల్, జిగురు కలిపి ఆకులపై పిచికారి చేయాలి. వారం రోజుల తరువాత 1 గ్రా. పైరాక్లోస్ట్రోబిన్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి. దుంప ఈగ వల్ల దుంపల్లో బియ్యపు గింజల మాదిరిగా తెల్లటి పురుగులు ఏర్పడతాయి. నివారణకు తోటలో నీరు పెట్టిన తరువాత కార్బోఫ్యూరాన్ 3 సిజి గుళికలను ఎకరాకు 5 కిలోల చొప్పున ఇసుకతో కలిపి సాళ్ళలో వేయాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.9441168156**



# జీనోమ్ సేవియర్ అవార్డు: భారత వ్యవసాయ జీవవైవిధ్యం సంరక్షణకు గౌరవం

డా॥ కె. రాజేంద్ర ప్రసాద్, డా॥ పి. సుజాత, డా॥ జి. రంజిత్ కుమార్, ఎల్. శ్రీలత, డా॥ ఐ. తిరుపతి, డా॥ జి. వేణుగోపాల్, డా॥ టి. యెల్లాగౌడ్, డా॥ వి. రత్నాకర్, డా॥ ఎస్. రమేష్, డా॥ పి. అరుణ్ కుమార్ మరియు డా॥ భారతి నారాయణ్ భట్

వ్యవసాయ కళాశాల, జగిత్యాల




భారతదేశం పౌరుల జీవనోపాధిగా వ్యవసాయం ఉంది. ఈ వ్యవసాయ సంక్షేమంలో, పంటల జన్యుశాస్త్రం, స్థానిక పంట రకాల పరిరక్షణ అత్యంత కీలకం. పంటల జీవవైవిధ్యం రక్షణకు కీలకంగా పనిచేస్తున్న వారు రైతులు మరియు వారి కమ్యూనిటీలే. ఈ కృషిని ప్రోత్సహించి, గుర్తించి చేయబడే ఒక ముఖ్య అవార్డే జీనోమ్ సేవియర్ అవార్డు. ఈ అవార్డు భారత ప్రభుత్వ సంస్థ అయిన ప్రొటెక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ & ఫార్మర్స్ రైట్స్ ఆథారిటీ (పిపివి & ఎఫ్ఆర్ఎ) ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఇవ్వబడుతుంది.

### జీనోమ్ సేవియర్ అవార్డు అంటే ఏమిటి?

జీనోమ్ సేవియర్ అవార్డు అనేది జీవవైవిధ్యాన్ని, పంటల స్థానిక రకాలను, సంప్రదాయ విత్తనాలను సేకరించిన రైతులు, గ్రామీణ సంఘాలు, సామాజిక సంస్థలను గుర్తించి ఇచ్చే అవార్డుగా వ్యవహరించబడుతుంది. ఇది సంప్రదాయ విత్తనాలను సంరక్షించిన, రక్షించిన మరియు నిలుపుకున్న వారికి మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుంది.

### ఈ అవార్డు ముఖ్య లక్ష్యాలు

- స్థానిక విత్తనాలను, సంప్రదాయ పంట రకాలను సంరక్షించడం.
- రైతు సమూహాలకూ, అనే కమ్యూనిటీలకూ ప్రోత్సాహం కల్పించడం.
- వ్యవసాయ జీవవైవిధ్యం పై ప్రజల అవగాహన పెంచడం.
- రైతుల సంప్రదాయ భావాలను, పంట సంరక్షణ జ్ఞానాన్ని అభివృద్ధి చేయడం.

### అవార్డు వర్గాలు

#### 1. జీనోమ్ సేవియర్ కమ్యూనిటీ అవార్డు:

- రైతు సంఘాలు, కమ్యూనిటీలకు ఈ వర్గంలో అవార్డు ప్రధానం అవుతుంది.
- ప్రతి సంవత్సరం గరిష్ఠంగా 5 సంఘాలు ఈ అవార్డుకు ఎంపిక అవుతాయి.

- ఒక్కో సంఘానికి రూ. 10 లక్షల నగదు, మెమెంటో, సర్టిఫికేట్‌లు ఇస్తారు.

**2. జీనోమ్ సేవియర్ ఫార్మర్ రివార్డు:**

- వ్యక్తిగత రైతుల కోసమే, ఈ అవార్డు ఇవ్వబడుతుంది.
- గరిష్ఠంగా 10 మంది రైతులకు ఇవ్వబడుతుంది.
- ఒక్కోరికి రూ. 1.5 లక్షల నగదు, మెమెంటో, సర్టిఫికేట్ ఇవ్వబడతాయి.

**3. జీనోమ్ సేవియర్ ఫార్మర్ రెకగ్నిషన్:**

- గరిష్ఠంగా 20 మంది రైతులకు ఇవ్వబడుతుంది.
- ఒక్కరికి రూ. 1 లక్ష నగదు, మెమెంటో, సర్టిఫికేట్ అందుతాయి.

### అవార్డుకు కావలసిన అర్హతలు

- రైతు సమూహాలు/కమ్యూనిటీలు/వ్యక్తిగత రైతులు తమ ప్రాంతీయ, సంప్రదాయ విత్తనాలను సంరక్షించి చేసిన అభివృద్ధిని సంబంధిత సాక్ష్యాలతో సమర్పించాలి.
- విత్తనాల పరిరక్షణలో వారి పాత్రను నిరూపించేందుకు ఆధారాలు, బయోడైవర్సిటీ డాక్యుమెంటేషన్ అందించాలి.
- స్థానిక అధికారుల సూచన / సిఫార్సు లేఖ జత చేయాలి.

### దరఖాస్తు ప్రక్రియ

- అభ్యర్థులు సంబంధిత ఫారాలు, సాక్ష్యాలు, అనుమతులతో పాటు దరఖాస్తులను పిపివి & ఎఫ్ఆర్ఎ అధికారికి సమర్పించాలి.
- దరఖాస్తుల సమీక్ష తర్వాత, ఎంపిక ప్రక్రియ జరిపి, విజేతలను ప్రకటిస్తారు.

### ప్రాముఖ్యత

- ఇది భారతీయ రైతులకు ప్రతిష్ఠాత్మక గుర్తింపు.
- సంప్రదాయ పంట రకాల భద్రతకు, జెనెటిక్ డైవర్సిటీ పరిరక్షణకు మూల స్థంభం.
- జీనోమ్ సేవియర్ అవార్డు ద్వారా రైతులకు ఆర్థిక మద్దతు మరియు గౌరవం లభిస్తుంది.
- గ్రామీణ జీవవైవిధ్యాన్ని, పర్యావరణ పరిరక్షణలో కీలకపాత్రను పోషిస్తుంది.

జీనోమ్ సేవియర్ అవార్డు భారత వ్యవసాయంలో సంప్రదాయ రైతుల కృషి, పంటల రక్షణ, జీవవైవిధ్యానికి మించిన విలువను అందించే అత్యుత్తమ గుర్తింపు అవార్డుగా నిలిచింది. ఇది రైతులకు ప్రతిష్ఠనిచ్చి, వారి సామాజిక, ఆర్థిక అభివృద్ధికి అనేక అవకాశాలను తెరవడం వల్ల దేశ వ్యవసాయానికి గొప్ప సేవ చేస్తోంది.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. **9010192629**

**డిసెంబర్ 2025లో పి.జె.టి.ఎ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:20 నుండి 1:50 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 03.12.2025 | యాసంగి మొక్కజొన్న సాగు |
| | ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పైన అవగాహన |
| 10.12.2025 | ప్రత్తి పంట తరువాత నువ్వుల పంట సాగు |
| | ధ్యానంతో (మెడిటేషన్) లాభాలు |
| 17.12.2025 | కోతుల బెడద నుండి రైతు పంటలను ఏ విధంగా రక్షించుకోవాలి |
| | జాతీయ రైతు దినోత్సవం ప్రాముఖ్యత |
| 24.12.2025 | హైడ్రోఫోనిక్స్ విధానంతో సాగు |
| | మాదక ద్రవ్యాల నుంచి యువతని రక్షించడం ఎలా? |
| 31.12.2025 | బ్లాక్ సోల్జర్ ఈగ - ఉపయోగం |
| | సైబర్ మోసాలు నుంచి జాగ్రత్తలు |

# “జాతీయ పశుసంపద మిషన్ - గ్రామీణ అభివృద్ధికి కొత్త దిశ”

డా॥ సురుకుంట కిరణ్ రెడ్డి, డా॥ జి. మంజులత, డా॥ జి. అనిత, డా॥ కె. సుధాన్షు సుధాకర్, డా॥ డి. కుమార స్వామి మరియు డా॥ వై. ప్రవీణ్ కుమార్

వ్యవసాయ కళాశాల, ఆదిలాబాద్





మన భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునాది వ్యవసాయం అయితే, దానికి బలమైన రెక్కలు పశుసంపద. పాలు, మాంసం, గుడ్లు, గోమయం, ఫోడర్ వినియోగం, గ్రామీణ ఉపాధి, మహిళల జీవనోపాధి – ఈ అన్నింటిలో పశుసంపద కీలక పాత్ర పోషిస్తుంది. మన రైతు కుటుంబాల్లో పశువులు కేవలం ఆదాయం ఇచ్చే వనరులు మాత్రమే కాదు అవి కుటుంబ భద్రత, సాంప్రదాయ వ్యవసాయ పద్ధతులకు ఆధారం, కష్టసమయంలో ఆధారమయ్యే ఆస్తి కూడా. అందుకే పశువులను సంరక్షించడం అంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థను రక్షించడంతో సమానం. పశుసంపద సంరక్షణ అంటే మన భవిష్యత్ ఆహార భద్రతను, గ్రామీణ స్థిరాభివృద్ధిని, రైతుల ఆర్థిక లాభదాయకతను కాపాడటం. ఈ లక్ష్యాన్నే సాకారం చేసేందుకు జాతీయ పశుసంపద మిషన్ కీలక సాధనంగా మారుతోంది. దేశవ్యాప్తంగా పశుపోషణను శాస్త్రీయంగా, సాంకేతికంగా ముందుకు తీసుకెళ్లి, రైతు కుటుంబాలకు స్థిరమైన ఆదాయం తెచ్చే మార్గాలను ఇది విస్తృతంగా అందిస్తోంది.

### జాతీయ పశుసంపద మిషన్ యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?

- గుర్తింపు పొందిన పశు జాతుల సంరక్షణ
- పశుమేత మరియు పశు దాణా ఉత్పత్తిని ప్రోత్సహించడం
- గొర్రెలు, మేకల రంగాన్ని సంఘటితం చేయడం
- సుస్థిరమైన, లాభదాయకమైన జీరో గ్రేజింగ్ గొర్రెలు, మేకల పెంపకాన్ని ప్రోత్సహించడం
- శాస్త్రీయ యాజమాన్య పద్ధతులను ప్రోత్సహించడం
- నూతన / సాంప్రదాయేతర వర్గాలను వ్యాపార వేత్తలుగా మార్చడం

జాతీయ పశుసంపద మిషన్‌లో చాలా రకాల స్కీమ్‌లు ఉన్నాయి. వాటిలో మన ఇరు తెలుగు రాష్ట్రాలలో ఎక్కువగా రైతులు ఆసక్తి చూపించేది గొర్రెలు మరియు మేకల పెంపకం పైన. ఈ గొర్రెలు మరియు మేకల పెంపకంలో 20 లక్షల నుండి కోటి రూపాయల వరకు స్కీమ్‌లు ఉన్నాయి. వాటికి సంబంధించిన సబ్సిడీ వివరాలు కింద పొందుపరచబడినవి.

**ఈ మిషన్‌కి సంబంధించిన వివరాలు:**

| యూనిట్ సైజ్ | స్కీమ్ కి అయ్యే మొత్తం ఖర్చు | సబ్సిడీ |
|---|---|---|
| 100 ఆడవి + 5 మగవి | 20 లక్షలు | 10 లక్షలు |
| 200 ఆడవి + 10 మగవి | 40 లక్షలు | 20 లక్షలు |
| 300 ఆడవి + 15 మగవి | 60 లక్షలు | 30 లక్షలు |
| 400 ఆడవి + 20 మగవి | 80 లక్షలు | 40 లక్షలు |
| 500 ఆడవి + 25 మగవి | కోటి రూపాయలు | 50 లక్షలు |

పైన వివరించిన సబ్సిడీ అనేది రెండు విడతలలో రావడం జరుగుతుంది. మొదటి విడతలో 50% సబ్సిడీ, మొదటి సంవత్సరం చివరిలో వస్తుంది, రెండవ విడతలో మిగిలిన 50% సబ్సిడీ 3వ సంవత్సరంలో విడుదల అవుతుంది. అప్పటి వరకు పైన చెప్పిన నిష్పత్తిలో జీవాల సంఖ్యను కొనసాగించాలి.

### ఈ మిషన్‌కి దరఖాస్తు చేసుకోవడానికి ఎవరు అర్హులు?

- భారత దేశ పౌరులై, 65 సంవత్సరాల లోపు వయసు ఉండాలి.
- సమూహంగా అయితే రైతు ఉత్పత్తి సంస్థలు, స్వయం సహకార సంఘాలు, రైతు సహకార సంస్థలు గాని అయి ఉండాలి.

- వారికి స్వంత లేదా లీజుకి తీసుకున్న భూమి ఉండాలి.
- జీవాల పెంపకంలో తగిన అనుభవం లేదా ఏదైనా శిక్షణ తీసుకొని ఉండాలి.
- ఒక కుటుంబం నుండి అర్హత కలిగిన ఎంత మంది అయినా దరఖాస్తు చేస్కోవచ్చు.

**కోటి రూపాయల పథకంలో అయ్యే ఖర్చు వివరణ/ సబ్సిడీ వర్తించే అంశాలు:**

| | | సంఖ్య/ పరిమాణం | ఒకదానికి అయ్యే ఖర్చు | మొత్తానికి అయ్యే ఖర్చు |
|---|---|---|---|---|
| జీవాల కొనుగోలు | ఆడవి | 500 | 8000 | 40 లక్షలు |
| | మగవి | 25 | 13000 | 3.25 లక్షలు |
| జీవాల షెడ్ | పెద్ద జీవాల షెడ్ | 5500 చ.అ. | 400 | 22 లక్షలు |
| | చిన్న జీవాల/ అనారోగ్య జీవాల షెడ్ | 3500 చ.అ. | 200 | 7 లక్షలు |
| జీవాల రవాణ | | 525 | 100 | 52,500 |
| పశుగ్రాస సాగు | | 5 ఎకరాలకి | 100000 | 5 లక్షలు |
| గడ్డి కత్తిరించే యంత్రం | | 2 | 25000 | 50,000 |
| సైలేజీ తయారీ యంత్రం | | 1 | 500000 | 5 లక్షలు |
| జీవాల భీమ | | అన్ని జీవాలకు | 7.5 % | 3.25 లక్షలు |
| పరికరముల కొనుగోలు | | | | 52,500 |
| ఇతర ఖర్చులు | | | 25000 | 25,000 |
| మొత్తం ఖర్చు | | | | 87,300 |

పైన వివరించిన ఖర్చులు అనేవి మన దేశంలో ఉన్న వివిధ రాష్ట్రాలలో వేరు వేరుగా ఉంటాయి. దీనికి కారణం ఆయా రాష్ట్రాలలో ఉండే పశు జాతుల ధరలలో తేడా ఉండడం, మరియు షెడ్డు నిర్మించడంలో అయ్యే ఖర్చులు తేడాగా ఉండడం. మొత్తం ప్రాజెక్టుకి అయిన ఖర్చులో సగం అంటే 50 శాతం, 50 లక్షలకి మించకుండా సబ్సిడీ కింద వస్తుంది.

**ఈ పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి ?**

- నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ కి ఆన్లైన్ పోర్టల్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ పోర్టల్: www.nlm.udyamimitra.in

**ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పుడు అప్లోడ్ చేయవలసిన పత్రాలు:**

- సమగ్రమైన ప్రాజెక్టు రిపోర్ట్
- భూమి పత్రాలు లేదా లీజు ఒప్పంద పత్రాలు
- స్థలం ఫోటో
- పాన్ కార్డ్
- ఆధార్ కార్డ్
- దరఖాస్తు దారుని ఫోటో
- బ్యాంక్ చెక్
- గొర్రెలు, మేకల పెంపకంలో అనుభవం ఉన్నట్టు సర్టిఫికేట్ లేదా ఏదైనా శిక్షణ పొందినట్టు సర్టిఫికేట్
- లోన్ ఇవ్వడానికి బ్యాంక్ నుండి అంగీకార పత్రం
- గత ఆరు నెలల బ్యాంక్ స్టేట్‌మెంట్

**ముగింపు:**

ఈ కాలంలో యువత నగరాలలో కాకుండా గ్రామాలలో తమ జీవితాన్ని గడపడానికి ఇష్ట పడుతున్నారు. ఇది ఒక శుభ సంకేతం. దానికి తగినట్టుగానే వారు గ్రామాలలో ఉండి సంపాదించేలా వివిధ మార్గాలను వెతుకుతున్నారు. ఈ నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ అనేది యువతకి ఒక వరం లాంటిది. గతంలో చూసుకున్నట్టయితే 10-20 సంవత్సరాల ముందు ఉండే సబ్సిడీలు ఇప్పుడు లేవు. అలాగే ఈ సబ్సిడీ కూడా ఎన్ని సంవత్సరాలు ఉంటుందో చెప్పలేము కాబట్టి ఆసక్తి గల యువత ఈ మిషన్ కోసం అప్లై చేస్కొని ప్రభుత్వం కల్పించిన ఈ సబ్సిడీ అవకాశాన్ని సద్వినియోగం చేస్కోవాల్సిందిగా సూచన.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన**
**ఫోన్ నెం.8309504636**

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డి.డి.- యాదగిరి (రైతు నేస్తం) : సాయంత్రం 6.00-7.00 | | | |
| 1 | 01.12.2025 | కంది మరియు పెసర విత్తనోత్పత్తిలో పాటించవలసిన మెళకువలు | **డా॥ పి. గోన్యా నాయక్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9701592326 |
| 2 | 08.12.2025 | యాసంగి వరి విత్తనోత్పత్తిలో మెళకువలు | **డా॥ బి. సతీష్ చంద్ర,** సీనియర్ శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్)&హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, కూనారం, ఫోన్ నెం. 8333818202 |
| II. టి-శాట్ (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1 | 01.12.2025 | వరి రకాలు మరియు యాజమాన్య పద్ధతులు | **డా॥ రమ్య రాథోడ్,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ఆర్.ఎస్.& ఆర్.ఆర్.ఎస్., రుద్రూర్, ఫోన్ నెం. 8179525139 |
| 2 | 08.12.2025 | యాసంగి పంటల్లో చేపట్టవలసిన సమగ్ర సస్యరక్షణ చర్యలు | **డా॥ ఎస్. ఓం ప్రకాష్,** శాస్త్రవేత్త (ఎంటమాలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, వరంగల్, ఫోన్ నెం. 9866373563 |
| 3 | 15.12.2025 | మారుతున్న వాతావరణ పరిస్థితులు - వివిధ పంటల అవశేషాల యాజమాన్యం | **డా॥ టి. చైతన్య,** శాస్త్రవేత్త (ఎస్.ఎస్.ఎ.సి.) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం. 9032677235 |
| 4 | 22.12.2025 | యాసంగి నూనె గింజల పంటల్లో ఎరువులు మరియు నీటి యాజమాన్యం | **డా॥ ఐ. తిరుపతి,** అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రానమి, జగిత్యాల, ఫోన్ నెం.: 9494030004 |
| 5 | 29.12.2025 | రబీ పంటల్లో కలుపు యాజమాన్యం | **డా॥ ఆర్. శ్రీనివాస రావు,** అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రానమి, వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట ఫోన్ నెం.: 7893034800, 9989623813 |
| III. టి-శాట్ - (శనివారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1 | 06.12.2025 | యాసంగి వరి రకాలు - సాగు సూచనలు | **డా॥ బి. లక్ష్మీ ప్రసన్న,** శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) వరి పరిశోధన విభాగం, రాజేంద్రనగర్, ఫోన్ నెం.: 9573316477 |
| 2 | 20.12.2025 | యాసంగిలో సాగు చేసే చిరుధాన్యాల పంటల్లో తీసుకోవాల్సిన పోషక మరియు నీటి యాజమాన్య చర్యలు | **డా॥ కె. శేఖర్,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (అగ్రానమి) డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రానమి, వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్ ఫోన్ నెం.: 9032128124 |
| 3 | 27.12.2025 | డిజిటల్ వ్యవసాయం - ఉపయోగాలు | **డా॥ బి. బాలాజీ నాయక్,** డైరక్టర్ సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ & టెక్నాలజీ, రాజేంద్రనగర్ ఫోన్ నెం.: 9912010021, 832970277 |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునీత దేవి మరియు డా॥ సి. పద్మవేణి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. చలి ప్రభావం వలన వరి నారుమడులలో సాధారణంగా ఏ ధాతువు లోపాన్ని గమనించవచ్చును?**

ఎ) ఇనుము బి) నత్రజని
సి) జింక్ డి) పొటాషియం

**2. వరి సంకర విత్తనోత్పత్తి పాటించవలసిన పంక్తుల (ఎ ఆర్ వరుసలు) నిష్పత్తి ఎంత?**

ఎ) 10:2 బి) 3:1
సి) 6:2 డి) 4:2

**3. రాగి వేసవి పంటగా ఎప్పటి లోపు వేసుకోవాలి?**

ఎ) జనవరి మొదటి వారం లోపు
బి) ఫిబ్రవరి మొదటి పక్షం లోపు
సి) మార్చి
డి) డిసెంబర్

**4. పరపరాగ సంపర్కంలో ఉపయోగపడే కీటకాలను సంరక్షించుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు?**

ఎ) ఈ కీటకాలకు ఆహారాన్ని అందించే (పుప్పొడి, మకరందం) పుష్పించే రకాల మొక్కలను పెంచడం
బి) చీడపీడలను నివారించుటకు సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటించడం.
సి) అవసరాన్ని బట్టి ఈ కీటకాలపై అతి తక్కువ ప్రభావం చూపే పురుగుమందులను వాడటం.
డి) పైవన్నీ

**5. కాలీఫ్లవర్ పంటలో ఆకులు పసుపుగా మారి అంచులు తెల్లబడటంతోపాటు మధ్య ఈనె కొరడా వలే మారడం వంటి లక్షణాలు ఏ ధాతు లోపం వలన కనబడుతుంది?**

ఎ) మాలిబ్డినం బి) బోరాన్
సి) జింక్ డి) నత్రజని

**6. నేలల్లో సేంద్రియ కర్బనము పెంచడానికి ఎలాంటి సూచనలు పాటించాలి?**

ఎ) పచ్చిరొట్ట ఎరువులు వాడటం
బి) సేంద్రియ ఎరువులు వాడటము
సి) పంటల సరళిని మార్చుకోవడం
డి) పైవన్నీ

**7. డైకాల్షియం ఫాస్ఫేట్‌లో భాస్వరం ఎంత శాతం ఉంటుంది?**

ఎ) 24% బి) 34%
సి) 12% డి) 60%

**8. ఆడ మొక్కల వెన్నులు పోటాకు నుండి పూర్తిగా బయటకు రావడానికి మరియు పువ్వు చాలా సమయం విప్పారి ఉండుటకు ఏమి పిచికారి చేయాలి?**

ఎ) ఎసిటిక్ ఆమ్లం
బి) జిబ్బరెల్లిక్ ఆమ్లం
సి) ఇండోల్ బ్యుట్రిక్ ఆమ్లం
డి) నాఫ్థలీన్ ఎసిటిక్ యాసిడ్

**9. వర్మికంపోస్ట్‌లో పశువుల ఎరువుల కన్నా దాదాపు ఎంత శాతం అధికంగా సూక్ష్మపోషకాలు ఉంటాయి?**

ఎ) 80% బి) 70%
సి) 60% డి) 50%

**10. ఐ.సి.ఏ.ఆర్ ఆధ్వర్యంలోని జాతీయ కలుపు మొక్కల పరిశోధన సంచాలనాలయం ఎక్కడ ఉంది?**

ఎ) భోపాల్ బి) హైదరాబాద్
సి) జబల్‌పూర్ డి) న్యూఢిల్లీ

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు




## కేంద్ర విత్తన చట్టం ముసాయిదా బిల్లు పై సమావేశం

విశ్వవిద్యాలయ ఆడిటోరియం, రాజేంద్రనగర్‌లో నవంబర్ 28న కేంద్ర విత్తన చట్టం ముసాయిదా బిల్లు పై సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ గౌ॥ తుమ్మల నాగేశ్వర రావు గారు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ, వ్యవసాయంపై రాష్ట్రాలకే అధికారం ఉండాలని, కానీ ఈ కొత్త చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను కేంద్ర ప్రభుత్వం తీసుకుంటుందని, అదేవిధంగా రైతులు నష్టపోయినప్పుడు నష్టపరిహారం ఇచ్చే అంశం చట్టంలో లేకపోవడం దురదుష్టమని, రైతులని కంపెనీలు మోసం చేస్తున్నప్పుడు, రైతుల పరిస్థితి ఆగమ్య గోచరంగా ఉన్నప్పుడు వారిని ఆదుకోవడానికి అవసరమైన సవరణలని ఈ చట్టంలో ప్రతిపాదించాలని సూచించారు. వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ సూరేంద్ర మోహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ముసాయిదా విత్తన చట్టంపై రాష్ట్ర జిల్లా స్థాయిలో సేకరించి ముఖ్యమంత్రి గారు, వ్యవసాయ శాఖా మంత్రి గార్ల అభిప్రాయాలతో కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయనున్నారని తెలిపారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, 60 ఏళ్ళ తర్వాత తీసుకొచ్చిన ఈ చట్టంలో రైతు ప్రయోజనాల కోసం అనివార్యంగా సవరణలు చేయాలని, రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా కేంద్రం ఒక మోడల్ చట్టాన్ని తీసుకురావాలని దాని పరిధిలో రాష్ట్రాలు, స్థానిక పరిస్థితులకు అనువైన చట్టాలు రూపొందించుకునే అవకాశం ఇవ్వాలని అభిప్రాయపడ్డారు. రైతు సంఘం నాయకుడు శ్రీ సారంపల్లి మల్లారెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేకంగా చట్టం తీసుకురావాలని అన్నారు. ప్రొ॥ కోదండరాం మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం నిబంధనలు స్పష్టంగా ఉండాలని అలాగే శిక్షలు కఠినంగా ఉండేలా చట్టం ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర స్థాయి వ్యవసాయ సంబంధిత ఉన్నతాధికారులు, వర్సిటీ ఉన్నతాధికారులు మరియు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## వియాత్నం సంస్థతో విశ్వవిద్యాలయం అవగాహన ఒప్పందం

విశ్వవిద్యాలయం వియాత్నం సంస్థతో నవంబర్ 7న వ్యవసాయ, ఉద్యాన పంటల వ్యర్థాలు, మాంసం వ్యర్థాలు, గుడ్రపు దెక్క తదితర అన్ని జీవ వ్యర్థాల నుండి జీవ ఎరువులను ఆరు గంటల్లో తయారు చేసే పరిజ్ఞానాన్ని మరియు యంత్ర పరికరాన్ని బయోవే వియాత్నం సంస్థ నుండి పిజెటిఏయు కి ఉచితంగా అందించే అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి ప్రొ॥ అల్దాస్ జానయ్య మాట్లాడుతూ, జీవ వ్యర్థాలను జీవ ఎరువుల తయారీకి వినియోగించడం వల్ల ప్రకృతిలో కాలుష్యం తగ్గుతుందని, రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గిస్తారని విశ్వాసం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు మరియు వియాత్నం సంస్థకు సంబంధించిన ప్రతినిధులు పాల్గొన్నారు.

## 150 సంవత్సరాల వందేమాతరం వేడుకలు

వందేమాతర గీతం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నవంబర్ 7న విశ్వవిద్యాలయ పరిపాలన భవనంలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డా॥ జి.ఇ.సి.హెచ్. విద్యాసాగర్ వందేమాతర గీత ప్రాముఖ్యాన్ని, స్వాతంత్ర్య సమరంలో ఈ గీతం జాతిని జాగృతం చేసిన చరిత్రని వివరించడం జరిగింది. అనంతరం సామూహికంగా వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ అధికారులు, బోధన మరియు బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే

వ్యవసాయ కళాశాల, సిరిసిల్లలో నవంబర్ 15న గ్రీన్ గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా కొత్తగా చేరిన అండర్ గ్రాడ్యుయేట్ విద్యార్థులలో పర్యావరణ పరిరక్షణను పెంపొందించడానికి ఒక్కొక్క విద్యార్థి ఒక్కో మొక్కను నాటి, దానిని 4 సంవత్సరాలు పెంచి దానితో దిగిన ఫోటోను ప్రతి విద్యార్థి డిగ్రీ సర్టిఫికేట్‌లో పొందుపరచడం జరుగుతుంది.

## శాస్త్రవేత్తలు - వ్యవసాయ మహిళల పరస్పర సమావేశం

విశ్వవిద్యాలయ పరిధిలోని అఖిల భారత సమన్వయ గృహ విజ్ఞాన పరిశోధన పథకం, పోస్ట్‌గ్రాడ్యుయేట్ & రీసెర్చ్ సెంటర్ వారు నవంబర్ 14న మల్కారం గ్రామం, శంషాబాద్‌లో శాస్త్రవేత్తలు - వ్యవసాయ మహిళల పరస్పర సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆహారంలో చిరుధాన్యాల ప్రాముఖ్యత, ఆరోగ్యకరమైన ఆహారం, స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు ఆహారంలో చేర్చడం వంటి అంశాలపై మహిళలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ మహిళలు పాల్గొన్నారు.

డా॥ వి. సుధాకర్, పిఆర్ఓ మరియు మార్ప్స్ బాబు

# యాసంగిలో జీరో టిల్లేజ్ పద్ధతిలో వరి తర్వాత ప్రొద్దుతిరుగుడు సాగుతో అధిక లాభం ఆర్జిస్తున్న రైతు విజయగాథ

డా॥ సిహెచ్. పల్లవి

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తోర్నాల, సిద్దిపేట







తెలంగాణలో ప్రస్తుతం నీటి వసతి సౌకర్యం పెరగడం వల్ల రైతులు వానాకాలం మరియు యాసంగి రెండు కాలాల్లోను వరి సాగుకు మొగ్గు చూపుతున్నారు. దీని వల్ల వరి విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వరుసగా వరి సాగు చేయడం వలన చౌడు నేలలు, మురుగు నీటి సమస్య, పురుగులు మరియు తెగుళ్ల ఉధృతి తదితర సమస్యలు తలెత్తుతాయి. ఈ పరిస్థితులలో పంట వైవిధ్యీకరణ చేపట్టడం అవసరం. వానాకాలం వరి సాగు అనంతరం యాసంగి ఆరుతడి పంటలు పండించిన ఎడల నేలలో భూసారం పెరుగుతుంది, ఎరువుల వినియోగం, చీడపీడల ఉధృతి మరియు సాగు ఖర్చు తగ్గుతుంది. పంటల దిగుబడులు పెరిగి అధిక ఆదాయం పొందవచ్చు. పంట వైవిధ్యీకరణలో భాగంగా యాసంగిలో వరికి బదులుగా, వరి మాగాణుల్లో మరియు ఆరుతడి పంటగా ప్రొద్దుతిరుగుడు లాభదాయక ప్రత్యామ్నాయ పంట, తక్కువ కాల పరిమితి కలిగి త్వరగా పెరిగే గుణం ఉండి, ఏ కాలంలోనైన పండించుటకు అనువైన పంట ప్రొద్దుతిరుగుడు. వానాకాలంలో వరి పంటను కోసిన తర్వాత లేదా జీరో టిల్లేజ్ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడును నవంబర్ మరియు డిసెంబర్ నెలలో విత్తుకోవచ్చు. వరికోతలు ఆలస్యమైన ప్రాంతాలలో మరియు వేసవిలో జనవరి రెండవ పక్షం నుండి ఫిబ్రవరి మొదటి పక్షం వరకు విత్తుకోవచ్చు. సిద్దిపేట జిల్లాలో సాధారణంగా 11 వేల ఎకరాల్లో ప్రొద్దుతిరుగుడు సాగు చేస్తున్నారు. వరి తర్వాత మరల వరి వేయడం వల్ల యాసంగిలో పురుగులు, తెగుళ్ళు, చీడపీడలు వచ్చి పంట దిగుబడి తగ్గడం, నేల భూసారం తగ్గిపోవడం జరుగుతుంది. కావున రైతులు వానాకాలంలో వరి తర్వాత జీరో టిల్లేజ్ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడును సాగు చేసినట్లైతే సాగు ఖర్చు తగ్గి, అధిక దిగుబడులతో పాటు నేలలో భూసారం పెరుగుతుంది.

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తోర్నాల వారి సలహా మేరకు ఘనపూర్ గ్రామ రైతు అక్కం స్వామి తనకున్న 3 ఎకరాల భూమిలో వరి తర్వాత ప్రొద్దుతిరుగుడును సాగు చేసి సాధారణ పద్ధతి కంటే జీరో టిల్లెజ్ పద్ధతిలో సాగు చేసినప్పుడు ఎకరానికి 2500 రూపాయలు సాగు ఖర్చు తగ్గించుకున్నాడు, 0.37 క్వింటాళ్ళ అధిక దిగుబడిని సాధిస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారు.

**రైతు అవలంభించిన పద్ధతులు:** తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, తోర్నాల వారి సలహా మేరకు రైతు వరికోతల తర్వాత జీరోటిల్లేజ్ పద్ధతిలో డిసెంబర్ నెలలో తనకున్న 3 ఎకరాల భూమిలో ప్రొద్దుతిరుగుడు రకం (తిల్హన్ టెక్- ఎస్.యు.యెన్.హెచ్-1) ఎకరానికి 2.5-3.0 కిలోల విత్తనాన్ని జీరో టిల్లేజ్ పద్ధతిలో 45 సెం.మీ. × 20-25 సెం.మీ. దూరం ఉండేలా 5 సెం.మీ లోతులో చిన్న రంధ్రం చేసి విత్తనాన్ని విత్తుకున్నాడు. పంట మొదటి దశలో ఆశించే చీడపీడల నివారణకు విత్తన శుద్ధి చేసుకున్నాడు. ప్రొద్దుతిరుగుడు విత్తే ముందుగా పద్ధతి ప్రదర్శనలో భాగంగా వరికొయ్యకాళ్ళను ష్రెడ్డర్ కం మల్చర్‌తో చిన్నచిన్న ముక్కలుగా చేసిన తర్వాత విత్తనం విత్తడం జరిగింది. ప్రొద్దుతిరుగుడులో మొదటి 20-25 రోజులు కీలక దశ. పంట 25-30 రోజుల దశలో దంతె ద్వారా కలుపు నివారణ మరియు

బోదెలు ఎగదోయడం జరిగింది. ఎకరాకు 65 కిలోల యూరియా, 225 కిలోల భాస్వరం మరియు 20 కిలోల పొటాషియం ఎరువులు వేశాడు. నత్రజని ఎరువులను సగం విత్తే ముందు, మిగతా సగం 2 దఫాలుగా 30 రోజులు మరియు 55 రోజులకు వేసుకున్నాడు. బోరాన్‌ను పూత దశలో 2 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి కలిపి పిచికారి చేశాడు. నూనె శాతం పెరగడానికి ఒక ఎకరాకు 55 కిలోల జిప్సమ్ ని వేసుకున్నాడు. పువ్వు వెనక భాగం నిమ్మ పచ్చ రంగులోకి మారిన తర్వాత కోత యంత్రం చేత పంటను కోసాడు. మొత్తంగా 90-100 రోజుల్లో 3 ఎకరాల్లో దాదాపుగా 25.5 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. క్వింటా ప్రొద్దుతిరుగుడు మద్దతు ధర 7280/- రూపాయలు చొప్పున అమ్మడం వలన తనకు ఎకరాకు 61,880/- రూపాయల చొప్పున మొత్తం 25.5 క్వింటాళ్ళకు గాను రూ. 1,85,640/- ఆదాయాన్ని పొందారు.

**ప్రొద్దుతిరుగుడు పంట సాగు వివరాలు (ఒక ఎకరాకు)**

| క్ర.సం. | వివరాలు | ప్రొద్దుతిరుగుడు సాగు ఖర్చు (రూ./ఎకరా) | జీరో టిల్లేజ్ పద్ధతి సాధారణ పద్ధతి |
|---|---|---|---|
| 1. | నేల తయారీ | - | 4,500 |
| 2. | విత్తన ఖర్చు (2 కేజీలు) | 2,500 | 2,500 |
| 3. | విత్తడానికి అయ్యే ఖర్చు (6 కూలీలు) | 2,400 | 2,400 |
| 4. | కలుపు యాజమాన్యం | 600 | 600 |
| 5. | ఎరువులు | 3,750 | 3,250 |
| 6. | పురుగు మందులు మరియు పిచికారి ఖర్చు | 2,500 | 1,500 |
| 7. | నీటి తడుల ఖర్చు | 1,000 | 1,000 |
| 8. | కోత ఖర్చు, (8 కూలీలు) నూర్పిడి/కంబైన్డ్ హార్వేస్టర్ | 6,250 | 6,250 |
| | మొత్తం సాగు ఖర్చు | 19,500 | 22,000 |
| | దిగుబడి (క్వి./ఎకరానికి) | 8.50 | 8.13 |
| | స్థూల ఆదాయం | 61,880 | 59,186 |
| | నికర ఆదాయం | 42,880 | 37,186 |
| | నికర ఆదాయం : ఖర్చు నిష్పత్తి | 1:3.25 | 1:2.69 |

**సుస్థిరత్వం కొనసాగింపు:** ఘనపూర్ గ్రామ రైతులు అక్కం స్వామిని ఆదర్శంగా తీసుకుని యాసంగిలో వరి తర్వాత ప్రొద్దుతిరుగుడును సాగు చేసి సాధారణ పద్ధతి కంటే జీరో టిల్లేజ్ పద్ధతిలో సాగు చేసి ఖర్చు తగ్గించుకోవడమే గాక, అధిక దిగుబడులతో పాటు వరి కొయ్యలు కాల్చకుండా నేలలో భూసారం పెంపొందించుకోవడానికి రైతులు జీరో టిల్లేజ్ పద్ధతిలో ప్రొద్దుతిరుగుడు సాగు చేయాలని నిర్ణయించుకున్నారు.

**రైతుల అభిప్రాయం:** రైతులు యాసంగిలో వరి తర్వాత ప్రొద్దుతిరుగుడును సాగు చేయడం వల్ల మంచి దిగుబడులతో పాటు సాగు ఖర్చు తగ్గించుకున్నామని చెప్పడం జరిగింది. జిప్సం మరియు బోరాన్ వేయడం వల్ల గింజ బరువు అధికంగా వచ్చింది. ప్రొద్దుతిరుగుడు పంట తర్వాత వానాకాలంలో వరి వేసినప్పుడు పంట మార్పిడి జరిగి అధిక దిగుబడులు వస్తాయని రైతు ఆశాజనకంగా ఉన్నారు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8332970251**

**47వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు : 1. సి 2. సి 3. బి 4. డి 5. ఎ 6. డి 7. డి 8. బి 9. డి 10. సి**

# మామిడిలో పండు ఈగ మరియు టెంక పురుగు - సమగ్ర సస్యరక్షణ

డా॥ బి. వెంకట రాజ్ కుమార్, డా॥ ఎ. విజయ భాస్కర్, డా॥ ఆర్. విశ్వతేజ మరియు డా॥ ఆర్. ఉమా రెడ్డి

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, వరంగల్




తోటలో నేలను దున్ని కోశస్థ దశను నాశనం చేయడం

రాలిన మరియు కుళ్ళిన పండ్లను ఏరి నాశనం చేయడం

పండు ఈగ నివారణ - పండ్లను కాగితపు సంచులతో కప్పడం

ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవడం

టెంక పురుగు నివారణ - జీవ శిలీంద్రం బవేరియా బాసియాన పిచికారి చేసుకోవడం

RNI No : TELTEL/2015/60296 December, 2025 Postal Regd.No:HSE/1013/2024-2026
Total No. of Pages : 52 Date of Publication : 06.12.2025
Date of Posting : 09.12.2025

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001



**వ్యవసాయం: సంక్షిప్త సమాచార మాస పత్రిక - లాభసాటి సేద్యానికి కరదీపిక**

To

*Striving for a greener tomorrow...*

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. C. Padma Veni on behalf of Professor Jayashankar Telangana Agricultural University, Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. C. Padma Veni, RNI File No. 1262077, Title-Code: TELTEL00152